
ఆంధ్రజ్యోతి
1ST JULY '47
6
as




## పెద్దలకు విజ్ఞప్తి

చందమామ పత్రికను మీరు చూసే ఉంటారు. దానిలో పిల్లలకు ఉపయోగపడే కొత్త శీర్షికలుగాని, ఏమైనా ఉంటే తెలిపితే కృతజ్ఞతతో అందుకుంటాము. తరువాత పత్రిక విషయమై తమ అభిప్రాయాలు తెలుపమని ప్రతి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కోరుతున్నాము.

★

సాలు చందా రు. 3—0—0

విడి ప్రతి 0—4—0



# తాజా

## చెరకు పంచదార...

స్వీట్స్‌లో ఉపయోగించే వస్తువులలో తాజా చెరకు పంచదార, శుద్ధమైన గ్లూకోజు చాలా ముఖ్యమైనవి. సావరిన్ స్వీట్స్‌లో శ్రేష్ఠమైన, పరిశుద్ధమైన పంచదార, గ్లూకోజు ఉపయోగించబడ్డవి. మీకు ఏది రుచో చూడడానికి మా దగ్గర ఉన్న కొన్నిరకాలు తీసుకొని చూడండని మా సలహా. మా స్వీట్స్ చాలా రుచిగా ఉంటువని అనేక వేలమంది పిల్లలు మాకు చెప్పారు... వాళ్ళకు తప్పకుండా తెలుసు.



దేశమంతా ఆదరించబడినవి



## సావరిన్ స్వీట్స్

కె. సి. పి. తయారీ

KCK 476



## స్వర్ణోత్సవ - ఆగమనసందర్భంలో






## పండిత డి. గోపాలాచార్యులవారి

# జీవామృతము

50 యేండ్లుగ ప్రజానీకమునకు అమూల్య సేవ చేయుచు, ప్రజల ఆరోగ్యమును పెంపొందించుచు, ఆనంద సంతృప్తులను కల్గించి, ప్రజానురంజకమైనదని వెల్లడించుటకు గర్వించుచున్నాము.

## ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్

టి. నగర్.... మద్రాసు.

EASTERNS 379.


Women's Crowning Glory
SRIVIS-AMLA
-Hair oil-
స్త్రీల ఆరాధ్య దేవత
అని చెప్పబడుతోంది.
"శ్రీవిస్ - ఆమ్లా"
తలనూనె
Manufacturers.
SRIVIS PERFUMERY WORK
44, BUNDER ST. : G. T. MADRA

నమ్మకమైన ఆభరణములకు

VEECUMSEE Jewellers

ESTD:- 1893

DIAMOND MERCHANTS

హెడ్ ఆఫీసు: చైనాబజారు — ఫోన్. 2072

త్యాగరాయనగర్ బ్రాంచి

శాంతీ నివాస్ - నాయర్‌రోడ్ వద్ద

ఫోన్: 88082

ఆఫీసుకాలము: ఉ. 8 గం. నుండి రా. 8 గం. వరకు.

ఉమా బ్రాండ్ ఆభరణములు

అమూల్య లోహముపై అసలు బంగారు రేకు అంటించి తయారుచేసిన ఆభరణములు

340

Rs. 2-0-0




Rs. 2 12 0

ప్రతి వస్తువు మీద **UMA** ఇంగ్లీషు అక్షరములు గుర్తించి కొనవలయును.

10 సంవత్సరములు గ్యారంటీ

600 రకములుగల కేట్లాగు ఉచితము. నేడే వ్రాయండి.

ఉమాగోల్డ్ కవరింగ్ వర్క్సు, ఉమామహల్

ఉమా గోల్డ్ కవరింగ్ వర్క్సు P.O.

మచిలీపట్టణము.

# మాల్కాన్ పెయిన్ బామ్

(అన్నివిధముల నొప్పులకు)

**స్కాబిజోల్** (తీట, గజ్జి, కురుపులు గడ్డలకు)

టవర్ మార్కు

**పండ్లపొడి** (దంత శుభ్రతకు)

వీటిని ప్రసిద్ధ డాక్టర్లు సిఫారసు చేయుచున్నారు. ఎందుకన,
అవి ప్రత్యేక గుణములు గలిగియున్నవి.

అన్నిచోట్ల ఏజెంట్లు కావలెను

వివరములకు:

MALKAN PRODUCTS CO.,

**KURLA :: BOMBAY.**





సూచనలు కనిపించిన తక్షణమే
పిల్లల లివరు స్ప్లీను వ్యాధులకు

జమ్మివారి

# లివర్ క్యూర్

వాడండి.

అన్ని మందుల షాపులలోను దొరకును.

హూ క్రో
కోరింతదగ్గుకు తిరుగులేని ఔషధం.

జమ్మి వెంకటరమణయ్య & సన్సు హెడ్ ఆఫీసు మైలాపూరు మద్రాసు.

స్త్రీకి సంతానం సహజమైన కోరిక

# లోధ్ర



దానిని సఫలత నొందిస్తుంది★

లోధ్ర అంతటా దొరుకును



కేసరికుటీరం లిమిటెడ్.
మదరాస్

# ఈస్టు అండ్ వెస్టు

## ఇన్షూరెన్సు కంపెనీ, లిమిటెడ్, బొంబాయి.

[1913 లో స్థాపితం]

ప్రధాన కార్యాలయం :

'ఈస్టు అండ్ వెస్టు బిల్డింగ్', ఫోర్టు, బొంబాయి.

33 సంవత్సరాలుగా దేశసేవచేస్తూ జాతీయోన్నతి సంపాదిస్తూ ఉన్న ప్రముఖ భారతీయ భీమాసంస్థ.

ఆర్థికంగా సుస్థిరమై. పాలసీదార్లతోనూ, ఏజంట్లతోనూ వ్యవహరించుటలో సంస్కారానికి పేరెన్నికగన్న సంస్థ.

1944 లో జరిపిన అదనపువ్యాపారం కోటిరూపాయలు మించింది.

చురుకైనటువంటిన్నీ, పలుకుబడి కలిగినటువంటిన్నీ వ్యక్తులు ఏజన్సీలకొఱకు దరఖాస్తులు పెట్టుకోవచ్చును.

<u>వివరాలకు:</u>

శ్రీ జె. యస్. రెడ్డి
బ్రాంచి సెక్రటరీ.,
377, ఎస్ప్లనేడ్,
మద్రాసు.

★

శ్రీ ఎ. వెంకటరెడ్డి
ఇన్స్పెక్టర్ ఆఫ్ ఏజన్సీస్.
మోదుకూరు. వయా—పొన్నూరు.
గుంటూరు జిల్లా.

శ్రీ యస్. మల్లికార్జునరావు. ఆర్గనైజింగ్ సెక్రటరీ, బెజవాడ.

# మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్నయెడల వెంటనే

పాత్రుడు గారి

# బాల సంజీవిని

యీ యండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

## డా॥ పిళ్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,

11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళై పిళ్ళే వీధి,
తెప్పకొలం.

# బిటాకేఫిన్

(తలనొప్పి బిళ్లలు)




అన్ని నొప్పులను, జ్వరములను కుదుర్చును.

తలనొప్పి, పంటినొప్పి, కాళ్లనొప్పి, నిద్రలేకుండుట, కీళ్ళనొప్పులు, మలేరియా, స్త్రీల బహిష్టు నొప్పులు, అలసట వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును. వాడుకొను విధము పొట్లములో నుండును.

పొట్లం 3 బిళ్లలు **1 అణా.**

స్టాకిస్టులు: దాదా అండ్ కంపెనీ, పి. టి., మద్రాసు.

అన్నిచోట్ల దొరకును.

తయారుచేయువారు:

*Stockists:*—M/S DADHA & CO, P. T. MADRAS.

*Manufactured by*—**BOMBAY TABLET MANUFACTURING CO.,**

**Post Box No. 2092, BOMBAY. 2.**

*To be sure of your success in English*

# IN THE S. S. L. C. EXAMINATION OF—1948

## BE SURE OF YOUR COPY

OF

Popular Notes & Text Examiner on The English Prose & Poetry

BY

**N. PARAMASIVA AIYAR, B. A., L. T.**

*Reputed Head-Master and Author of S. S. L. C. English Notes*

**Rs. 2—8—0**

Supplement your Knowledge by studying

**TEST PAPERS IN ENGLISH I & II PAPER 1-0-0**

(READY ON 1st SEPTEMBER 1947)

Along with the Notes & Examiner on The English Non-Detailed Texts

1. STORIES FROM TAGORE 0-8-0
2. NAGANATHAN AT SCHOOL 0-8-0
3. MADAME CURIE 0-8-0
4. EXPLORING THE FRONTIERS 0-8-0

*Sole Distributors:*

## PALANIAPPA BROS.

TEPPAKULAM :: TRICHINOPOLY

## ఈ సంచికలో కొందరు రచయితలు

నార్ల
శిష్ట్లా
విశ్వనాధ కవిరాజు
భానుమతి
చాణక్య
పద్మరాజు
గిరిరావు
పనిలేని మంగలి

బి. వి. సుబ్రహ్మణ్యం వగైరాలు.

---

# ఆంధ్రజ్యోతి నిబంధనలు

★ చందాదారులకు : ఆంధ్రజ్యోతి సంవత్సరం చందా రు. 5-8-0. అర్ధ సంవత్సరం రు. 3-0-0. వి. పి. ద్వారా అయితే మూడణాలు ఎక్కువ అవుతుంది. మాదిరికాపీ కావాలంటే ఆరణాల తపాలా బిళ్లలు పంపాలి.

★ వ్యాసకర్తలకు : వ్యాసకర్తలు తమ వ్యాసంతోపాటు 0-0-9 బిళ్ళ పంపితే ప్రకటించదలచని వ్యాసాలు తిప్పి పంపుతాము. ప్రకటించదలిస్తే తెలుపుతాము.

★ ఏజంట్లకు : ఏజంట్లు కాగోరువారు ఆఫీసుమేనేజరుకు వ్రాసి ఏజంట్ల ఫారం తెప్పించుకోవచ్చును. ఆ నిబంధనలకు ఒప్పుకున్నమీదటనే వారి ఏజన్సీ ధృవపరచబడును.

★ ప్రకటనదారులకు : ఆంధ్రజ్యోతిలో ప్రకటన చేయదలచుకున్నవారు మేనేజరుకురాస్తే ప్రకటనలరేట్లు పంపుతాము. కాని ప్రకటన చూసినమీదటనే అది వేయదగినదీ లేనిదీ నిర్ణయించబడుతుంది.

మేనేజర్ : ఆంధ్రజ్యోతి,

37, ఆచారప్పన్ వీధి, జి. టి. మదరాసు.

ఆంధ్రజ్యోతి

......సచిత్ర మాస పత్రిక......

సంపాదకుడు : చక్రపాణి

సంపుటి 8] 1 జూలై 1947 [సంచిక 1

# మా మా ట లు

ఆంధ్రజ్యోతికి రెండేళ్ళు నిండినవి. మూడో సంవత్సరం ప్రవేశించింది. ఈ రెండు సంవత్సరాలుగా ఆంధ్ర రచయితలూ, పాఠకులూ మా పత్రికపట్ల చూపుతున్న సహకారానికి వారికి మే మెంతో కృతజ్ఞులము.

ఈ సందర్భంలో మా మాట ఒక్కటి చెప్పవలసి ఉన్నది. ఆంధ్రజ్యోతి ప్రప్రథమంనుంచీ కాంగ్రెసు అభిప్రాయాలనే ప్రచారంచేస్తూ వచ్చింది. అంతేగాని ఏ ఒక వ్యక్తి గొప్పనూ ప్రచారంచేయలేదు. ఇకముందుకూడా అంతే.

ప్రజలకోసం నాయకులుకాని, నాయకులకోసం ప్రజలుకారు. ఈ సంగతి గమనించిన నాయకులకు ఆంధ్రజ్యోతి సహకారం ఎప్పుడూ ఉంటుందని మేము వేరుగా చెప్పనక్కరలేదు. ఇదే మేము మా పాఠకులతరఫునకూడా చెప్తున్నాము.

# హరిజనులు

## హరిజన సేవా సంఘాలు

ప్రాంతీయ హరిజన సేవాసంఘాలు నడుపుతున్న విద్యార్థివసతి గృహాల నిర్వహణాన్ని గురించి కొన్ని వివరాలు మాకు తెలియవచ్చాయి. వాటినిబట్టి చూస్తే వారి పరిస్థితులు చాలా విషాదకరంగా పరిణమిస్తూ ఉంటాయని అనిపిస్తోంది. కేంద్ర హరిజనసేవా సంఘంవారు, హరిజనసేవ మీద అభిమానమున్న పెద్ద నాయకులు, ఈ పరిస్థితులనన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోకపోతే ఈ ఉద్యమం పెడతలలుపట్టి, ఇన్నాళ్లు చేసిన కృషి అంతా విఫలమయిపోయేటట్టు కనిపిస్తున్నది.

కాలేజీలలో చదువుకునే హరిజన విద్యార్థులకు రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు రెండూ విద్యార్థి వేతనాలు ఇస్తున్నాయి. ఒక హాస్టలునించి మాకు చేరిన వార్తలను బట్టి ఈ వేతనాలలో చాలాభాగం వసతి గృహానికి కట్టవలసిఉంది. సాధారణంగా ఈ రెంటిలో ఏదో ఒక వేతనం లభించని హరిజన విద్యార్థి ఉండడు. ఏ వేతనాన్నీ పొందని విద్యార్థికూడా ఉంటే, ఈ వసతి గృహానికి కొంతసొమ్ము చెల్లించాలి. మొత్తంమీద విద్యార్థులకోసం కర్చుపెట్టేది - వసతికి, భోజనానికీ కలిపి, నెలకు రు 15/- దాటకూడదు. విద్యార్థుల దగ్గరనించి హరిజనసేవా సంఘాలు వసూలుచేసేది మొత్తంమీద బొటాబొటీగా వసతి గృహ నిర్వహణానికి సరిపోతుంది. కాలేజీలో చేరగానే ఈ హరిజన విద్యార్థులకు వసతికి, భోజనానికి అనువుగా ఎక్కడా కుదరదు. అంచేత వారు సిద్ధంగా ఉన్న ఈ వసతి గృహాలలో ప్రవేశిస్తారు. మొదటి నెలల్లో తెచ్చుకున్నదానితో కొన్నాళ్ళు జరిగిపోతుంది. ప్రభుత్వం ఇచ్చే వేతనాలు రావడానికి కొంత ఆలస్యం అవుతుంది. అప్పుడు నిర్వాహకులను డబ్బు అడిగితే, 'మీరు కట్టవలసిన డబ్బు కట్టండి' అంటారు. ఈ వేతనాలు చేతికి అందేవరకూ విద్యార్థులు వీరినీ వారినీ బ్రతిమాలి కోమటి కొట్లమీద ఎంతో మొగమాటంపెట్టి అప్పులుతెచ్చి గడుపుకోవలసి వస్తోంది. డిసెంబరుముందు వారు పడేపాట్లు ఇన్నీ అన్నీ కాదు. ఒక మూల పరీక్షలు.

రెండోపక్కని తీర్చవలసిన అప్పులు, మూడోవేపు ఏ రోజు కారోజుకి కావలిసిన సరుకులు అప్పుతెచ్చుకోడం.

ఈ పరిస్థితుల్లో విద్యార్థుల మనస్సుల్లో ఏమీ చెయ్యలేని కోపం, ఫలితంలేని దుగ్ధ, ఈర్ష్య పట్టుకు బాధిస్తాయి. ఈ నిర్వాహకులంటే వాళ్ళకి చెప్పరాని అసహనం. ఈ అసహనం, ఈర్ష్య హరిజనోద్యమం అంతటిమీద, చివరకి మహాత్మా గాంధీగారి మీదికి కూడా పాకుతోంది. ప్రాంతీయనాయకుల ఉపన్యాసాలన్నీ వట్టి బూటకాల్లాగ వాళ్ళకి కనిపిస్తాయి. వారంతా మోసగాళ్ళలాగ కనిపిస్తారు. ఇంటర్మీడియేటు చదువుకునే విద్యార్థికి వసతిగృహంతాలూకు జమాఖర్చులన్నీ స్పష్టంగా తెలుస్తాయి. తాము ఇచ్చే డబ్బుతోనే అంతా నడిపిస్తూ, తమకు అవసరం వచ్చినప్పుడన్నా ఆదుపడకుండా, తమ తంటాలు తమకు వదలివేసి, ఈ నాయకులంతా ప్రగల్భాలు చెప్పుకుని ప్రజలను మోసపుచ్చడానికి వీటిని వినియోగిస్తున్నారని చాలామంది హరిజన విద్యార్థుల దృఢనమ్మకం. వీరిలో చాలామంది అంబేద్కర్ భక్తులు. ప్రతివిద్యార్థి పుస్తకాలమీదా 'జయభీమ్' అని వ్రాసి ఉంటుంది.

వీరికి డాక్టర్ అంబేద్కర్‌మీద భక్తికుదరటానికి కారణం లేకపోలేదు. రాష్ట్రీయప్రభుత్వం హరిజన విద్యార్థికి సంవత్సరానికి 150 రూపాయలు మాత్రమే యిస్తూవుంటే, (ఇప్పుడిది ప్రభుత్వం 300 లకు పెంచారు.) డాక్టర్ అంబేద్కర్ కేంద్రప్రభుత్వ మిస్తూవున్న వేతనాన్ని 500 రూపాయలు చేయించాడు. ఇలాంటి మేలు జరుగుతూవున్నప్పుడు అతనిమీద భక్తిగౌరవాలు ఎలాలేకుండా పోతాయి ?

హరిజన ఉద్యమం బయలుదేరింది హరిజన సముద్ధరణకోసమేకదా. కేవలం కొంతమంది వ్యక్తులు పేరుప్రతిష్ఠలు, అధికారం సంపాదించుకొనటానికనే కాదుగా? అలాంటప్పుడు హరిజన విద్యార్థులకు రాష్ట్రీయప్రభుత్వమిచ్చే వేతనాలు కనీసం వారి భోజనవసతులకన్నా సరిపోవాలి. ఈపని సాధించవలసిన బాధ్యత హరిజన ఉద్యమ నాయకులమీద ఉన్నది. కేంద్రప్రభుత్వంతో సమానంగా రాష్ట్రీయ ప్రభుత్వంచేత వేతనాలు ఇప్పించలేనంతకాలం హరిజనవిద్యార్థులకు డాక్టర్ అంబేద్కర్‌మీదఉన్న గౌరవాన్ని కాదనటానికి ఎవరికీ అర్హతలేదు.

రెండోది. ఈ వసతిగృహాల నిర్వహణం సక్రమపద్ధతిలో నడవాలి. భోజన వసుపాయాలు తక్కిన పై వర్గాలవారి పిల్లలకు ఏరకంగా జరుగుతున్నాయో ఆ రకంగా వీరికీ జరగాలి. అన్నీకలిసి రూ. 15/- దాటకుండా ఉండాలంటే తిన్నది ఏమూలకీ చాలదు. కాలేజీలకు అనుబంధించివున్న సవర్ణ వసతిగృహాలలో

ఎటువంటి భోజనం దొరుకుతుందో అల్లాంటి భోజనం వీరికికూడా దొరకాలి. అదీకాక ఈ రేషను రోజుల్లో సవర్ణ విద్యార్థులంతా హోటల్లో తినటమూ, నేతిక్రింద ఖర్చురాసి బియ్యంకొనిరావడమూ జరుగుతూవుంది. ఇలాంటి పరిస్థితిలో రేషనుగింజలతోనే, పైన ఫలహారంలేకుండా హరిజన విద్యార్థులు - ప్రక్క విద్యార్థులనుచూస్తూ, ఊరుకోవటం ఎంతకష్టమో ఊహించుకోవలసిందే. దీనికి తగినంతడబ్బు లేదంటారా, లేనప్పుడు, ఈ ఉద్యమం మానుకోవాలి. ప్రజాప్రభుత్వం అంటూ ఒకటిపైన ఉన్నప్పుడు, ఈ సదుపాయాలు కలగచెయ్యడం అసంభవం కాదని మా అభిప్రాయం. హరిజనులకు ప్రత్యేకించిన డబ్బులోంచి ఈ కొద్దిమంది విద్యార్థులకూ ఘనంగానే ఇవ్వవచ్చును.

ముఖ్యంగా నెలకొకసారి అయినా హరిజన విద్యార్థుల కష్టసుఖాలు కనుక్కొని, వాళ్ళ మంచీచెడ్డచూసి, మాటామంతీ ఆడడానికి తీరికవున్న నాయకులే తక్కువ. మొదట ప్రారంభించినప్పుడూ, చివరని మూసేటప్పుడూతప్ప మిగిలిన సంవత్సరంలో ముఖంచూపించని నిర్వాహకులంటే ఆ విద్యార్థులకు ఏమి గౌరవం ఉంటుంది ?

ఈ విషయాన్ని గురించి హరిజనోద్యమం నడుపుతున్న నాయకులూ, ప్రభుత్వమూ ఆలోచిస్తారనీ, తగినచర్య తీసుకుంటారనీ ఆశిస్తున్నాము.

[ఇది అచ్చుకు పోతూఉండగా మద్రాసు ప్రభుత్వంవారు షెడ్యూల్డ్ తరగతుల విద్యార్థులకు, కొండజాతులకు చెందిన విద్యార్థులకు కొన్ని సౌకర్యాలను కల్పిస్తూ ఆవిషయమై ఒక ప్రత్యేకప్రకటన చేశారు. దీనికి మేము ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాము. షెడ్యూల్డ్ తరగతుల విద్యార్థులకు, కొండజాతులకు చెందిన విద్యార్థులకు హాస్టల్సులో ముందు సదుపాయాలు కల్పించి తరువాత తదితర విద్యార్థులను చేర్చుకోవాలని అన్నారు. ఇది అత్యంత ప్రశంసనీయమనటంలో సందేహం ఏమాత్రం లేదు. కాని సవర్ణుల హాస్టల్సులో బ్రాహ్మణేతరుడు వంటవాడుగా ఉండటానికే అంగీకరించరు. అలాంటప్పుడు షెడ్యూల్డు తరగతులవారిని అంత తేలికగా చేర్చుకోవటం జరగదు. కాబట్టి తమ నిర్ణయాన్ని అమలు పరచటంలో ప్రభుత్వంవారు ఏమాత్రం అశ్రద్ధచూపరని ఆశిస్తున్నాము. సం॥ ఆం॥]



# కల్లోల ప్రపంచం

సార్థక్

ద్వితీయ ప్రపంచయుద్ధం ఏనాడో ముగిసింది. కాని, యుద్ధబాధలు ఈనాటికీ తగ్గలేదు. పై పెచ్చు, అవి పెరిగిపోయాయి.

అప్పటికంటె ఇప్పుడే ఆహారపదార్థాల కొరత అధికం. అప్పటికంటె ఇప్పుడే గుడ్డ యిబ్బంది ఎక్కువ. అప్పటికంటె ఇప్పుడే యిళ్ళకరువు మోపు. అప్పటికంటె ఇప్పుడే దైనందిన జీవితనిర్వహణ మరింత దుస్సహం. ఇది కేవలం మనదేశంలోనేకాదు. దాదాపు అన్ని దేశాలలోను పరిస్థితు లింతే.

యుద్ధంవల్ల అనేకచోట్ల పంటభూములు పాడైపోయాయి. వాటిని బాగుజేసుకోవడం ఇప్పటికీ పూర్తికాలేదు. దీనికితోడు గడిచిన రెండుసంవత్సరాలలో ఈతిబాధలవల్ల పంటలు చెడిపోయాయి.

యుద్ధంవల్ల అనేక ప్రదేశాలలో పరిశ్రమాగారాలు శిథిలమైపోయాయి. వాటిని పునరుద్ధరించుకొనడం ఇంకా పూర్తికాలేదు. యుద్ధంలోపోగా మిగిలిన పరిశ్రమాగారాలలోనైనా సమ్మెలవల్ల ఉత్పత్తి సరిగా సాగడంలేదు.

ఈ నెలలో (జూన్‌లో) వచ్చిన కొన్నివార్తలివి :—

చైనా : వరదదెబ్బకు వెయ్యిమంది చనిపోయారు; లక్షలాది నిరాధారులైపోయారు; ఒక పెద్దరాష్ట్రంలో వరిపంట పూర్తిగా ధ్వంసమైపోయింది.

ఇండియా : తెగులుపుట్టి, గోధుమపంట సగానికి సగం చెడిపోయింది, ఆగస్టునాటికి ఆహారపరిస్థితి అతివిషమం కావచ్చు.

యునైటెడ్‌స్టేట్సు : కార్మికోద్యమ నిరోధకశాసనంపట్ల నిరసనగా బొగ్గుగనులలోని వేలాది కార్మికులు సమ్మె ప్రారంభించారు. ఈ సమ్మె దేశంమొత్తంలో అన్ని పరిశ్రమలకు వ్యాపించవచ్చు.

జర్మనీ : రర్‌ప్రాంతంలో బొగ్గుగనుల కార్మికులు సమ్మెసాగిస్తున్నారు.

బ్రిటన్ : ఉత్పత్తి తగ్గిపోతున్నందున ఎగుమతివ్యాపారం మందగించవచ్చు; దానితో బ్రిటన్‌కు కావలసిన ఆహారపదార్థాలేమి, ప్రత్తి మొదలైన ముడివస్తువులేమి దిగుమతి చేసుకొనడంలో చిక్కు ఏర్పడవచ్చు.

ఫ్రాన్సు : దేశంమొత్తంపై సాగుతున్న సమ్మెల ఫలితంగా ప్రభుత్వానికి పతనప్రమాదం ఏర్పడింది. నియంతృత్వపరిపాలన తప్పకపోవచ్చు.

ప్రపంచపరిస్థితులు ఇంత అధ్వాన్నంగా వున్నప్పుడు తిన తిండికి, కట్ట గుడ్డకు, నిలవ నీడకు యుద్ధకాలంలోకంటె కూడా మిన్నగా ఈనాడు కటకట తప్పకపోవడంలో అబ్బురం లేదుగదా!

యుద్ధకాలంలో మానవకోటికి చేయబడిన ముఖ్యవాగ్దానాలలో ఒకటి.—"ఫ్రీడం ఫ్రం వాంట్" (కూడు - గుడ్డ - కొంపకొరతనుంచి విముక్తి) ఈ వాగ్దానాన్ని చెల్లించడానికి తగుప్రయత్నాన్ని చేయడానికి మారుగా, ప్రపంచాధిపత్య సాధనకై అగ్రరాజ్యాలన్నీ నేడు

ప్రయత్నంచేస్తున్నాయి; ద్వితీయ ప్రపంచమహా సంగ్రామానికి ప్రత్యక్షఫలితంగా తృతీయ మహాసంగ్రామాన్ని అనివార్యం చేస్తున్నాయి.

*　　*　　*

ఇదివరలో పెక్కుసార్లు ఈ "కల్లోల ప్రపంచం" వ్యాసావళిలో వివరించబడినట్టు, నాలుగు ప్రధానశక్తులు నేడు సంఘర్షిస్తున్నాయి. అవి యివి :

(1) ప్రపంచాధిపత్యాన్ని సాధించగోరుతున్న డాలర్ యింపీరియలిజం.

(2) ప్రపంచవిస్తరణను అభిలషిస్తున్న సోవియెట్ కమ్యూనిజం.

(3) సంపూర్ణ వినాశనాన్ని తప్పించుకొనడానికి పెనగులాడుతున్న కలోనియల్ యింపీరియలిజం.

(4) దాస్య విముక్తికై పోరాడుతున్న ప్రాచ్యజాతీయత.

నేటి ప్రపంచంలో ఎక్కడ ఏ అశాంతి కానవచ్చినా ఎక్కడ సంఘర్షణ జరిగినా, ఏ కల్లోలం చెలరేగినా, అవి అన్నికూడా ఈ నాలుగు పరస్పర విరోధశక్తుల ప్రత్యక్ష— లేదా, పరోక్ష—ఫలితాలే.

*　　*　　*

ప్రపంచాధిత్యాన్ని కోరుతున్న డాలర్ యింపీరియలిజంతో ప్రపంచ విస్తరణను కోరుతున్న సోవియెట్ కమ్యూనిజం సంఘర్షణ ఈ నెలలో మరింత స్పష్టంగా, స్ఫుటంగా, బాహాటంగా కొనసాగింది.

ట్రూమన్, వాలెస్, సమ్నర్ వెల్స్, ఐసెన్‌హోవర్ మొదలైన యునైటెడ్‌స్టేట్స్ రాజకీయనాయకులు యూరోప్‌పై—కేవలం యూరోప్‌పైనేకాదు, మొత్తం ప్రపంచంపై—రష్యా ప్రాబల్యాన్ని సాధించగోరుతున్నదని బహిరంగంగా విమర్శించారు.

సోవియెట్ నాయకులు ఇట్టి విమర్శనలను చేయకపోయినా, సోవియెట పత్రికలు వీటిని ఇంతకంటెకూడా తీవ్రంగాచేశాయి.

కేవలం పరస్పర విమర్శలతోనే సరిపెట్టక, పెక్కురంగాలలో యునైటెడ్‌స్టేట్సు సోవియెట్ రష్యాలు సంఘర్షించాయికూడా.

యూరప్‌లో బల్గేరియా హంగరీలు, ఆసియాలో చైనా ఈ సంఘర్షణకు రంగాలైనాయి.

బల్గేరియన్ పార్లమెంట్‌లోని ప్రతిపక్షనాయకుడు నికొలైపెట్‌కాఫ్ అరెస్టు ఈ నెలలో జరిగింది. ఈ అరెస్టుకు చెప్పబడిన కారణం,—అతడు ప్రజలచే ఎన్నుకొనబడిన ప్రజా ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్నాడని.

ఈ అరెస్టును చేయించింది రష్యాయేనని అమెరికా అంటున్నది. కమ్యూనిస్టులు కాని ముఖ్యనాయకులనందరినీ అరెస్టుచేయించి, కమ్యూనిస్టు కీలుబొమ్మ ప్రభుత్వాన్ని బల్గేరియాలో యేర్పాటుచేయడానికి రష్యా ప్రయత్నించుతున్నదనికూడా అది ఆరోపిస్తున్నది. బల్గేరియాతో జరిగిన శాంతిసంధి ధ్రువపరచబడినపిమ్మట మూడునెలలలోగా—అంటే మరికొన్ని వారాల లోపున—బల్గేరియాను ఆక్రమించుకొనివున్న రష్యన్‌సేనలు అక్కడినుంచి తరలిపోవలసి వున్నందున, తన సైనికాధిపత్యం తొలగేలోపల తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని మరింత పదిలంచేసుకొనడానికి రష్యా కృషిచేస్తున్నదనికూడా అది (అమెరికా) విమర్శిస్తున్నది.

ఈ ఆరోపణలన్నీ ఒకవేళ నిజమేనని అంగీకరించినప్పటికీ రష్యాచర్య సమర్థనీయమైనా కాకపోయినా, సహజమైనదే. డాలర్ల సంచుల మూతులను విప్పి, గ్రీసును, టర్కీని

అమెరికా తన ఉపగ్రహరాజ్యాల్నిగా చేసుకున్నది. అయినప్పుడు గ్రీసు, టర్కీల సరిహద్దులోని బల్గేరియాను తన ఉపగ్రహ రాజ్యంగా చేసుకొనడం సోవియెట్ రష్యాకు ఆత్మరక్షణ దృష్ట్యాప్రాణావసరం.

దాదాపు ఇట్టిసంఘర్షణే హంగరీలోకూడా తప్పలేదు. హంగరీ పరిపాలన పర్యవేక్షణకు ఆదేశంలో బ్రిటన్, అమెరికా, రష్యాల ప్రతినిధులతోకూడిన ఒక సంఘం వున్నది. ఆ సంఘానికి అధ్యక్షుడు రష్యన్ ప్రతినిధి. అతడు హంగరిలోని ప్రధానిపైమోపిన కొన్ని ఆరోపణల ఫలితంగా, పార్లమెంట్‌లో తనకే పెద్ద మెజారిటీ వున్నప్పటికీ, ఆ ప్రధాని రాజీనామాచెయ్యడం, కమ్యూనిస్టు నాయకుడు ప్రధానికావడం సంభవించింది. హంగరియన్ ప్రధానిపై ఏయే ఆరోపణలు జరిగినవో చెప్పమని బ్రిటన్, అమెరికాలు అడగగా, అందుకు రష్యా సమ్మతించలేదుకూడా. అందుమీదట ఇది హంగరీలోపల వ్యవహారాలలో అనవసర జోక్యమేకాకుండా, తమతోజరిగి ఒడంబడికల అతిక్రమణకూడాచూచి బ్రిటన్, అమెరికాలు విమర్శించాయి. ఈ మొత్తం సమస్య మిత్రరాజ్యసమితిలో చర్చకు రావచ్చు. ఏమైనా, సోవియెట్‌రష్యా సరిహద్దుచుట్టు అమెరికన్ ఉపగ్రహరాజ్యాల సృష్టికి హంగరీలో రష్యాచర్య కేవలం ప్రతిక్రియమాత్రమే ననడం స్పష్టమే. ఒక అగ్రరాజ్యం "పవర్‌పాలిటిక్స్"ను తన విదేశాంగ విధానానికి ప్రాతిపదికగా చేసుకున్నప్పుడు, మిగిలిన అన్ని అగ్రరాజ్యాలకు వేరే మార్గాంతరంలేదు; వుండదు.

ఇక చైనాలో ఇంతకంటె తీవ్రంగా, ఇంతకంటె బాహాటంగా రష్యా, అమెరికాలు సంఘర్షించాయి. అక్కడి అంతర్యుద్ధంలో కోమింగ్‌టంగ్ రక్షణకు ధనాన్ని, ఆయుధాలను అమెరికా సప్లయిచేయగా, కమ్యూనిస్టు పక్షానికి రష్యా సప్లయిచేసింది. ఇంతేకాకుండా, సింకిమాంగ్ రాష్ట్రంపై ఔటర్ మంగోలియా అశ్వికబలాలు ముట్టడిజరపడం సంభవించింది కూడా. ఔటర్ మంగోలియా రష్యా చెప్పుచేతలలో మెలగుతున్న రాజ్యమైనందున, సోవియెట్ ప్రోద్బలం లేనిదే ఈ ముట్టడి జరిగివుండదని చాంగ్‌కైషేక్ ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. అయితే, చైనాలో రష్యా, అమెరికాల జోక్యాలలో ఏదైనా భేదంవుంటే, అది తరతమ భేదమే. చాంగ్‌కైషేక్ సేనలకు అమెరికన్ సైనికాధికారులు శిక్షణనిచ్చారు; ఆయుధాలనిచ్చారు. ఇదివరలో జరిగిన ఈ సహాయానికితోడు ఈవారంలో - జూన్ చివరి వారంలో - కొన్నికోట్ల తుపాకుతోటాలను, కొన్నికోట్ల డాలర్లను చాంగ్‌కైషేక్ ప్రభుత్వానికి యిచ్చివేస్తున్నామని ప్రెసిడెంట్ ట్రూమన్ ప్రకటించాడుకూడా. ఇంత అధికంగా - ఇంత బాహాటంగా - చైనాలో ఒకపక్షానికి యునైటెడ్‌స్టేట్సు సహాయపడుతుండగా రష్యా మిన్నకుండ లేదు. మిన్నకుంటే, దానికి మహోపద్రవం తప్పదుకూడా. అంతర్యుద్ధం సమసిపోవాలని, శాంతి ఏర్పడాలని చైనాప్రజలు - ముఖ్యంగా చైనా విద్యార్థులు—తీవ్రాందోళన సాగిస్తున్నారు. ఇట్టి ఆందోళన సాగిస్తున్నవారిని తీవ్రంగా అణచివేయడమే కనబడుతున్నదిగాని, అంతర్యుద్ధం సమసిపోగల సూచనలు కానరావడంలేదు. పైపెచ్చు, ఇకముందు మరింత బాహాటంగా — చావో, బ్రతుకో తేలిపోవలసినరీతిగా - అది జరగనున్నట్టు తోస్తున్నదికూడా. నేటి ఉదయం (జూన్ 30 వ తేదీ ఉదయం) వచ్చిన ఒక వార్తప్రకారం కమ్యూనిస్టు నాయకుడు మోసే—టుంగ్ అరెస్టుకోసం చాంగ్‌కైషేక్ ప్రభుత్వం వారంటు జారీచేసింది. ఈ వారంటు అమలు జరగడం అసంభవమే కావచ్చుగాని, చైనా అంతర్యుద్ధపు ప్రస్తుత తీవ్రతకు ఇదొక నిదర్శన మనడం నిర్వివాదం. దీనికంతటికీ ఒక ముఖ్యకారణం రూసో - అమెరికన్ వైరుధ్యమే.

ప్రపంచం మొత్తంపై-అది గ్రీసుకావచ్చు, టర్కీకావచ్చు; అస్ట్రియా కావచ్చు, అర్జెంటీనా కావచ్చు; తన సరిహద్దుల లోపలనే కావచ్చు—ధనికవర్గాలకు (వారిలో కొందరు ఫాసిస్టులైతే,

మరికొందరు కేపిటలిస్టులు) యునైటెడ్ స్టేట్సు బలాన్ని కూర్చుతున్నది. ఇదేవిధంగా ప్రపంచం మొత్తంపై - అది హంగరీ కావచ్చు, రుమేనియా కావచ్చు, బల్గేరియా కావచ్చు, చెకోస్లోవాకియా కావచ్చు, చైనాకావచ్చు - కమ్యూనిస్టు, సోషలిస్టువర్గాలకు రష్యా బలాన్ని కూర్చుతున్నది. ఈ విరుద్ధ వర్గాలలో అమెరికా సమర్థిస్తున్నట్టివి మానవుని మానవుడు పీక్కుతినవలెనని అనేవి; కాగా, రష్యా సమర్థిస్తున్నట్టివి మానవులందు కష్టసుఖాలను సమానంగా పంచుకొనాలనేవి. ఈ పరిస్థితిలో మన సానుభూతి సహజంగా ఎటువైపు వుండగలదో వేరుగా చెప్పవలసినపనిలేదు.

* * *

వివిధ దేశాలలో వివిధరంగాలలో రూసో - అమెరికన్ వైరుధ్యం తప్పకపోయినా, అంతకంతకు క్లిష్టమైపోతున్న - శిధిలమైపోతున్న - యూరోపియన్ ప్రజాసామాన్యపు జీవితందృష్ట్యా, అగ్రరాజ్యాలమధ్య అర్థికరంగంలోనైనా సహకార ప్రతిపాదన అనివార్య మౌతున్నది. అంచేత యునైటెడ్ స్టేట్సు విదేశాంగమంత్రి మార్షల్ యూరప్ పునరుద్ధరణకు ఒక ప్రణాళికను ప్రతిపాదించారు. ఈ ప్రణాళికపై ప్రస్తుతం బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా విదేశాంగ మంత్రులమధ్య పారిస్‌లో సమాలోచనలు జరుగుతున్నాయి. ఈ సమాలోచనలు సఫలం కావచ్చునని ఈ బ్రిటన్, రష్యాల విదేశాంగమంత్రులు ఆశాభావాన్ని ప్రకటిస్తున్నా, పారిస్‌సభఫలితం సందేహాస్పదమే.

మార్షల్ ప్రణాళిక ప్రాతిపదిక లివి :—

(1) యూరప్‌కు ఏవిధంగా ఆర్థికసహాయం జరగాలో యూరోపియన్ రాజ్యాలే నిర్దిష్టంగా సూచించాలి.

(2) విడి విడిగాకాక, సమష్టిగా యూరోపియన్ రాజ్యాలు కోరినప్పుడే వాటికి యునైటెడ్ స్టేట్సు సహాయపడగలదు. ఇలాకోరడంలో రష్యా కూడిరాకపోయినా, సహాయం జరగగలదు.

ఈ షరతుల అంతర్యమిది :—

యూరోపియన్ ఆర్థికవ్యవస్థను ఒక యాజమాన్యంకిందికి తెస్తే, అది అమెరికా ఆర్థిక సహాయంపై యునైటెడ్ స్టేట్సు ప్రాబల్యం తథ్యం.

రష్యా సహజంగా ఈ ప్రతిపాదనకు సమ్మతించలేదు. అప్పుడే రష్యన్ అఫీషియల్ న్యూస్ ఏజెన్సీ అయిన టాస్ చేసిన ఒకవిమర్శ ఈ ఊహను బలపరుస్తున్నదికూడా. మార్షల్ ప్రణాళికను విమర్శిస్తూ, ఏదేశం ఆర్థిక సమస్యలను ఆదేశం జాతీయ పునర్నిర్మాణ ప్రణాళికల ప్రకారం పరిష్కరించుకోవలసిందేననీ, మొత్తం యూరప్‌కు ఏక అర్థిక ప్రణాళిక కొనసాగగలది కాదనీ స్పష్టంగా పేర్కొన్నది. దీన్నిబట్టి పారిస్ సమావేశ సాఫల్యం అనుమానాస్పదమే.

* * *

ఒకవైపున డాలర్ యింపీరియలిజంతో సోవియెట్ కమ్యూనిజం ఈవిధంగా సంఘర్షిస్తుండగా, రెండవవైపున కలోనియల్ యింపీరియలిజంతో ప్రాచ్యజాతీయతకు పోరుసాగుతున్నది. ప్రతి ప్రాచ్యదేశంలోను ఇంతగానో, అంతగానో సాగుతున్న ఈ పోరాటపు స్వరూపాన్ని తెలపడానికి ఇండొనేసియాలోని ఇటీవలి పరిణామాలను విశదీకరిస్తే సరిపోతుంది.

జాగరిత ప్రాచ్యజాతిని ఇదివరలోవలె ఇకముందుకూడా పూర్తిగా స్వాతంత్ర్యవంచితం చేయలేమని బ్రిటిష్ యింపీరియలిస్టులవలె, ఫ్రెంచి యింపీరియలిస్టులవలె డచ్ ఇంపీరియలిస్టులుకూడా గుర్తించక తప్పలేదు. అందువల్ల ఇండొనేసియా స్వాతంత్ర్యాన్ని గుర్తించడానికి

సమ్మతించి, ఆ స్వాతంత్ర్యాన్ని ఎంతమేరకు వీలుపడితే అంతవరకు నామమాత్రంగా చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు. ఇందునిమిత్తం వారుముందు ఇండొనీషియా సమైక్యతకు భంగం కలిగించడానికి వీలైనన్ని స్వతంత్రరాజ్యాల సంస్థాపనకు దోహదమిచ్చారు. ఇప్పుడిక ఇండొనీసియా ఫెడరేషన్ అధికారాన్ని పరిమితంచేయడానికి కృషిచేస్తున్నారు. ఈ సందర్భంలో వారు ఇండొనీసియా రిపబ్లికన్ ప్రభుత్వాన్ని (తమతో ఒడంబడికకు ప్రాతిపదికంగా) ఈక్రింది నాలుగు షరతులను ఆమోదించమని పట్టుపడుతున్నారు :—

(1) రబ్బర్ తోటలు మొదలైన ఆస్తిపాస్తులను ఇదివరలోవలె భూమందులైనవారికి అప్పగించాలి.

(2) ఇండొనీషియాలో పోలీసుదళం డచ్, ఇండొనీసియన్ సమష్టి యాజమాన్యంకింద పనిచేయాలి.

(3) దేశరక్షణ బలాలపై యాజమాన్యాన్నికూడా ఇండొనీసియా హాలెండ్‌తో పంచుకోవాలి.

(4) విదేశాలలో రాయబారుల నియామకంపై నేమి, విదేశాలతో సంబంధ బాంధవ్యాలపై నేమి తుదిపలుకు డచ్‌వారిదే కావాలి.

ఈ నాలుగు షరతులకు ఆమోదిస్తే, ఇండొనీషియాకు దాస్యబాధ ఇకమీదటకూడా తప్పనట్లే; దాని దోపిడి యధాప్రకారం సాగగలదన్నట్టే. అంచేతనే ఈ షరతులను ఇండొనీషియాలోని అన్ని రాజకీయపక్షాలు ఖండించాయి. అంతేకాదు. ఈ షరతులకు సమ్మతి తెలిపినందుకు డాక్టర్ షారియర్ తన ప్రధాన మంత్రిపదవికి రాజీనామా పెట్టవలసి వచ్చిందికూడా. అయితే, ఏదో ఒక సాకుపై ఇండొనీసియాతో యుద్ధానికి దిగడానికి ఇప్పుడు ఆతురత చూపుతున్నట్టున్నారు. ఇటీవల అక్కడ డచ్‌వారు తమ సాయుధబలాలను విశేషంగా కేంద్రీకరించారు. అంచేత ఇప్పుడేగనక యుద్ధం జరిగితే, కనీసం కొన్ని దశాబ్దాలవరకైనా ఇండొనీసియా తిరిగి తమ గుప్పిటిలో వుండగలదని వారు భావిస్తున్నట్టున్నారు. ఈ ప్రమాదాన్ని పరిగణించేకాబోలు, డచ్‌వారి షరతులను యధాతధంగా కాకపోయినా, వాటి ప్రధానసరళికి తాను సమ్మతిస్తున్నానని ఇండొనీషియన్ రిపబ్లిక్ ప్రెసిడెంట్ డాక్టర్ సోకర్నో చెప్పినప్పటికీ, ఆయనతో తాము రాయబారాలు సాగించబోమని డచ్‌వారు అంటున్నారు. ఈ తీవ్రపరిణామాలన్నింటి దృష్ట్యా, ఇండొనీషియాలో తిరిగి యుద్ధప్రజ్వలన తప్పదన్నట్టే తోస్తున్నది.

రెండూకూడా యింపీరియలిస్టు వ్యవస్థలేగనక, కలోనియల్ యింపీరియలిజముకు, డాలర్ యింపీరియలిజముకు చుట్టరికమే. ఈ చుట్టరికాన్ని పురస్కరించుకునే డచ్‌వారి షరతులను ఆమోదించమని ఇండొనీసియాకు యునైటెడ్ స్టేట్సు సలహానిస్తున్నది. తాను ఇండియా, బర్మా, సిలోన్, మలయా మొదలైనవాటిలో అనుసరిస్తున్న విధానానికి డచ్‌వారి విధానం రూపాంతరమే అయినందున, బ్రిటన్‌కూడా ఇట్టిసలహానే యిస్తున్నది. ఈ పరిస్థితిలో మన సానుభూతి ఎటువైపు మొగ్గగలదో వివరించి చెప్పవలసిన అవసరంలేదు.

* * *

అన్నిచోట్ల అన్నివైపుల అందరు - తిన తిండికి, కట్టగుడ్డకూ, నిలవనీడకు బాధపడుతుండగా, ప్రాబల్యసాధనయత్నం నిరాఘాటంగా సాగుతున్నది. అంచేతనే నేటి ప్రపంచం ఇంత కల్లోలితం; ఇంత బాధామయం.




నగరం శాంతపడే సూచనలు కనబడుతున్నాయి. మౌంటుబాటన్ ప్లాను ధర్మమాఆని యిటీవల "Statesman" పత్రికలో ప్రచురింపబడ్డ "Elegy written in an urban courtyard" అన్న పద్యం చదివితే కలకత్తా పరిస్థితి సంపూర్ణంగా అవగాహన మవుతుంది.

> "The curfew tolls the knell of Freedom's Day. The frightened herd can't get a tram or bus. The Strikers Strike, the Students loudly bray, And leave the town to darkness—and to *us*!"
>
> (by a highly paid goonda)


జూన్ 2 వ తేదీన తిరిగి అల్లర్లు ప్రజ్వరిల్లుతాయని గాలివార్త బయలుదేరింది గవర్నరు—క్రిందటి ఆగస్టులో యిల్లు వదలని గవర్నరు—పోలీసుశాఖా మంత్రితోటి, పెద్ద మిలిటరీ ఆఫీసర్లతోటి కలిసి చాల శ్రద్ధగా పట్టణమంతా పర్యటనముచేసేడు. గాంధీ—జిన్నాగార్ల విజ్ఞాపనను సినిమాల్లోను, పేపర్లలోను ప్రకటించేరు. పాటలరూపకంగా మార్చి, హిందూ ముస్లిము ఐక్యతను సాధించాలని గవర్నమెంటుతరపున ప్రాపగేండా, వాన్ను ఉపయోగించేరు. ఆనాటికి విపరీతమైన బందోబస్తుచేసేరు. సందుల్లోను, గొందుల్లోను, ఎక్కడచూచినా మిలిటరీ పికెట్సు తుపాకులతో ప్రత్యక్షం: చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నారు. యిటువంటి కట్టుదిట్టం మొదటనుంచి వుంటే యింత ప్రాణనష్టం, ద్రవ్యనష్టం ఉండేదికాదు. వాళ్ళు మనసార అరికట్ట దల్చుకుంటే అల్లర్లే ఉండేవికావని తేటతెల్లమైంది. ఆరోజు మెల్లగా, ఏ అల్లరి లేకుండా గడచింది. 3 వ తేదీన వైస్రాయిగారి క్రొత్తప్రణాళిక విషయం అంతా విన్నారు. మర్నాడు పత్రికల్లో చదువుకున్నారు. బెంగాలు చీల్చబడుతుందనగానే కలహాలు అణచడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పాపం! రాష్ట్రమంతా పుచ్చుకుందామని వేసిన యెత్తు దెబ్బతిన్నది, యిటువంటి మోసం జరుగుతుందని బెంగాలు ముస్లింలీగు అనుకోలేదు. మొత్తంమీద నగరం ప్రశాంతంగానే ఉంది - జోరాశాంకో, బెలియాఘటా, ఎన్టాలీ, బౌబజారు తప్ప. యీ వీధుల్లో జనసంచారం తక్కువ. జంకువదలి, బాహాటంగా తిరగడానికి ధైర్యంచాలదు, సాయంత్రం 8 గంటలు కాకపూర్వమే పట్టణం మాటు

మణుగుతోంది. బస్సులూ, ట్రాములూ డిపోలకు చేరుతున్నాయి. మిలిటరీ, పోలీసు లారీలుమాత్రం విజృంభించి తిరుగుతున్నాయి. యింక యీ నెల 20 తరువాత ఎలాగుంటుందో ?

దేశానికి స్వాతంత్ర్యము వచ్చినందుకు సంతోషము అరుదుగా కనబడుతోంది. రాష్ట్ర విభజనకు హిందువులూ, ముస్లిములూ కూడ విచారిస్తున్నారు. అయితే, మరియొకదారి లేనందువల్ల "లేని బావకంటే గ్రుడ్డి బావ మేలు" అన్నట్లు ముస్లిములు వొప్పుకున్నారు కాని సుహ్రావర్ది, శరత్‌బోసులు విభజనోద్యమం వోడించడానికి పాటుబడుతున్నారు. ఎవరెంత శ్రమపడినా బెంగాలు హిందువులు నూటికి తొంభైమంది విభజనను ఆమోదిస్తున్నారు. ఈ విషయం యీనెల 20 వ తేదీన తేలిపోతుంది. విభజన తప్పదు. అందుకు వ్యతిరేకంగా పనిచేసినందుకు బోసుకుకూడ చెడ్డపేరు రావచ్చు చర్చిల్‌కుమల్లే తొలిగించబడతాడేమో కూడ. పశ్చిమ బెంగాలులో ప్రభుత్వం యేర్పడగానే పరిపాలనా విధానాల్లో అనేకమార్పులు రాకతప్పదు. అల్లర్లు కొద్దికాలములోనే అణచివేసే యేర్పాట్లు జరుగుతాయి.

కలకత్తానగరం పాకిస్థానుకే చెందుతుందని ముస్లిముల అభిప్రాయం. కాని గట్టిగా అడగడానికి ధైర్యంలేదు. "చావుకు పెడితేగాని లంఖణాలకు తేలదన్న" పంథాలో వాళ్ళు నడుస్తున్నారు. ప్రాక్ పశ్చిమ బెంగాలులకు కలసి కలకత్తా ముఖ్యపట్టణంగా ఉండాలని ఒకమారంటున్నారు. యిద్దరు గవర్నర్లు వొకే పట్టణములో ఉండ వీలులేదని హిందువులు. చిటగాంగు వృద్ధి అయ్యే వరకు, ఢాకాను ముఖ్యపట్టణంగా చేసుకుంటుందట, తూర్పు పాకిస్థాన్, కలకత్తా పోగొట్టుకోవడం వాళ్ళ కెంత మాత్రం యిష్టంలేదు. సుహ్రావర్ది బెదిరిస్తున్నాడు: "ఒకవేళ కలకత్తానేగాని హిందువులు తీసుకుంటే వొట్టి బుగ్గి మాత్రమే మిగులుతుందని". యీ రేవు యొక్క ప్రాముఖ్యతకూడ తగ్గిపోతుందట! పంజాబులో లాహోరుకు మల్లే కలకత్తాకోసం రాద్ధాంత సిద్ధాంతాలు జరగవచ్చు. యింతకూ, దేశవిభజనకై పెద్ద అట్టహాసంచేసి, హింసాకాండతో కథ నడిపిన ముస్లింలీగు, రాష్ట్రవిభజనకు వొప్పుకోకపోవడం చిత్రంగా ఉంది. వాళ్ళ కుందేలుకు మూడేకాళ్ళు.

ఇక సుహ్రావర్దీగారి భవిష్యత్తుమాట. ఆయన సంగతి గబ్బిలంలాగ ఉన్నది. అతని గ్రామం పశ్చిమ బెంగాలులో. అతని యెన్నికకూడ అక్కడనుండే. విభజన జరిగినతరువాత అతడు తూర్పు బెంగాలునుండి పోటీచేయాలి. ప్రస్తుతం అతనికి బెంగాలు ముస్లింలీగు వాతావరణం అనుకూలంగాలేదు. అణగదొక్కడానికి కాచుకుని ఉన్నారు. ముఖ్యంగా, ప్రఖ్యాత పట్టీల పహిల్వాన్ ఫజ్లల్ హక్కు. హక్కు డబక్కులు అందరికీ తెలుసును. నజీముద్దీను కూడ రాజకీయ రంగంలోకి దిగుతాడట. సుహ్రావర్దికి, నాజీముద్దీనుకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది.



"ఇదుగో! ఆహ్వాన పత్రికలో ఎటువంటిపదాలు వాడుతావో! అది చదివితే ఒక్కరుకూడా రాకుండా ఉండాలి!"

మౌంటుబాటన్ ప్లానును ప్రతిఘటించడానికి ఢిల్లీ వెళ్లిన తనకు ఆలిండియా ముస్లింలీగు కౌన్సిల్ అవకాశమే యివ్వలేదని బెంగాలురాష్ట్ర ముస్లింలీగు కార్యదర్శి అబుల్ హాషీమ్ అంటున్నాడు. జిన్నాను యెదిరించడానికి ధైర్యములేక చాలమంది చేతులెత్తేరనికూడ అన్నాడు. పాపం! యితనికి రాష్ట్రవిభజన యెంత మాత్రమూ రుచించలేదు.

బీహారు కాందిశీకులతో పశ్చిమ బెంగాలు నింపివేసి పాకిస్థానులో కబళించడానికి యెత్తువేసిన ముస్లింలీగు, యిప్పుడు, రాష్ట్రవిభజన అనివార్యమని తేలగానే, వాళ్ళను బీహారుకు తరిమివేయవలెనని చూస్తున్నది. యీ సలహా యిచ్చినది కలకత్తా ముస్లింలీగు పేపరు Morning News. ఎంత అభిమానం! వాళ్ళను తమ చదరంగం ఆటలో పాచికలవలె ఉపయోగించుకొని, యిప్పుడు చేతులు దులిపేసుకుంటారట!

కలకత్తాలోని పంజాబీ, సింధీ ముస్లిమ్ వర్తకులు చాలామంది ఢాకా, చిటగాంగు మార్చుకునే యేర్పాట్లు చేసుకుంటున్నారు. నగరంలోని చాల పాశ్చాత్య సినిమాలు "God save the king" అనే National Anthem వాయించడం మానివేశాయి. కొన్ని జాతీయ సినిమాలు ఆట అఖరున కాంగ్రెస్ పతాకాన్ని చూపుతున్నాయి. కలకత్తా పేరుకూడ సుభాస్ నగరమని మార్చబడుతుందట,

రాష్ట్ర విభజనకు అవసరమైన ప్రయత్నాలు చరచరా జరుగుతున్నాయి. ప్రతీ చోట మార్పులు కనిపిస్తున్నాయి. ఎక్కడచూచినా కాంగ్రెస్ పతాకం తాండవమాడుతోంది. బస్సుల్లోను, ట్రాముల్లోను, ఆఫీసుల్లోను రాబోయే రాష్ట్ర విభజనమగురించి సంప్రతింపులే. ప్రస్తుతం బాగా చలామణీలో ఉన్నవి హిందూ

మహాసభ. దాని ప్రతినిధి శ్యామప్రసాదు ముఖర్జీ.

రైటర్సు బిల్డింగులు - అనగా యీ రాష్ట్రానికి సెక్రటేరియట్ - వెలవెల బోతోంది. యిదివరకున్న అలజడి, త్రొక్కిడి యిప్పుడు కనబడలేదు. ఇసుకవేస్తే రాలకుండా ఉండే కంట్రాక్టర్లు వగైరా యిప్పుడు కానరాలేదు. "తెప్పలుగ చెరువునిండిన కప్పలు పదివేలుచేరు గదరా సుమతీ!" లోపల గుమస్తాలు ఏవో పాతఫైల్సుని నిస్పృహతో దులుపుతున్నారు. బహుశా అవికూడా విభజనకు గురికావచ్చు. కలకత్తా హైకోర్టును ఛేదించే ప్రయత్నాలు త్వరలో ప్రారంభమవుతాయి. ఢాకాను రాజధానిగా చేసుకోవడానికి నిశ్చయించుకున్నా, కలకత్తా మీద వ్యామోహం యింకా లీగుకు పోలేదు. పేచీపెట్టేలాగ కనబడుతోంది. స్థిరాస్తులు వగైరా వాటికి ఖరీదు కట్టి యివ్వాలట! యిందుకు హిందూ మహాసభవారు "నీకూ బే", "నీ అబ్బకుబే" అంటున్నారు. హిందూ బెంగాలులో 43,02,242 ముస్లిములు మాత్రమే ఉంటారు. కాని తూర్పు బెంగాలులో ముస్లిముల పరిపాలనక్రింద 1,38,76,949 హిందువులు ఉంటారు. వాళ్ళగతి యేమిటి? అని శ్రీ సనత్‌కుమార్ రాయి చౌదరీ అంటున్నారు. "ఆ హిందువులనందరిని పశ్చిమ బెంగాలుకు తీసుకొని వస్తే తగినంత భూవసతి కావాలి. జనాభాప్రకారం బెంగాలు రాష్ట్రంలో 70% అనగా 56,100 చ॥ మైళ్ళభూభాగం అవసరమని అన్నారు. సరిహద్దు నిర్ణయంలో న్యాయం కలిగేటట్లు జాగ్రత్త పడాలని ముఖర్జీ గారంటున్నారు. జెస్సూరు, నాడియా, మూర్షిదాబాదుకూడ రావాలంటున్నారు.

దేశాన్ని, రాష్ట్రాలను చీల్చడం యూరోపియనులకు ఇష్టంలేదు. అఖండ భారతదేశమే శ్రేయస్కరమనీ, అప్పుడే అంతర్జాతీయ వ్యవహారాల్లో ఉత్తమ స్థానం లభిస్తుందనీ అంటున్నారు. "Statesman" లో యీ క్రిందివిధంగా వాళ్ళ ఉద్దేశం వెలువడింది.

"On Mr. Jinnah's shoulders, more than any other of the leaders, rests the responsibility for partition. For years he has been its chief protagonist, and it takes a very bigman to retract from such a stand. None the less, there are many who would feel, even among his muslim followers, that he would increase in political stature if he were to agree at the eleventh hour to a united India"

ఈ నెలాఖరు లోగా బెంగాలు భవిష్యత్తు తేలిపోతుంది. నూతన శకం ఆరంభమవుతుంది.

[ఇది జూన్ 16 తేదీన రాసిన వ్యాసం. ఆ తర్వాత బెంగాలు విభజనతోపాటు ఎన్నో మార్పులు చకచకా జరిగిపోతున్నాయి. సం॥ ఆం॥]



డాక్టర్ కె. యస్. కేసరి

# నా చిన్ననాటి ముచ్చట్లు

కె. యన్. కేసరి

[తెలుగులో వెలువడిన జీవిత చరిత్రలు చాలా కొద్ది. కేసరిగారి ఈ చిన్ననాటిముచ్చట్లు, తెలుగు సాహిత్యంలోని ఈకొరతను ఎంతైనా తీర్చగలదని మా నమ్మకం. కేసరిగారి శైలిలో నిరాడంబరతతోపాటు కవిత్వముకూడా కనిపిస్తున్నది. ఇది మనసాహిత్యకులు గమనిస్తారని ఆసిస్తున్నాం. స॥ ఆ॥]

నేను వంగవోలు తాలూకాలో, ఆ పట్నానికి సమీపంగా ఉండే ఇసమనమెళ్లూరు గ్రామంలో ఒక పేద కుటుంబమునందు, పూరి యింట్లో 73 సంవత్సరముల క్రిందట జన్మించినాను. మా యింటిపేరు కోటవారు. మేము వెలనాటి వైదిక బ్రాహ్మణులము. నేను జన్మించిన 5 మాసములకే హఠాత్తుగా మా తండ్రి కలరా జాడ్యమువల్ల స్వర్గస్థుడైనాడు. మా నాయనగారు చనిపోవునప్పుడు - ఆయన జంధ్యాలు వడుక్కుంటూవచ్చిన టెంకాయ చిప్పలో రు. 0-10-0 లు రొఖం మాత్రం నిలువచేసి వెళ్లిపోయినారు. అదీ నా పిత్రార్జితము.

మా తల్లికి నేనొక్కడనే సంతానము. ఆమె తనకు ఆడబిడ్డలులేని ముచ్చట తీర్చుకొనుటకై నాకు ఆడపిల్లవేషమువేసి ఇరుగుపొరుగిండ్లచూపి ఆనందించుట నాకిప్పటికిని జ్ఞాపకమున్నది. నా 6 వ ఏటనే మా అమ్మ నన్ను మా ఊరిలో బడికి చదువ పంపినది. ఆ బడిపంతులు పేరు పిచ్చయ్యగారు. వారికి పిల్లకాయలకు చదువుచెప్పగల సామర్థ్యము లేకపోయినను చీటికి మాటికి వారిని చావగొట్టేవారు. అందుచేత వారిని చూస్తే పిల్లకాయలందరికి చాలా భయముగా ఉండేది. ఆకాలములో బడిపంతుళ్ళకు నెలజీతములు, లేక నెలకింతని జీతముగానిచ్చుట లేకపోయినను భోజనపదార్థములగు వరిగలను, కాయధాన్యములను, వంకాయలు - గోంగూర - పచ్చిమిరపకాయలు మొదలగు కాయగూరలను, రైతుల పిల్లకాయలుతెచ్చి ఇచ్చేవారు. అందుచే వారు పంతులు దయకు పాత్రులై యుండేవారు. అట్టివారికి దెబ్బలుండవు. ఏమీ తేలేనివారికి మాత్రము, పంతులు బెత్తముతో కావలసినన్ని పేముపండ్లను ప్రసాదించేవారు. బడిలో పిల్లకాయల సంఖ్యనుబట్టి ప్రభుత్వమువారు అప్పటికి కొంతకాలమునుండి, సాలీనా రొఖ రూపమున గ్రాంటు నిచ్చుచుండిరి. ఆ సర్కారు గ్రాంటుకై ఆయన తంటాలుపడి పిల్లకాయలను బడికి చేరదీసేవారు.

కొత్తపిల్లకాయలను బడిలోనికి చేర్చేనాడు బడిలో చదివే పిల్లలందరికి పప్పుబెల్లాలు పంచిపెట్టేవారు. పంతులుకు వరహా (4 రూపాయలు) మామూలైనను అందరు ఇచ్చుకొనగలిగేవారుకారు. అయినను పిల్లకాయల వల్లనే పంతులుకు సంసారము తేలికగా జరిగిపొయ్యేది. పంతులు ఇంటిముందు వేయబడిన పూరికొట్టములో మాబడి ఉండేది.

ఆకాలమున గుంట ఓనమాలు నేర్చుకొని, ఆపిమ్మట కొయ్యపలకమీద వ్రాయడ మారంభించేవారము. కొయ్యపలకమీద వ్రాయుటకుముందు నీలిమందు, దోసాకు పసురులు పట్టించి, బాగుగా మెరుగుపెట్టి, ఎండలో పెట్టేవారము. ఆరినపిదప దానిపై బలపముతో వ్రాయవలసి ఉండేది. ఆకాలమున బలపపు కోపులనే మెత్తటి తెల్లరాళ్లుండేవి. వాటినితెచ్చి రంపముతో సన్నసన్న కోపులుగా కోసి వానితో ఆకొయ్య పలకపై వ్రాసుకొనేవారము.

నాలుగైదు సంవత్సరములు ఆబడిలో చదివిన మీదట పెద్దపుస్తకమును (సామాన్యముగా రామాయణము, లేనిచో భారతమో భాగవతమో.) పట్టించుట జరిగేది. సరస్వతిపూజ జరిపి పిల్లవానిచేత రామాయణమును పంతులు చదివించేవారు. ఆదినమున పిల్లకాయలకు పప్పుబెల్లాలు పంచి బడికి ఆటవిడుపు (శెలవు) ను ఇచ్చేవారు. ఈ పెద్దపుస్తకముతో ఆ బడిలోని చదువు సమాప్తము. ఆకాలమున పెద్దపుస్తకము పట్టుట పూర్తి అయినచో, ఈకాలమున బి. ఏ. పట్టా పొందుట వంటిది.

నేను పేదవాడిని గనుక పంతులుకు ఏమియు సమర్పించుకోజాలని కారణమున నాకు దెబ్బలుతప్ప చదువు అంతగా అంటలేదు. నేను బడికికూడా క్రమంగా పోలేక పోతిని. ఏలననగా మా తల్లికి నేను కొంతసహాయం చేయవలసి ఉండేది. మా ఊరిలో గుండ్లకమ్మ అనే నది కలదు. నేను తెల్లవారగనే ఏటికిపోయి, కాలకృత్యములు తీర్చుకొని, చిన్నకావడిలో రెండు చిన్నతప్పేలాలు పెట్టుకొని, ఏటిలో నీటిని ఇంటికి తీసుకొని పోయేవాడను. పిమ్మట చద్ది అన్నమును తిని, ఎవరి పొలమువద్దకైనాపోయి వంకాయలను గోంగూర పచ్చిమిరప కాయలను, దోసకాయలు మొదలైన వానిని అడిగి కోసుకొనివచ్చి తల్లికి ఇచ్చేవాడిని. మరి కొన్నికంకులు సజ్జకంకులను కూడా తెచ్చుకొనేవాడిని.

మాయింటి సమీపముననే ఉప్పలవారి మర్రిచెట్టు అని, యొక పెద్దచెట్టు ఉండెను. అది యిప్పటికిని ఉన్నది. దాని ఆకులు చాలపెద్దవి. విస్తరాకులు కావలసి నేను ఒకనాడు ఆ మర్రియాకులను కోయుటకై చెట్టెక్కితిని. కొంతదూరమెక్కగానే కండ్లుతిరిగినవి. పైకెక్కలేను, క్రిందికి దిగలేను. అట్లనే చెట్టుకావలించుకొని యుంటిని. పట్టుతప్పెనా నే నీపట్టున వ్రాయవలసిన అగత్యముండేదికాదు. దైవవశమున ఇంతలో మరియొకడు ఆకులను కోసుకొనుటకు వచ్చి నా అవస్థచూచి నన్ను వాడు మోకుతో క్రిందికి దించెను. అప్పటినుండి నేను చెట్టు ఎక్కడము మాని దోటి కట్టుకునిపోయి దానితో ఆకులను కోసితెచ్చే వాడను. ఆ ఆకులతో విస్తళ్ళను కుట్టేవాడను. జొన్నదంటు ఈనెలను సన్నగాచీల్చి విస్తళ్ళను సన్నగా కుట్టు నేర్పరితనమునాకు ఉండేది. నేనుకుట్టిన విస్తళ్ళను చూచిన మిషనుకుట్టువలె ఉండేది.

నాతల్లి రవికెలు కుట్టడంలో చాలా నేర్పరి. ఊరివారంతా మా అమ్మవద్దకు వచ్చి రవికెలు కుట్టించుకొనేవారు. సాదారవికెలు కుట్టిన ముక్కానీ; పూలువేసి కుట్టిన ఒక్కణా; తేళ్ళు మంత్రగబ్బలు, పక్షులు–పీనిబొమ్మలు వేసికుట్టిన రెండు అణాలు యిచ్చేవారు. ఆకాలమునాటి నాజూకు వస్త్రాలంకారములు, పాలచాయ కోకలు; నల్లచాయ రవికెలు, గువ్వకన్ను,

నెమలికన్ను అద్దకపు రవికలు. అట్లతద్దె పండుగ వచ్చినప్పుడు ఆనాటి స్త్రీలు ఈవిధమగు చీర, రవికెలు ధరించి, కొప్పులనిండ బంతిపూలు తురుముకొని కోలాహలముగా వుయ్యాల లూగుచుండెడువారు. అట్టి వినోదములు ఈనాటి స్త్రీలకు పరిచయములేవు. అవి జాతీయమగు క్రీడావినోదములు; దేహమునకు చురుకు, పుష్టినిచ్చునవికూడ. మాతల్లి రవికెలను కుట్టి సంపాదించిన డబ్బు మా భోజనమునకు కొంతవరకు సరిపోయేది.

ఆకాలములో పండుగనాడు, తద్దినమునాడు మాత్రమె వరి అన్నమును తినేవారము. తక్కిన దినములలో జొన్నలు, సజ్జలు, వరిగలు వాడుకొనువారము.

నెయ్యి, వరిబియ్యమును మాత్రము డబ్బిచ్చి కొనేవారము. వంటచెరకునకై మా తల్లి పొలముల చాయ వెళ్ళి కందిదుంపలను త్రవ్వితెచ్చెడిది. కందిమొక్కలను కోయునపుడు జానెడు లోపున భూమిపై విడిచి కోయువారు. ఆ విడువబడిన దానిని సమూలము త్రవ్వి తీయుచో - చక్కనివంట చెరుకుగా ఉపయోగపడేది. తిరుగా పైరువేయుటకు అడ్డములేకుండా ఈ దుంపలు తీసివేయవలయును. పైగా రైతు అటు నిటు పొలములలో తిరుగునప్పు డీదుంపలు పొరబాటున కాలులో గుచ్చుకొన్నచో గాయమై ఒకరాగాన మానదు. అయితే తామే త్రవ్విస్తే కూలి ఇవ్వవలెను. అందుచేత సామాన్య రైతుల ఇంటి ఆడువాండ్లు వచ్చి వారియింటికి వంటచెరకున కవసరమైనన్ని త్రవ్వితీసుకొని పోవుదురు. రైతులున్నూ, పేదవారిని ఉచితముగానే త్రవ్వితీసుకొని పోనిత్తురు. ఈప్రకారం మా తల్లి సంవత్సరమునకు చాలినన్ని దుంపలను త్రవ్వి జాగ్రత్త పెట్టేది.

మా ఊళ్లో మా బంధువులు ములుకుట్ల కృష్ణయ్య అనేవారు భిక్షాటనమున, పౌరోహిత్యమున తన జీవితమును గడుపుకొనేవారు. వారు అప్పు డప్పుడు మా ఊరికి సమీపములో ఉండే బసవన్నపాలె మనే చిన్నగ్రామానికి భిక్షమునకు వెళ్ళేవారు. నాకు ఉన్న ఊరిలో బిచ్చ మెత్తుకొనుటకు లజ్జగా ఉండేది. అందుచేత కృష్ణయ్యతోకూడ బసవన్నపాలెమునకు జోలెకట్టుకొని బిచ్చమునకు పోతిని. నేను చిన్నవాడిని అగుటచేతను, కొత్తగా వెళ్లుటచేతను, ఆవూరి అమ్మ లక్క లందరూ నన్ను ప్రేమతో లాలించి కృష్ణయ్యకంటే ఎక్కువగా నాకు బిచ్చము పెట్టినారు. కృష్ణయ్య జోలెకన్న నాది పెద్దదైనది. మోయజాలనైతిని. అప్పుడు నా అవస్థచూచి కృష్ణయ్యగారు నామూటను గూడ కొంచముదూరము వారే తీసుకొనిరి. మధ్యాహ్నమునకు ఇంటికి చేరినాము. అప్పుడు మాతల్లి నా జోలె మూటనుజూచి సంత సించినది; గాని వెంటనే నా చమటలు, అలసట, ఆయాసముచూచి భోరున ఏడ్చినది. తక్షణమే నన్ను స్నానముచేయించి, కడుపునిండ అన్నముపెట్టి నిద్దురపొమ్మని ఆమె భోజనమునకు పోయినది. ఆమె భోజనము చేసివచ్చేలోపలనే నేను నిద్రపోతిని. నా తల్లి నా కాళ్ళవైపున కూర్చుండి ఏడ్చుచుండెను. నాకు మెలకువవచ్చి 'ఎందుకేడ్చెదవమ్మా' అని నేనడుగగా నాకాళ్ళలో ముల్లుగుచ్చుకొని ఉండుట చూపినది. నేను భిక్షాటనమునకై పోయివచ్చిన దొంకను తుమ్మముల్లు విస్తారముగా నా కాలిలో విరిగియుండెను. వానినన్నిటిని ఆమె సూదితో మెల్లగా తీసివైచి మరల ఎన్నడు అట్లా భిక్షాటనమునకు పోనని నాచే ప్రమాణము చేయించుకున్నది.

మా ఇంటి యెదుటనే మా మేనమామగారు ములుకుట్ల మహదేవయ్యగారు నివసించేవారు. కాని వారిసహాయము మాకు ఏమీలేకుండెను. మా మామగారు ధర్మరాజువంటివారు. మా అత్తగారు మాత్రము గయ్యాళి గంప. వారిధాటికి మా మామగారే గాక ఊరివారంతా భయపడేవారు. ఆమె అమిత జగడాల మనిషి. ఎవరినైనా తిట్టదలచుకుంటే తిట్టిన తిట్టు మరల తిట్టకుండా రెండు మూడుగంటల కాలము తిట్టగలశక్తి ఆమెకు గలదు. అందువల్ల ఆమెను చూచిన యింటివారికీ వెలుపలివారికికూడా అమిత భయము. ఈ కారణమున మా మేనమామ మాకు సహాయ మొనర్పజాలకుండెను. *

ఈవిధముగా సమీప బంధువుల సహాయములేక, స్వయం శక్తిచే సంపాదించి తాను వంటిపూట భుజించి, నాకు వీలువెంట రెండు మూడు పూటలు అన్నముపెట్టుచు నాతల్లి నన్ను కంటికి రెప్పవలె పోషించుచుండెను. అప్పుడామె కష్టమును చూడలేక ఆమెతో చెప్పకుండానే మా ఊరినుంచి కాలినడకను మద్రాసునకు చేరినాను. ఆ రోజులల్లో రైళ్లులేవు. ఎవరైనా బండ్లమీద, బకింగ్‌హామ్ కాలువపై పడవలలో, లేనిచో కాలి నడకతో—చెన్నపట్నం రావలసినదే. నాకు కాలినడకే అనుకూలమైనది. చెన్నపట్నం రాగానే కొత్వాల్ చావడివద్ద రావిచెట్టు అగ్రహారం ప్రవేశించినాను. ఆ అగ్రహారంలో ఉండేవారు పలువురు ఉత్తరాదినుంచి వచ్చి చేరిన పేద బ్రాహ్మణులు. వారందరు - పౌరోహిత్యముచేసియో, లేక భిక్షమెత్తుకొనియో జీవించేవారు. నేనున్నూ ఆ జట్టుతోచేరి వారివలెనే జీవిత మారంభించినాను. ఆ కాలంలో చెన్నపురియందు బ్రాహ్మణులకు అన్నంపెట్టే ధర్మసత్రములు చాలా వుండేవి. అయితే వాటిలో ఒకపూటే అన్నం పెడతారు. ఆ ఒకపూట తిని, ఉండడానికి ఇల్లులేని కారణమున రావిచెట్టు క్రిందనే పడుకునేవాడిని. పసివాడను కావడంచేత రాత్రి ఆకలివేసేది. ఒక్కొక్కరోజు ఆ ఆకలికి తట్టుకోలేక పోయేవాడిని. అప్పుడు ప్రక్కనున్న కొత్వాల్‌చావడికి వెళ్ళితే, అక్కడ మొక్కజొన్న "పేలాలు" పడి రెండు దమ్మిడీలకు ఇచ్చేవారు. ఒక్క దమ్మిడీపెట్టి—అరపడి పేలాలు కొనుక్కొని తిని, మంచినీళ్ళు త్రాగి, రావిచెట్టు క్రిందికి తిరిగీ చేరి నిద్రపోయేవాడిని. ఈ విధంగా చెన్నపట్నంలో రావిచెట్టుక్రింద కాపురం కొన్నాళ్లు సాగించినాను. పిమ్మట ఆ బ్రతుకు నాకు చాలా అసహ్యంగా తోచింది. చదువుకొందాము—అనే ధ్యాస కలిగింది.

పచ్చయప్ప కాలేజీ భవనానికి (జార్జిటౌనులో) ప్రక్కన బందరు వీధి అని ఒక వీధి ఉన్నది. ఆ వీధిలో రామానుజాచారిగారని యొకరు, వీధిబడి పెట్టుకొని చిన్నపిల్లలకు చదువులు చెప్పేవారు. వారు పిల్లల తలిదండ్రులవద్ద జీతాలు పుచ్చుకొనేవారు. విద్యాతురుడనైన నేను తిన్నగా వారి నాశ్రయించి - జీతము లేకుండా చదువు చెప్పేటట్లు - వారి

* (అయితే శ్రీ కేసరిగారు స్థితిమంతులైనపిదప ఆ మేనమామగారిని, వారి సంతతిని ఆదరించినారు. ఆ మహదేవయ్యగారి మనమడు మహదేవయ్యను, తండ్రిలేని బాలుని దగ్గర దీసి, చదువుచెప్పించి, వివాహమొనర్చి తనవద్దనే ఉద్యోగమిచ్చి నిలిపినారు. వారే ఇప్పుడు కేసరీకుటీరమున పనిచేయుచున్న శ్రీ మహదేవన్‌గారు. ...............లేఖరి)

అనుగ్రహం పొందినాను. వారి అనుగ్రహం పొందిన విద్యార్థిని కావడంచేత వారి ఇంటికివెళ్ళి వారికి శుశ్రూష చేసేవాడిని. వారు నాయందు దయగలిగి చనువుతో నాచేత కాళ్ళు పట్టించుకొనేవారు; ఇంకా ఇతరమైన ఇంటిపనులు చేయించుకొనేవారు. నాయందనుగ్రహించి ఉచితంగా విద్యాదానంచేసే గురువునకు అరమరికలు లేకుండా సపర్యలు చేసేవాడను. వారివద్దనే రుక్మిణీ కళ్యాణం, గజేంద్ర మోక్షము మొదలైన పద్యకావ్యములు అర్థసహితంగా చదువుకున్నాను. కాని నాకు చూచేకొద్దీ ఈ చదువు బ్రతుకుతెరువుకు పనికిరాదని తోచినది. ప్రైవేటుగా నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్వసాగినాను. ఇంగ్లీషువిద్యపై మనసుకలిగినది.

1889—లో టంకసాల వీధిలో శ్రీ సచ్చిదానంద యోగి రామనాథ శివశంకరపాండ్యాగారు హిందూథియలాజికల్ హైస్కూలు స్థాపించి ప్రధానాధ్యాపకులై నడిపింప నారంభించినారు. 1888 లో క్రిస్టియన్ కళాశాలలో నొక ఆంగ్లేయాధ్యాపకుడు—హిందూ మతమును దూషణపూర్వకముగా అపహాస్యం చేయుటచే నాటి హిందువులలో అలజడి బయలుదేరింది. క్రొత్తగా వచ్చిన ఆంగ్ల విద్య నేర్చుటతోపాటు బిడ్డలు మతాంతరులుఅవుతారనే భయము కలిగినది. దాని ఫలితముగా ఈ హిందూథియలాజికల్ హైస్కూలు ఏర్పడినది. శ్రీ పాండ్యాగారు సంస్కృతాంధ్ర ఆంగ్లభాషా కోవిదులు; ప్రెసిడెన్సీ కాలేజీలో బి. ఏ ప్యాసైనవారు. దైవచింత గలవారు; దయాపరులు. వారి నాశ్రయించి తిన్నగా ఆ పాఠశాలలో జీతంలేకుండా చదువుకొనే వసతి (Scholar - ship) సంపాదించినాను. వారొకనాడు క్లాసుకువచ్చి - విద్యార్థుల రిజిస్టరులో పేరులు చదివి హాజరు వేయుచుండిరి. "కె. నరసింహం" అనగానే ఇద్దరము ఆపేరు గలవారము లేచి నిలిచినాము. ఇద్దరికి ఒకేపేరు చిక్కుగా ఉన్నది, అని వారు తలచి నాయందు చనువుచే నావంక చూచి—"నీపేరు అర్థము చెడకుండా కొద్దిగా మారుస్తాను" అన్నారు. నేను సమ్మతించినాను. అంతట—'కోట నరసింహము' అనే పేరులో, 'సింహం' అర్థముగల "కేసరి" పదమును సింహమునకు బదులుచేర్చి—'కోట నరకేసరి'అని మార్చిరి. నేను అంగీకరించితిని. అదిమొదలు నా మిత్రులందరు నన్నా పేరటనే పిలువనారంభించిరి. అదిమొదలుగా మా తండ్రి నామకరణ మొనర్చిన—'నరసింహం' అనే పేరు తొలిగి గురువుగా రొసగిన—"నర కేసరి" పేరు కలిగి తుదకీనాటివరకు అదియే 'కే. యన్. కేసరి' అని వ్యవహారనామమై వెలయుచున్నది. అయితే పాండ్యాగారి దయవల్ల జీతమైతే అవసరము లేకపోయిందేగాని, పుస్తకాలకు, గుడ్డలకు, భోజనానికి ఇబ్బంది మాత్రం అట్లాగే ఉన్నది. భోజనానికి కొన్ని ఇండ్లలో వారాలు ఏర్పాటు చేసుకొన్నాను. పుస్తకాలకు, గుడ్డలకు, - ఆ ప్రాంతంలో వ్యాపారంచేసుకొనే కోమట్లవద్ద నెల 1 కి తలా రు. 0-4-0 చందా ఇచ్చే ఏర్పాటు చేసుకొన్నాను. ఒకనాడు కొన్ని పుస్తకాలు కొనవలసి వచ్చినది. ఇంకా నెలసరి చందాలిచ్చే గడువు రాలేదు. జార్జిటౌన్ అదియప్ప నాయక్‌వీధిలో - నరసింహాలు శెట్టి అని - జగ్గయ్యపేట వర్తకులు వ్యాపారం చేస్తుండేవారు. వారున్నూ పై చందా లిచ్చేవారిలో వకరు. వారివద్దకువెళ్లి - "మీరు మామూలుగా ఇచ్చే రు 0-4-0 లు అట్లుంచి - మరొక్క పావులా అదనంగా ఈరోజున ఇవ్వండి; పుస్తకాలు అగత్యంగా కొనవలెను." అని సాహసించి అడిగినాను. వారు దగ్గరకు రమ్మనిరి. అడిగిన తడవుగానే ఇవ్వబోతున్నారనే - ఆశతో, ధైర్యముతో దగ్గరకు వెళ్ళినాను. 'మామూలుగా ఇచ్చే పావులా గాక పైన ఒక పావులా వడ్డీకూడా కావాలా' అంటూ - చెళ్ళున చెంపకాయ

గొట్టినాడు. అది దూసిపోయి నెమరు కణతన తలిగినది; స్పృహతప్పి పడిపోయినాను. ఆశబ్దం విని సెట్టి భార్య లోపలనుంచివచ్చినది. నా అవస్థచూచి 'ఆ పిల్లవానిని అట్లాఎందుకు కొట్టా'వని మగని గద్దించి - చాలా నొచ్చుకొన్నది. లోపలకువెళ్ళి ఇన్ని మంచినీళ్ళుతెచ్చి త్రాగమని ఇచ్చినది; త్రాగినాను. స్పృహబాగావచ్చిన తర్వాత ఆమె రు 1-0-0 తెచ్చి పుస్తకాలు కొనుక్కోమని నాచేతిలోపెట్టి పంపినది. రావిచెట్టు క్రిందికి చేరాను. తిరిగీ జిజ్ఞాసలో పడ్డాను. రిక్తుడను - అవమాన పరంపరలతో చదువు సాగించడం దుర్లభమని తోచింది. నాకూ, వ్యయసాధ్యమైన ఈ చదువుకూ దూరమని నిర్ణయించుకున్నాను. ఏదైనా నాకుతగిన ఉద్యోగంచేసి సంపాదించి పొట్టబోసుకుందాము అని యోచన కలిగింది. అప్పుడు నేను చేసిన ప్రయత్నాలు ముందుముందు చెప్పుతాను. ప్రస్తుతం ఆరోజుల్లో చెన్నపట్టణంలో జరిగిన ఒక దైవికఘటననించి నేను బ్రతికి ఎలా బయటపడినదీ చెప్పుతాను.

సుమారు 60 సం॥ లకు కొంచముపైన చెన్నపట్నంలో ప్రతిడిశంబరునెల ఆఖరు వారమున రాణితోటలో (పీపిల్స్‌పార్కు) వేడుకలు జరుగుట కారంభమైనవి. వానినే "ఫార్కుఫేర్ వేడుకలు" అని జనులు పిలుతురు. చెన్నపట్న మీరాష్ట్రమునకు రాజధాని కదా. వేసవి శెలవులలో రాష్ట్రీయోద్యోగులు పలువురు చల్లదనమునకై ఉదకమండలములకు వెళ్ళుదురు. కావున డిశంబరుశెలవులు వేసవి శలవులకన్న క్లుప్తమైనను, పెద్దపెద్ద ఉద్యోగులనుచూచి ఎరుకపడవచ్చుననే ఉద్దేశముతో మండలములనుండి చిన్నఉద్యోగులు పలువురు పనికట్టుకొని చెన్నపట్నమునకు వచ్చుట అలవాటు. బంధువు లిచ్చట యున్నవారు కొందరు కుటుంబములతోనే వచ్చేవారు. ఇట్టి పైజనము వచ్చుటచేత - ఈవేడుకలకు విస్తారముగా ధనము వచ్చెడిది. మరియు అనేకవిధములగు వస్తువుల ప్రదర్శనమును, విక్రయమును జరిగెడిది.

ఇప్పుడు పార్కులో బ్యాండు వాయించుస్థలమున నీవేడుకలు జరిగెడివి అచ్చట ఈ ప్రదర్శనములకై ఏటేటా టెంకాయఆకులతో వెదురుబొంగులతో పెద్దపెద్ద రెండు ఆవరణములను కట్టేవారు. మొదటిది లోపలి ఆవరణము (Inner circle.) రెండవది వెలుపలి ఆవరణము (Outer circle). మొదటి ఆవరణములో వెలగలవస్తువులను ప్రదర్శించేవారు. రెండవ ఆవరణములో సోడాఅంగళ్లు, లాటరీ అంగళ్లు, కాఫీ హోటళ్ళు మొదలగు వాటిని ప్రదర్శింపజేయువారు. దుండగీడులు మొదటి ఆవరణపు తడికలపైనెక్కి లోనికి దూకకుండ దానిని చౌకకొయ్యలతో దిట్టముగా కట్టేవారు. ఒక్కొక్క ఆవరణమునకు నాలుగుద్వారము లుండేవి. ద్వారములవద్ద పోలీసుకాప్దారీతోపాటు అంగళ్ల కంట్రాక్టరుల తాలూకు మనుష్యులు కూడా ఉండేవారు. వెలుపలి ఆవరణము లోనికిపోవుటకు అర్ధణా టిక్కట్టు ; లోపలి ఆవరణమునకుపోవుటకు నాలుగణాలు యివ్వవలయును. మొదట అర్ధణాయిచ్చి, లోపలికి పోతేగాని నాలుగణాల ఆవరణమునకు పోవుటకు వీలు కాదు.

అప్పటికి యింకను మద్రాసులో ఎలక్ట్రిక్ దీపాలు ఏర్పడలేదు. రాత్రి వెలుతురు కొరకు కిర్సనాయిల్‌పోసిన తగరపుబుడ్లను అంగళ్ళలోను, బయటను తోరణములుగా కట్టేవారు. ఆనూనెదీపములను వెలిగించుటకు 5 గంటలకే ప్రారంభించినగాని, చీకటిపడు నప్పటికి ముగియదు.

ఆ కాలమున నేను మద్రాసులోనేయుండి చదువుకొను చుంటిని. నాతల్లి నన్ను చూచిపోవుటకు మద్రాసుకువచ్చినది. ఆమె వచ్చినపిమ్మట కొత్వాలుబజారు సమీపమునయుండు ఆచారప్ప

వీధి సందులోయున్న, ఒక యింటిలో ఒక రూమును నెల 1 కి రు. 0-12-0 లకు అద్దెకు తీసుకొని ఇరువురము నివసించుచుంటిమి.

అది 1886 అని జ్ఞాపకము. అప్పటికి రాణితోటలో డిశంబరు వేడుకలు ప్రారంభమై రెండు మూడేండ్లు అయినది. ఆ యేడును యథాప్రకార మవి సాగుచున్నవి. ఒకనాటి సాయంకాలము మాయింటిలో కాపురముండే పిల్లవాడును నేనునుకలిసి రాణితోటలోని వేడుకలుచూడ వెళ్లితిమి. నేను మాతల్లితో చెప్పియే వెళ్ళితిని. మేమిరువురు సంతోషముతో ఇల్లువిడిచి నడుస్తూ సాయంకాలం 6 గంటలకు తోటకుచేరితిమి. పిమ్మట కొంతసేపు బయట నున్న రంకులరాట్నమును ఎక్కి గిరగిర తిరిగి ఆనందించితిమి. చుక్కాణిలో కాశీరామేశ్వర ములనుచూచి సంతోషించితిమి. అవల నాతోవచ్చిన పిల్లవాడు లోనికిపోదాము అని నన్నుకూడ పిలిచినాడు. నావద్ద అర్ధణాలేదని చెప్పితిని. అయితే నాతోవచ్చిన బాలునివద్ద అర్ధణామాత్రమే యుండెను. అతడు నాయందలి సావాసమున నన్ను విడిచిపోలేక పోలేక లోపలికిపోయెను. అప్పుడు నాచేతిలో అరుదమ్మిడీలు లేనికారణమున నేను దిగబడి ఉండవలసి వచ్చెను. అర్ధణామాత్రమే చేతిలోఉన్న ధనవంతునిబిడ్డ మాత్రము లోపలికి వెళ్ళగలిగినాడు. నేను వెలుపలనే తిరుగుచుంటిని.

పిమ్మట కొంతసేపటికి లోపలి ఆవరణమునుండి పొగలెగయ నారంభించెను. మంటలుమండి వ్యాపించుచుండెను. ఆమంటతోగూడ వెదురుబొంగులు పెఠీల్, పెఠీల్ మని కాలి పగులుచున్న శబ్దము లోపలినుండి వినబడెను. లోపలికి పోయినజనము బయటికి వచ్చుటకు ప్రయత్నించు చుండిరిగాని, పొగమంటవల్ల కండ్లుగానక దారితప్పి ఒకరిమీద ఒకరు పడుటయు కాళ్ళక్రింద స్త్రీలు బిడ్డలుపడి చితికిపోవుటయు తటస్థించెను. ఆనాటి ప్రదర్శనమునకు గొప్పయింటివారు చాలమంది వచ్చియుండిరి. వచ్చిన పురుషులు వారి ఆలుబిడ్డలను వెతుకుచు ఒకరినొకరు గుర్తించలేక అగ్నిదేవున కందరు అర్పణమైరి.

అంతటి ఆనందమయమైన ప్రదేశమంతయు నొక్క అరగంటలోపల రుద్రభూమియై పోయినది. లోపలినుండి తప్పించుకొని రాగలిగినవారిలో కొందరికి గాయములు కాల్పులు. గ్రుడ్డితనము ఏర్పడగా ఎట్లో వారు బయట పడిరి. కొందరు మంటలకు తాళజాలక సమీప ములో నున్న కూవంనదిలో దూకిరి. వెలగల నగలు, ఇతర విలువైన పదార్థములు ప్రదర్శిం చినవారు సొమ్మును విడిచి రాలేక అంగళ్లలోనే కాలిపోయిరి. అట్టిసమయమున చోరీలుకూడా మెండుగా జరిగినవి. మరణించిన బిడ్డలమీదను స్త్రీలమీదను ఉండే, వెండిబంగారపు నగలు, వస్త్రములందలి సరిగెలు కరిగి బంగారము, వెండి ముద్దలు గట్టిపోయినవి. ఆరోజుల్లో పురుషులును తగుమాత్రము నగలు ధరించేవారు. ఆనాడు అమావాస్యనాటి నీలి ఆకాశమువలె రుద్రభూమియై యున్న ఆవినోద ప్రదేశమున - ఆవెండి బంగారపు ముద్దలు నక్షత్రములవలె మిసమిస లాడుచు వెలుగ సాగినవి.

ఇంతలో పోలీసు వారువచ్చి నిప్పునార్పు ఇంజన్లతో కాలిన కొరవులను ఆర్పివైచిరి. ఆరోజులలో చెన్నపట్నంలో చాలినన్ని నిప్పునార్పు యంత్రములు (ఫైర్ ఇంజనులు) లేవు కావున తెల్లవార్లు ఆమంటల నార్పవలసి వచ్చినది.

ఆరోజున నొకమహనీయు డొనర్చినసేవ వర్ణనాతీతము. ఆయన క్రిస్టియన్ కాలేజీప్రిన్సిపాల్ మిల్లరుదొర. ఆయన నేటివారి వంటివారు కారు; పూర్వపు కణ్వ, గౌతమ, కాపాదాది కులపతుల తలపించు కరుణార్ద్రహృదయుడు. ఆయన స్వయముగా, సాహసించి గుంజలెగ ప్రాకి కాలుచున్న పందిళ్ళను దులిపి వేసినారు. పొగలోనున్న, శిశువులను స్త్రీలను ఇవతలికి తెచ్చివిడిచినారు. ఇంకెన్ని విధములుగానో అచ్చట బాధితులకు సహాయపడినారు. అంతేకాక కాలేజీకివెళ్ళి రిజిష్టరుచేతబుచ్చుకొని పొరుగూళ్ళనుండి విద్యాభ్యాసమునకై వచ్చి, కోనకొక్కడు, గొందికొక్కడుగా నుండిన వారిని వేరువేరు వరుసకు తెలుసుకొని వారి యోగక్షేమములను విచారించి వారితలిదండ్రులకు పోషకులకు తెలియ పరచి వారి ఆత్రము బాపిన శిష్యవత్సలుడగు మహాత్ముడతడు.

ఆ రుద్రభూమి నంతయు పోలీసులెంత కాపలా కాచినను, తెల్లవారే సరికి కరిగి ముద్దలైన వెండి, బంగారములు, వెదజల్లబడిన నవరత్నములు చాలవరకు ఆ నక్షత్రముల వలెనే మటుమాయమై పోయినవి.

ప్రదర్శనమున మంట ఎంతత్వరగా జ్వాలారూపమును దాల్చినదో, అంతత్వరగానే రాణితోట కాలిపోయినదన్నవార్త పట్నమంతా అల్లుకొనినది. మద్రాసులో ఆరోజు విశేష దినమగుటచే చాల యిండ్లలో నుండి వేడుక చూచుటకు వెళ్ళియుండిరి. ప్రదర్శనశాల భస్మమైన సంగతి వినినతోడనే వారివారి బంధువుల క్షేమము తెలుసుకొనుటకు వేలకు వేలు జనము వెర్రెత్తినట్లు ఆక్రోశించుచు ఆ స్థలమునకు పరుగెత్తిరి. నల్లగా కాలి కొరివిదయ్యములవలె నున్న ఆ శవములను చూచుటకు ఆరాత్రి అధికారులు అవకాశ మివ్వరైరి. అందుచే వారి బంధువులందరును ఆరాత్రి అంతయు అక్కడనే యుండవలసి వచ్చినది. తెల్లవారిన పిమ్మట పోలీసువారు చచ్చిపడియుండిన వారిని గుర్తించుటకు వారిబంధువులకు అనుమతి నిచ్చిరి. అయితే చచ్చిన వారంతా నల్లగబొగ్గురూపమును దాల్చియుండుట వలన నిజమైన వారిని బంధువులు గుర్తించ లేక పోయిరి. సగము కాలి వంటిన నగలున్న వారు కూడా కొందరుండిరి. అట్టివారిని 'మావారు' అని వీరు 'మావారు' అనివారు, తగాదాలను పెట్టుకొనిరి. కొందరిని మాత్రంబాగా గుర్తించగలిగిరి. చాలమంది గుర్తించనే లేకపోయిరి. ఆదినము రాత్రియింటికి రానివారంతా, చచ్చినవారనే తలంపబడి, వారివారి ఇండ్లలో కర్మకాండ జరిపింపబడినది. కొన్నియిండ్ల నుండి కొందరు ఇంటిలో చెప్పకుండ అవసరము పనులపై గ్రామములకు వెళ్ళినవారును ఉన్నారు. అట్టివారికికూడా వారి యిండ్లలో కర్మకాండ ముగిసిపోయినది. పిమ్మట ఆ ఊరికి పోయినవారు యింటికి తిరిగిరాగా, ఇంటివారును, వారును ఒకరి నొకరు చూచుకొన్నప్పుడు వారివారిమనస్సు లెట్లుండెననేది పాఠకులే ఊహింపదగును.

ప్రదర్శనములో నుండి చావు తప్పించుకొని ఇవతల పడిన వారును కలరు. అట్టి వారిలో సుప్రసిద్ధ పురుషులగు శ్రీ కొల్లా కన్నయ్యశెట్టిగారొకరు. వీరు మంచి కసరతుచేసిన బలశాలులు. వీరు లోపలినుండి బైటికి తడికల ఆవరణముపైకి ఫల్టీకొట్టి వెలుపలికిదూకిన సాహసికులు, చతురులు. వారట్లు దూకుచుండగా వారిమెడలో నుండిన పెద్దపొగడాల కంఠమాల జారి క్రిందపడి పోయినది. ఆదండ దొరికినవాడు మరునాడు శెట్టిగారింటికి వెళ్ళి

సమర్పించుకొని బహుమానమును పొందినాడు. ఆకాలమున కొల్లా కన్నయ్యశెట్టిగారిని వారిమెడలోయుండు పొగడాల మాలను తెలియని వారరుదు.

వీరు కోమట్లలో పెద్ద శెట్టి. వైశ్యులందరు వీరిని పూజించనిదే వారిండ్లలో శుభకార్యము లను చేసుకొనే వారుకారు. ధనికుడు; దాత; గంభీర పురుషుడు. వీరు శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయపు ధర్మకర్తలు. వారు అప్పుడప్పు డాదేవాలయమునకు వచ్చుచుండేవారు. వారప్పుడు మొగమునిండ విభూతి పూసుకొని దానిపైన యర్రటి కుంకుమబొట్టు పెట్టుకొని, జోడు గుఱ్ఱముల పీటణ బండిలో కూర్చుండ జోడు వింజామరలతో, ఇల్లు బయలుదేరి పరమేశ్వరి దర్శనార్థము దేవాలయమునకు వచ్చునప్పుడు వారికి జరుగుచుండిన గౌరవము, మర్యాద ఇప్పుడీ పాంత్రమునకు వైస్‌రాయిగారు వచ్చినా వారికిన్నీ జరుగజాలదు. శెట్టిగారు దేవాలయ మునకు వచ్చెదరన్న సంగతిని జనులకు తెలుపుటకొరకు దేవాలయములోని పెద్దగంటలను మ్రోగించేవారు. ఈగంటశబ్దమును విన్నవారందరును ఆదర బాదరగా నడుములకు పైపంచల కట్టుకొని, వీధిగుమ్మమున నిలువబడి శెట్టిగారికి రాగానే దాసోహముల సమర్పించేవారు. వీరి ఆస్థిపాస్థుల పరిమితి చెప్పవలయునంటే—ప్రస్తుతము హైకోర్టు దానిచుట్టుప్రక్కల కొన్ని బిల్డింగులుగల ప్రదేశమంతయు నాడు వారిస్వంతము అని చెప్పిన చాలును. అయితే, ఇది వీరి మొదటి మహర్దశ. కడపటిదశను పిదప వ్రాయించెదను.

ఇక నాసంగతి ఏమైనదో చెప్పెదను. నేను ప్రదర్శనమును చూచుటకు లోనికిపోకుండ బయటనుండి ప్రాణముల కాపాడుకొంటినిగాని నాతో కూడవచ్చిన బాలుడు కనబడకుండుటచే చాలాదూరము వెలుపల గేటువద్ద నిలుచుంటిని. గాని వాడు కానరాడాయెను. అప్పుడు నేను వంటరిగా ఇంటివైపునకు తిరిగి పోవుచుంటిని. నేను సెంట్రల్‌స్టేషన్ ఎదుటికి వచ్చుసరికి నాపేరుపెట్టి పెద్దగా పిలుచుచూ ఆత్రముతో మాతల్లి పార్కువైపునకు పరుగెత్తుచుండెను. ఆమె గొంతును నేను గుర్తించితిని. వెంటనే పరుగెత్తిపోయి ఆమెఎదుట నిలువబడితిని. అప్పుడు మాఅమ్మ నన్ను కౌగలించుకొని నిట్టూర్పువిడిచెను. ఆమె ఈప్రదర్శనము కాలి పోయిన వార్త విన్నవెంటనే పరుగెత్తుతూవచ్చి నన్ను కలుసుకొనుటచే, వళ్ళంతయు జోరు చమటలు పోయుచు ఆలసటచే రొప్పుచుండెను. నేనామె అవస్థను చూచి, రోడ్డు వార నామెను కూర్చుండ మనచెప్పి నేనున్నూ కూర్చుంటిని. ఆ కూర్చుండినచోటు స్టేషణగేటు ఎదురుగా జనరల్ హాస్పిటల్ ఆవరణపుగోడప్రక్కన. ఇప్పటికిని నేనాప్రక్క వెళ్ళినప్పుడెల్ల పూర్వస్మృతితో ఆప్రదేశమును గమనించి చూచుచుందును. అక్కడ కొంతవిశ్రాంతి తీసుకొని ఒంటెద్దు బండిమీద యిరువురము యింటికి చేరితిమి. అప్పుడునాతో కూడవచ్చిన వానితల్లి 'మావాడెక్కడ' యని అడిగెను. కాని నాకు వెంటనే నోట మాటరాక కొంతసేపటికి జరిగిన సంగతినంతయు తిన్నగా చెప్పితిని. వెంటనే ఆమె తనబిడ్డకొరకు పార్కునకు పరుగెత్తినది గాని, రాత్రియంతయు అక్కడవేచియుండి పిల్లవానిని గుర్తించలేక, తెల్లవారినపిదప నిరాశతో ఆతల్లి యిల్లుచేరినది. చెన్నపట్నమున ఆనాటి దుర్దినం అవిధముగా గడిచిపోయినది. ఆనాడు మృతిచెందినవారి శ్రాద్ధములు ఇప్పటికికూడ అనేకులఇండ్లలో, జరుగుచునే యుండవచ్చును.

[సశేషం.]

# జరుగుతున్న చరిత్ర





— చాణక్య

భారతదేశ విభజన నిశ్చితమైపోయింది. దానికోసం సాగించవలసిన కార్యక్రమాన్ని త్వరత్వరగా సాగిస్తున్నారు. ఎంతో కాలంనుంచి మన మనః ఫలకాలలో హత్తుకొనివున్న ప్రాచీన భారతవర్ష స్వరూపం చెడి వికృతంకాబోతున్నది. ఇది చాలమందికి హృదయవిదారకం కాకమానదు. అనివార్యంగా స్థితిగతులు అలా నెట్టుకువచ్చినప్పుడు తలొగ్గక చేయగలిగింది ఏమున్నది?

ఏది ఎలా ఉన్నా, వాస్తవిక స్థితిగతులను గుర్తించటం అవసరం. ఇకమీదట మనదేశం రెండు స్వతంత్రరాజ్యాలుగా చీలిపోబోతున్నది. దేశవిభజనకు అనుగుణంగా ఆర్థికసంపదను, సైన్యాన్ని, ప్రభుత్వశాఖా ఉద్యోగులను పంపిణీచేస్తున్నారు. అయితే యీ పంపిణీ ప్రాణహాని లేకుండా ప్రశాంతంగా జరిగిపోతుందా? ఇంతటితో విద్వేషాలు చల్లారి శాంతిభద్రతలు ఏర్పడుతాయా? రెండు రాజ్యాలలోను అల్పసంఖ్యాకులకు న్యాయం జరుగుతుందా?

ఈ విషయాలలో తగిన సూచీ లభించటం లేదు. లాహోరులోను, తదితర పంజాబు నగరాలలోను జరుగుతున్న హింసాకాండా, దోపిడీలు చూస్తే, అక్కడి అధికసంఖ్యాకులకు అల్పసంఖ్యాకులమీద ఏమాత్రం సుహృద్భావం ఉన్నట్లు కనిపించటంలేదు. ఈ దురాగతాలవల్లనే అక్కడి హిందువులు, సిక్కులు ఇతరరాష్ట్రాలకు వలసవెళ్ళుతున్నారు. పోనీ దేశవిభజనవల్ల మతసమస్య, ముమ్ముందు ఎలాంటి పేచీలు రాకుండా సంతృప్తికరంగా పరిష్కారమయిందా అంటే అదీలేదు. అల్పసంఖ్యాకులకు ఘోర అన్యాయం జరుగుతున్నదని నిరంతరం గోల బయలుదేరవచ్చును. దానితో ఒండొరులపై పగ సాధించాలన్న ఆందోళన రేగవచ్చును. వీటి ఫలితంగా పాకిస్థాన్ హిందూస్థాన్‌లకు సామరస్యం చెడి నిరంతరం స్పర్థ ప్రజ్వరిల్లవచ్చును.

వీటినన్నిటిని గమనించినప్పుడు ఒకటి స్పష్టమౌతున్నది. విభజనజరిగి సంపూర్ణ స్వాతంత్ర్యం పొందే యీ మధ్యకాలం చాల గడ్డుగావుంటుంది. శాంతి భద్రతలను నెలకొల్పటమే యీ మధ్యకాలంలో అత్యంత ప్రధానమవుతుంది. అందువల్ల ఆర్థిక పునర్నిర్మాణ ప్రణాళికలను కట్టివేయవలసి రావచ్చును. మన ఆర్థికజీవనం చక్కబడి, పారిశ్రామికాభివృద్ధి జరిగి, జీవనపరిమాణం పెంపొందాలని యుద్ధం ముగిసినప్పటినుంచి మనం ఎంతగానో ఆశిస్తూవచ్చాము. మళ్ళీ మామూలు పరిస్థితులు ఏర్పడేటంతవరకు ఈ ఆర్థికప్రణాళికలను ఆపకతప్పదు. అనుకూల పరిస్థితులు మళ్ళీ ఏర్పడాలంటే కొన్ని సంవత్సరాలు పట్టవచ్చును-ఈలోగా ఇంతకుముందు

చెప్పినట్లు పెక్కుప్రాంతాలలో స్థితిగతులు మరీ అధ్వాన్నం కావచ్చును. ఆ పక్షంలో ప్రభుత్వం కేవలం పోలీసువిధులను మాత్రమే నిర్వహించవలసివుంటుంది.

ఇప్పుడు మనకొక్కటే కొంత మెరుగుగా కనిపిస్తున్నది. రెండు అధినివేశ రాజ్యాలను నెలకొల్పటానికి కావలసిన చట్టాన్ని బ్రిటిష్ ప్రభుత్వం త్వరత్వరగా తయారుచేస్తున్నది. ఆగస్టు 15 నాటికి ఇండియాలో రెండు అధినివేశరాజ్యాలు ఏర్పడుతాయి. దీనివల్ల అటు పాకిస్థాన్ రాజ్యాంగచట్టము, ఇటు భారత సమాఖ్య రాజ్యాంగచట్టం పూర్తిచేయటానికి వీలేర్పడాలి. రెండు రాజ్యాంగపరిషత్తులు తమతమ కార్యకలాపాలను చురుకుగా సాగించి అధినివేశ రాజ్యాలు ఏర్పడిన తరువాత అవి అవలంబించటానికి కావలసిన రాజ్యాంగప్రణాళికలను సిద్ధపరచాలి. ఈ పరిషత్తులు తమ బాధ్యతలను గుర్తించి పనిచేస్తే, ఆగస్టు 15 నాటికి రాజ్యాంగ ప్రణాళికలను తయారుచేయటం, వాటిని అధినివేశ రాజ్యాల శాసనసభలు ఆమోదించి చట్టాలను చేయటం సమాప్తికావచ్చును. కనీసం భారతసామాఖ్య అయినా వచ్చే సెప్టెంబరు మధ్యలోకాని, లేదా అక్టోబరు ప్రారంభానికికాని రాజ్యాంగ ప్రణాళికను తయారుచేసి శాసనసభలో ప్రతిపాదించటానికి సిద్ధపరచవచ్చును. ఆ తరువాత భారతసామాఖ్య శాసనసభకు, రాష్ట్రశాసన సభలకు ఎన్నికలు జరపటానికి కావలసిన సన్నాహాలు జరిపి 1948 జూన్ ఆఖరుకు కొత్త ఎన్నికలు జరిపించవచ్చును. ఈ లోపున ఉభయరాజ్యాల సరిహద్దులను, భాషా ప్రయుక్త రాష్ట్రాల సరిహద్దులను ఆయా కమిటీలు నిర్ణయించి 1948 జూన్‌కు భాషా ప్రయుక్తరాష్ట్రాలను ఏర్పరచాలి.

* * *

భారత సమాఖ్యపట్ల కొన్ని సంస్థానాలు అవలంబిస్తున్న వైఖరి ఆందోళనకరంగా ఉంది. అధినివేశరాజ్యాలు ఏర్పడటంతోనే స్వదేశసంస్థానాలపై బ్రిటన్‌కున్న సార్వభౌమత్వం అంతరిస్తుంది. అయితే నిన్న మొన్నటిదాకా బ్రిటిష్‌ప్రభుత్వానికి జోహుకుం కొడుతూవచ్చిన ఈ సంస్థానాలు ఆకస్మికంగా ఒక్కసారి సర్వస్వతంత్రమై పోతామనటం చాల విచిత్రంగా ఉంది. హైదరాబాదు, తిరువాన్కూరు సంస్థానాలు తమ సర్వస్వతంత్రతను ప్రకటించుకోటానికి నిశ్చయించుకొన్నాయి. స్థితిగతులు ఎలా మారుతాయో చూచి ఆపిమ్మట చేయవలసిన పని చేదామని మరికొన్ని సంస్థానాలు కూడా బహుశ వేచి ఉండవచ్చును. తాము సర్వస్వతంత్రరాజ్యాలుగా ఉండాలని తిరువాన్కూరు, హైదరాబాదు ఇంకా పట్టుపట్టి కూర్చుంటే అక్కడ హింసాకాండ ప్రజ్వరిల్లకతప్పదు. తీరా స్వాతంత్ర్యం సిద్ధించమన్న సమయంలో దేశంలోని కొన్ని ప్రాంతాలలో పౌరసత్వాలు నశించి అచటి ప్రజలు హింసకు బలి కావలసి రావటం శోచనీయం. దీనికంతకూ కొంతమంది సంస్థానాధిపతుల దుర్నీతి దుర్విదగ్ధతలే కారణం. మరొకప్రక్కన పెక్కు సంస్థానాలు ఇండియా సమాఖ్య రాజ్యాంగ నిర్మాణంలో పాల్గొంటున్నాయి. ఈ పాల్గొంటున్న సంస్థానాలలో ముఖ్యమైనవి, పెద్దవీ కూడా వున్నాయి. భారతసమాఖ్యకు మధ్యలో దానికి విరుద్ధవిధానాలు అవలంబించే సర్వస్వతంత్ర భాగాలు ఉండటానికి వీలులేదు. అలాంటి వాటిని ఉండనీయటం శ్రేయస్కరం కాదనటంలో ఎంతో సత్యముంది. ఇలాంటివి వుంటే భారతసమాఖ్య భద్రతకు ముప్పు

వాటిల్లుతుంది. పోనీ అలా ఉండనిస్తే, ఆయా భాగాలకు ప్రత్యేకంగా ఏమైనా మేలు కలుగుతుందా అంటే అలాంటి దేమీలేదు.

ఏది ఎలావున్నా, ప్రజలు అంగీకరించక ప్రాణాలొడ్డి అయినా ప్రతిఘటించటానికి పూనుకొన్న ఈ వైఖరిని సంస్థానాధిపతులు అవలంబించటం ఏమాత్రం మంచిదికాదు. అది రాజనీతి కాదు. తిరువాన్కూరు హిందూసంస్థానం. నైజాములో అధిక సంఖ్యాక ప్రజలు హిందువులు. అందువల్ల ఈ రెండు సంస్థానాల ప్రజలశ్రేయస్సు భారతసమాఖ్య కోరుతున్న శ్రేయస్సుకంటె భిన్నమైనదికాదు. ఎందువల్లనంటే భారత సమాఖ్యలో చేరుతున్న రాష్ట్రాలన్నీ హిందూ ప్రాబల్యమున్నవే. చరిత్ర, భూగోళకస్థితి, మొదలైనవాటివల్ల తమ స్వాతంత్ర్యానికి ఏర్పడుతున్న నియతత్వాన్ని గుర్తించి సంస్థానాధిపతులు భారతసమాఖ్యతోపాటు కలిసిపోవాలితప్ప వారికి మరొక గత్యంతరం లేదని రాజకీయ విజ్ఞత హెచ్చరిస్తున్నది.

వాయవ్య సరిహద్దురాష్ట్రం భవిష్యత్తు దేశానికి, ముఖ్యంగా భారతసమాఖ్యకు అత్యంత ప్రధానం. ఇండియా రక్షణకు ఈ రాష్ట్రం ఆయువుపట్టు. ఈ రాష్ట్రంలోనే కైబరు కనుమ ఉంది. లోగడ ఇండియాకు వచ్చిన విదేశ దండయాత్రా ప్రమాదాలన్నీ యిటు నుంచే వచ్చాయి. భారతసమాఖ్య అలాంటి ప్రమాదానికి గురికాకుండా తన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలంటే, ఈ రాష్ట్రాన్ని కూడ తనలో చేర్చుకోవాలి. సరిగా ఈ దృష్టితోనే ఈ రాష్ట్రాన్ని పాకిస్థాన్‌లో కలుపుకోవాలని ముస్లింలీగ్ తహతహ లాడుతున్నది. అందుకోసమే లీగ్ అంత భగీరథప్రయత్నం చేస్తున్నది.

అసలు పఠానుకు ప్రత్యేక వ్యక్తిత్వమున్నది. అందువల్ల తను స్వతంత్రంగా ఉండాలని అభిలషిస్తాడు. ఏది ఎలావున్నా ఆ రాష్ట్రం భారతసమాఖ్యలో చేరటమే ఉత్తమం. ఎందుకంటే సరిహద్దురాష్ట్రం వీడిపోయి స్వతంత్ర పఠానీస్థాన్‌గా ఉంటే విదేశదండయాత్రా ప్రమాదాన్ని ఎదుర్కొని తన్ను తాను కాపాడుకోగలిగినంత బలవత్తర రాజ్యం కాజాలదు. భారత సమాఖ్యలో చేరితే, ఇటు భారతసమాఖ్యకూ పెట్టనికోటగా ఉంటుంది; అటు పఠానులకూ ఎంతో మేలు సమకూరుతుంది. రాష్ట్రీయ వ్యవహారాలలో ఇతరుల ప్రమేయం లేకుండా సంపూర్ణ స్వపరిపాలన సాగించుకోవచ్చును. అలా కాక, పాకిస్థాన్‌లో చేరితే, అది పశ్చిమ పంజాబులో కేవలం అంతర్భాగమైపోయి వ్యక్తిత్వాన్ని, స్వపరిపాలనను కోల్పోతుంది. పైగా మరొక విశేషముంది. తమమీద పంజాబు మహమ్మదీయులు కాని, మరొకరు కాని పెత్తనం చెలాయించటం పఠానులకు సుతరాం గిట్టదు. ఇండియా భావిభద్రత వాయవ్య సరిహద్దు రాష్ట్రప్రజల నిర్ణయం మీద చాలవరకు ఆధారపడివుంది. అయితే సరిహద్దు కాంగ్రెసువారు రెఫరెండంను బహిష్కరించారు. దీనివల్ల ఉత్పన్నం కాబోయే సమస్యలూ, దాని ఫలితాలమీద ఇండియా భవిష్యత్తు చాల ఆధారపడిఉంది.



# మన రాజకీయాలు

ప్రకాశంపంతులుగారి ప్రజాప్రభుత్వంలో జరిగిన అవకతవకలనుగురించి మేము వ్రాయటం మొదలుపెట్టినతర్వాత మమ్మల్ని సమర్థిస్తూ అనేకమంది ఉత్తరాలు వ్రాశారు. ఇక మమ్మల్ని తిట్టిన వారుకూడా లేకపోలేదు. వారి ఉత్తరాలన్నీ క్రిందటిమారు ప్రకటించి జవాబు ఇచ్చాము. పోతే ఈమాటు మాకు కాన్పూరు, సేలం, గోపాలపూర్ లనుంచి మూడు ఉత్తరాలువచ్చినై. ఉత్తరాలలో కొత్త విషయాలు ఏమీ లేవు కాని, రాష్ట్రేతర ఆంధ్రులలో ఉండవలసిన ఆవేదన కనపడుతున్నది. వారికి ఒక్కటే మేము చెప్పేది. ఆంధ్రజ్యోతి ఆంధ్రత్వంలో ఏనాయకుడికీ తీసిపోదని. ఆంధ్రజాతికి నష్టంకలిగించు పనులకు ఏమాత్రమూ సహాయపడదని.

పోతే మాకు ఇంకో చిత్రమైన ఉత్తరం వచ్చింది. 'ప్రకాశంగారు ప్రధానికాగానే ఆంధ్రదేశంనించి ఎన్ని కుటుంబాలు బ్రతకటంకోసం మద్రాను చేరినదీ, అవి సిఫార్సులు చేయటంలో మధ్యవర్తిత్వం వహించి, పత్రికలు వ్యవస్థాపించి, చేస్తున్న ఛండాలమూ, చూపుతున్న పామరత్వమూ మాకు తెలుపుతూ.' ఈసంగతి మాకు తెలియక పోలేదు—ప్రజలకూ తెలియకపోలేదు. అంచేతనే మేము వాటినిగురించి ఎత్తటం లేదు. అవుసరమయితే వీటి పుట్టు పూర్వోత్తరాలతో సహా మేమూ వ్రాయ గలము.

* * *

ఇక ఈమాసంలో మన రాజకీయాలు అంత చెప్పుకో దగ్గవి ఏమీ లేవు. దాదాపు ఒక నెలా పదిహేనురోజులనించి మాట్లాడని పంతులుగారు తమ వాక్శుద్ధి నంతా కూడబెట్టుకుని ప్రస్తుతమంత్రి వర్గం పడిపోతుందని బ్రహ్మశాపం ఇచ్చారు! శుభం.

మేమూ ఆశుభ ఘడియకోసం ఎదురు చూస్తున్నాము. ఈ ముసలితనంలో వారి యువకఆత్మ శాంతిపడటం ఎంతేనా అవసరం! ఈ సత్కార్యంలో మేము

# నేతాజీ

## భద్రాచలం అరణ్యాలలో

నేతాజీ సుభాష్‌చంద్రబోసు భద్రాచలం అరణ్యాలలో తపస్సు చేస్తూఉండగా తాను చూచాడనీ. ఇండియానుంచి బ్రిటిషువారు జూన్ 1948 లోగా తొలిగిపోకపోతే తాను మరల వచ్చి నాయకత్వం వహిస్తానన్నాడనీ ఒక కోయదొర తనతో చెప్పినట్టు మా రాజమండ్రి విలేఖరి వ్రాస్తున్నాడు.

ఏవిధంగానూ పంతులుగారికి అడ్డురామని హామీ ఇస్తున్నాము.

* * *

ఇక రంగాగారు. శ్రీవారు యూరోపు పోయి ఇండియాలో విడుబోలుకున్న ప్రాముఖ్యతను, అక్కడ పుట్టిన వివిధ సంఘాల ప్రాతినిధ్యాన్నీ చక్కగా నిరూపించి వచ్చారు. ఇది ఆంధ్రులు ఎంతేనా గర్వింపదగ్గ విషయం.

అయితే ఈమధ్య వీరికి తమ ఆంధ్ర నాయకత్వంమీద నమ్మకం పోయినట్టుగా ఉంది. అందుచేతనే మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెసు సంఘాలు అభ్యర్థులను ఎన్నుకోవటం మానివేసి వోటర్లకే వదిలిపెట్టించారు. నలుగురు కాంగ్రెసు అభ్యర్థులను నామినేట్ చేస్తారట. వారిలో ఎక్కువవోట్లు తెచ్చుకున్నవారిని అఫిషియల్‌గా నామినేట్ చేస్తారట. ఈ ఇందులో వోడిన ముగ్గురు సోదరులూ ఏకమై కాంగ్రెసు అభ్యర్థిని ఓడిస్తే శ్రీ రంగాగారు ఎట్లా అడ్డుపడతారో ఆ కాంగ్రెసుఅభ్యర్థికే తెలియాలి! ఇందులో కిటుకు అందరికీ తెలిసిందే. మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెసుమంత్రం పనిచేయదని అందరికీ తెలుసు. అయితే ప్రతిచోటా రంగాగారికి కొన్ని బరువులు ఉన్నై. వీళ్ళను ఏదో విధంగా చిన్న చిన్నపదవుల్లో ఇరికించాలి! దానికోసం ఈతిప్పలన్నీ. శ్రీ రంగాగారి కష్టాలు మేము గ్రహించాము. సానుభూతి కూడా చూపుతున్నాము. అయితే పరిణామంచూసి బెదిరిపోవద్దని ధైర్యం చెప్పుతున్నాము.



# నే తా జీ

## భద్రాచలం అరణ్యాలలో

నేతాజీ సుభాష్‌చంద్రబోసు భద్రాచలం అరణ్యాలలో తపస్సు చేస్తూఉండగా తాను చూచాడనీ. ఇండియానుంచి బ్రిటిషువారు జూన్ 1948 లోగా తొలిగిపోకపోతే తాను మరల వచ్చి నాయకత్వం వహిస్తానన్నాడనీ ఒక కోయదొర తనతో చెప్పినట్టు మా రాజమండ్రి విలేఖరి వ్రాస్తున్నాడు.

ఏవిధంగానూ పంతులుగారికి అడ్డురామని హామీ ఇస్తున్నాము.

* * *

ఇక రంగాగారు. శ్రీవారు యూరోపు పోయి ఇండియాలో విడుబోలుకున్న ప్రాముఖ్యతను, అక్కడ పుట్టిన వివిధ సంఘాల ప్రాతినిధ్యాన్నీ చక్కగా నిరూపించి వచ్చారు. ఇది ఆంధ్రులు ఎంతేనా గర్వింపదగ్గ విషయం.

అయితే ఈమధ్య వీరికి తమ ఆంధ్ర నాయకత్వంమీద నమ్మకం పోయినట్టుగా ఉంది. అందుచేతనే మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెసు సంఘాలు అభ్యర్థులను ఎన్నుకోవటం మానివేసి వోటర్ల కే వదిలిపెట్టించారు. నలుగురు కాంగ్రెసు అభ్యర్థులను నామినేట్ చేస్తారట. వారిలో ఎక్కువవోట్లు తెచ్చుకున్నవారిని అఫిషియల్‌గా నామినేట్ చేస్తారట. ఈ ఇందులో వోడిన ముగ్గురు సోదరులూ ఏకమై కాంగ్రెసు అభ్యర్థిని ఓడిస్తే శ్రీ రంగాగారు ఎట్లా అడ్డుపడతారో ఆ కాంగ్రెసుఅభ్యర్థికే తెలియాలి! ఇందులో కిటుకు అందరికీ తెలిసిందే. మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెసుమంత్రం పనిచేయదని అందరికీ తెలుసు. అయితే ప్రతిచోటా రంగాగారికి కొన్ని బరువులు ఉన్నై. వీళ్ళను ఏదో విధంగా చిన్న చిన్నపదవుల్లో ఇరికించాలి! దానికోసం ఈతిప్పలన్నీ. శ్రీ రంగాగారి కష్టాలు మేము గ్రహించాము. సానుభూతి కూడా చూపుతున్నాము. అయితే పరిణామంచూసి బెదిరిపోవద్దని ధైర్యం చెప్పుతున్నాము.



వుండడంచేత, ఈ వృత్తరాలమూలాన ఆ జాబితాలకు చోటుచాలక, వారివారికి అన్యాయం జరిగిపోతుందనే భయంచేత పూరుకొన్నాను. ఇప్పుడైనా, ఆ వుత్తరాలన్నీ ప్రకటించక వాటిలో సారం ఉదహరించి విమ్మట నా ఉద్దేశం మనవిచేస్తాను.

'ప్లీడర్లు తాము న్యాయవాదులమని పేరు పెట్టుకోవడం మొదటి వంచనమట. లాయరనే మాటకు లా తెలిసినవాడని అర్థం. కాని న్యాయమును పురస్కరించుకొని వాదించే వాడని అర్థంలేదట. తక్కినవారంతా అన్యాయ వర్తనులూ, తామేమో మహాన్యాయస్థులూ, అనేధ్వని వున్నదట ఆ పేరులో. ఎవరికైనా వృత్తి అనేది ఉదరపోషణార్థం ఏర్పడింది కాని లోకోద్ధరణార్థ మేర్పడలేదట. లాయరు వృత్తికూడా అన్నివృత్తులతో పాటుదే అని కచ్చితంగా చెప్పివేస్తే ప్లీడర్లయందు లోకానికి వుండుకున్న మోజు తగ్గిపోయి, లోకం జాగుపడి, లోకంలో న్యాయానికి స్థానం దొరుకుతుందట. లేకపోతే దేశంలో బిరుదులు, గౌరవాలు, సత్కారాలు, అగ్రాసనాధిపత్యాలూ, శాసన సభ్యత్వాలు, కాంగ్రెసు అధ్యక్షతలూ, బోర్డుప్రెసిడెంటుగిరీలు, మునిసిపలు కౌన్సిలరుత్వాలు, రాయబారుల పేరుతో గవర్నర్లతో స్టేటు సెక్రటరీలతో చేతులు గలపడాలు, విందు లారగించడాలు, స్వంతఖర్చు దమ్మిడీలేకుండా దేశ దేశాలు తిరగడాలు ఇవ్వన్నీ ప్లీడర్లే గుత్తకు పుచ్చుకోవడం తగదట. న్యాయంకోసం పనిచేసేదీ సార్థకమైనదీ ఏదైనా మనదేశంలో వున్నదీ అంటే అది ఒక్క జస్టిసుపార్టీయే. కనుక కులములవారీగా ఉద్యోగాల పంపకాలతో పాటు పైచెప్పిన గౌరవాలుకూడా అన్నివృత్తుల వారికీ దొరికేచట్టం చేయించి తమపేరు నిలబెట్టుకో వలసిందని జస్టిసుపార్టీ వారిని హెచ్చరించవలసి వుంటుందట.

'ఇదిగాక దేశంలో ఇంజనీర్లుండగా, డాక్టర్లుండగా, మేష్టర్లుండగా, తహసీల్దార్లు డిప్యూటీకలెక్టర్లు మొదలైన ప్రభుత్వోద్యోగులుండగా, లక్షాధికారులైన వర్తకులుండగా, మహామహా పత్రికాధిపతులుండగా, కవులుండగా, గాయకులుండగా, చిత్రకారులుండగా, పత్రికల కింత చక్కగా వ్యాసాలు రాసే హేమాహేమీలం మేమంతావుండగా, నటులుండగా,—వీరందఱూ అలావుండగా చిన్నకథలువ్రాసే పెద్దలుండగా,—లాయర్లు తాముమాత్ర మేమో కొండమీదినుంచి దిగి వచ్చినట్లు, తమ కేమో కొమ్ములు మొలచినట్లు, కేటాయింపుగా గౌనులు, మెళ్లో తెల్లపీలికలు ధరించి బయలుదేరుతారే! ఇంత కంటె జగద్వంచన మేమైనావున్నదా?' అని ఒకరు వ్రాస్తారు.

'వేషంవల్ల లోకాన్ని మభ్యపెట్టడం అలా వుండగా, ప్రతీప్లీడరుకు వాకిట్లో బల్ల లెందుకు? పోనీ ఫలానివారి ఇల్లిదియని తెలియడానికి కట్టుకున్నారంటారా? అలాగయితే ఆ బల్లలమీద తమడిగ్రీల జాబితా లెందుకు? పాపం మేష్టర్లుచూడండి! ఇంతకన్న పెద్దపరీక్షలిచ్చినా బల్లలుకట్టుకొంటారేమో! ఏమాట కామాటే చెప్పాలి. వినయమన్నప్పుడు, నిగర్వత అన్నప్పుడు ప్రథమ తాంబూలం మేష్టర్లకిచ్చితీరాలి. న్యాయం విచారిస్తే ఈ బల్లలు కట్టిన ప్లీడర్ల అందరి యిళ్ళు ఎక్కడో తెలిసికోవాలిసిన అవసరం ఎవరికిపట్టిందీ? అవసరం ఇతరులకు గాదు. ప్లీడర్లే పార్టీలను రాబట్టుకోవడానికి కట్టా రంటారా? అలా త్రోవకురండి. బజార్లో దుకాణదార్లు కట్టిన బల్లలతోపాటే నన్నమాట ఈ బల్లలుకూడా. అలా అంటే ఎవరికీ తగాదాలేదు. ఈ బల్ల కట్టుకోవడంకూడా

తమ అధికృతనూ, ప్రత్యేకతనూ తెలియజేయడం కోసమయినట్లు, పార్టీలు ఇల్లు తెలుసుకోలేక ఇబ్బందిపడిపోతారేమోననే జాలి చేతనయినట్లు పోజులు పట్టుత వాబల్లలు. "ఇంతచక్కని బల్లలు ఈవీధిలో తక్కిన యిండ్లకేవీ ?" అని సగర్వంగా ప్రశ్నిస్తున్నట్లుంటుందా యిళ్ళ వాలకం' అంటూ మఱొక ఉత్తరం అక్కను వెళ్ళబోసింది.

'అథంఖభ మెఱుగని బల్లల విషయమట్లా ఉండనివ్వండి. గ్రంథములు జ్ఞాననిధులని కదా అంటారు. వానికైనా తోచనక్కఱలేదా ? తమ వీధకెదురుగా బీరువాలలో అలంకరించి, వచ్చేవారికి, పోయేవారికి అమ్మ జూపినట్లు అమరుస్తారుగదా ప్లీడర్లు. తాము తగుదుమంటూ ఆ బీరువాలల్లో తయారైగిల్టు అక్షరాలతో ధగధగా మెరసిపోతూ మిట్టిపడడం తగునా ? ఇన్ని గ్రంథాలు తమకున్నవనీ, వాటినన్నింటినీ వల్లెవేశామనీ గర్వం లాయర్ల కుండదగునుగాని తమకెందుకి మిడిసిపాటు. పోనీ, తమ మొగాలుచూచి మోజుపడి లాయర్ల దగ్గర కెవరైనా వస్తారా? చెప్పండి. వస్తేమాత్రం తమకేమి లాభం ? ఉంటేగింటే లాయర్ల కుంటుందిగాని లాభం. పైగా, తాము న్యాయశాస్త్ర గ్రంథాలుగదా ! అమాయిక ప్రజ నలా ఆకర్షించడం అనుచితమని తోచనక్కరలేదా ? అదిన్నీగాక, తమ గర్భస్థమైవున్న న్యాయశాస్త్రమంతా లాయర్లకు జీర్ణమైందని తామేమయినా హామీపడగలవా ?' అంటూ మఱియొకరు హాస్యం.

'ఇంకొక విషయం చూడండి. ఈ లాయర్లలో నూటికి తొంభైమందికి చమురుఖర్చు కూడా గిట్టదుకదా. ప్రతి ప్లీడరుకు ఒక గుమాస్తా ఎందుకు చెప్పండి ? తనకు రాబడి లేనప్పుడు మెదలకుండా కృష్ణా ! రామా ! అంటూ ఇంట్లో కూర్చోకూడదూ ? మించి పోతున్న వానివలె పదిన్నరకల్లా బయలుదేరి కోర్టుకు హాజరా ? అప్పెసర్లుకూడా అంత తొందరగా గాబరాపడి రారే ! సరే, ఇంట్లో కూర్చుంటే ఏమీతోచదని బయలుదేరారే చూడండి. శుభ్రంగా దేవుడిచ్చిన కాళ్ళతో నడచిపోగూడదూ ? నిష్పక్షపాతంగా ఆలోచించి చూడండి.' ఇదంతా వంచనమవునో కాదో. బండి లేనిదే బయలుదేరరే ! నెలకు రెండువందలు తెచ్చుకొనే కాలేజి లెక్చరర్ల వంటి వాళ్ళు నిక్షేపంలాగ నడచిపోతారు. లేదా ఒక సైకిలు వేసుకుపోతారుగదా. తమకు అందులో నాల్గోవంతైనా రాబడి లేనప్పుడు రోజూ బండికి డబ్బు తగలవేయడం లోక వంచనానికి కాకపోతే ఎందుకో ఆలోచించండి. ఇట్లా బయలుదేరి బెంచికోర్టు దగ్గర నుంచి జిల్లాకోర్టువరకూ — ప్రతికోర్టూ తనిఖీ చేసుకుంటూ రాకతప్పదుగదా ! గబాగబా మేజిస్ట్రేటు కోర్టుకువెళ్ళి, అక్కడ ఒకగంట సేపు అటూ ఇటూ పచారాయించి, అక్కడ నుంచి జిల్లాకోర్టులోపల మించిపోతున్నట్లు, అక్కడ అందటికీ వినబడేలాగ చెప్పి, బయలుదేరడం. అక్కడ ఒకగంట కూర్చుని గబగబా మఱోకోర్టుకు; అక్కడనుంచి మఱో కోర్టుకు; ఇదీ వఱుస. డాక్టర్లకుకూడా అంత అవసరప్పనులుండవు సుమండీ ! డాక్టర్లు ఒకళ్ళు తేరగా వున్నారుగదా అని వాళ్ళను పట్టుకు అదంతా భేషజం అని వేస్తాము. మఱి దీని నేమనాలి ?

'ఈ అనవసరపు బండిఖర్చుతో తెమిలిందా ? ప్రతిలాయరు తప్పకుండా క్లబ్బులో మెంబరవుతాడుకదా. అధమం ఇంటరు క్లాసులో ప్రయాణం చేస్తాడుకదా. మోటార్లో

ప్రయాణమైతే ముందుసీటు కోసం పోలీసిన స్పెక్టర్లకు వారికి పోటీగదా! డబ్బిచ్చుకొన్నప్పటికీ ఆ పోటీలో తామేమైనా నెగ్గుతారా? ఉత్తది. ఊళ్ళోకి ఏ చందా వచ్చినా మహా ఇచ్చేవారికి మల్లే తమ యిండ్లచుట్టూ తిప్పుతారుకదా! పోనీ, వాకట్లో ఇంకో బిల్ల కట్టగూడదూ 'ఇచ్చట చందా లివ్వబడవు' అని. ఇంకా ఇటువంటి భేషజాలెన్నో వున్నవి. ఈ పటాటోపమంతా దేనికోసమో ఆలోచించండి.'

ఈ ధోరణిలో నడచిందొక వుత్తరం.

మఱియొకరు వ్రాసినది మఱీ అన్యాయంగా వుంది. ప్లీడర్లు ఏపనిచేసినా వంచనం కొఱకేననీ. దేశియందూ వారికి గాఢాభిమానం ఉండదనీ ఆ వుత్తరంలోని సారం. ఎలాగంటే:—

కొందఱు ప్లీడర్లు ఒక్కొక్క విషయంలో అతి అభినివేశం చూపుతారట. దానికికారణం జడ్జీగారికో మునసబుగారికో ఆ విషయమై ఎక్కువ అభిమానముండడమేనట. సంగీతమంటే చెవికోసుకొనే జడ్జీగారు వస్తారనుకోండి. అక్కడనుంచీ ప్లీడర్ల కెక్కడలేని గానకళాభిమానం,గానరసజ్ఞతా పుట్టుకువస్తుందట. గానసభ లేర్పాటు చేయించడం, గానసభలలో ముందు కూర్చుండి తలలు త్రిప్పడం, జడ్జీగారి అభిప్రాయాన్ననుసరించి తాళం వేయడం మొదలుపెట్టుతారట. మునసబుగారు బ్రాహ్మమతస్థుడైతే బ్రహ్మమందిరం ప్లీడర్లతో నిండిపోతుందట. మొగాన బొట్లు చెరిపేసికొని, రజస్వలా వివాహాలను గూర్చి విధవా పరిణయావశ్యకతను గూర్చి సభలు ఏర్పాటుచేసి మునసబుగారిని ప్రెసిడెంటుగా పిలిచి ఉపన్యాసాలు మొదలుపెట్టుతారట. సబుజడ్జిగారు సనాతననిష్ఠయితే, మళ్ళా విభూతిధారణం, బిళ్ళగోచీలు, శారదా అక్టు ఖండనసభలు చేయించడం ప్రారంభిస్తారట.

నాకువచ్చిన అనేక ఉత్తరాలలో ఉన్న సారం క్లుప్తంగా నా స్వంత మాటలతో చెప్పాను. పాఠకుల కిప్పటికే ఉత్తరాలు వ్రాసిన వారి సౌజన్యం బోధపడివుంటుంది. ప్రథమంనుంచి మనదేశంలో అమితమైన గౌరవముపొందుతూ, దేశంలో ప్రారంభమైన ప్రతిఉద్యమ ప్రచారానికీ తోడ్పడుతూ, దేశాభ్యుదయాని కనేకవిధాల కారణభూతులైన న్యాయవాదులనుగూర్చి ఇటువంటి విపరీతాభిప్రాయాలు ప్రజలలో వ్యాపించడంచూస్తే విచిత్రంగావుంది.


న్యాయవాదు లనేపేరు మనంపెట్టాముగాని ప్లీడర్లు పెట్టుకొన్నదికాదు. మనమే ఒక పేరుపెట్టి, ఆ పేరుచే మనచేత వ్యవహరింపబడేవారిని నిందించడం తగదు. న్యాయవాదులతోపాటు ఇటువంటి అన్యాయానికి గురియైనవారు భావకవులొకరున్నారు. 'యథార్థంగా నేను ముక్కుకు సూటిగానే వెళ్లుతాను. ఈ అబద్ధపు కేసులో నేను పనిచేయను' అన్నప్పటికీ, సాక్షులచే అబద్ధాలు చెప్పించకపోయినప్పటికీ, మర్నాడు ప్లీడరు పనికి స్వస్తిచెప్పి, బల్లతిరగేసి, ఏ బడిపంతులుగానో ప్రవేశింపవలసిందే గాని వేరే మార్గమున్నదేమో చెప్పండి! పోనీ, ఈ యబద్ధాలన్నీ ప్లీడర్లు తమకోసమే ఆడుతున్నారన్నట్లుగా ఎంచడం ఏమిన్యాయంగా వున్నది? ప్రజలంతా పరుల ధనమానప్రాణాలు అపహరించ వలెననే దుర్బుద్ధితో ప్రవర్తించడం మానకపోతే లాయర్లేమి చేస్తారు? ఆపదలో ఉన్నవాణ్ణి ఆదుకొని, ఆర్తరక్షణం చేయడం కూడా దోషంగా యెంచడం న్యాయమా? దోషులను రక్షించ ప్రయత్నించడంలో ధనకాంక్షే ప్రధానమనికూడా నేను అంగీకరించను. అందులో బోలెడు భూతదయా పరత్వంకూడా ఇమిడివున్నది. కాదయ్యా, కేవలం ధనాశచేతనే ప్లీడర్లీపని చేస్తున్నారు. చేస్తే అన్నివృత్తులవారితోపాటే అవుతారు గాని ప్రత్యేకం నిందార్హులుగారు అని నా ఉద్దేశం. వేలకువేలుడబ్బు పెట్టుబడిపెట్టి,

చదివిన చదువుకు వడ్డీయైనా గిట్టుబాటు కాకుండా, మొదలుపెట్టబేరం చేసే ధర్మరాజు లెవరయ్యా ఈ కలికాలంలో ? స్కూలు మేష్టర్లవంటివాళ్ళు ప్రైవేటుట్యూషన్లనీ, పరీక్షల్లో మార్కులనీ ఏదోతంటాలు పడకపోతే కాలం గడవడంలేదే! పత్రికాధిపతులు డబ్బు కోసం నానా అవాచ్యాలు ప్రకటిస్తున్నారే!

కాబట్టి ఆ సంగతి వదలిపెట్టండి. ఇక దేశంలో గౌరవాలు బిరుదులు మొదలైనవన్నీ ప్లీడర్లే గుత్తకు పుచ్చుకున్నారనేది పదిహేనేళ్ళక్రితం నిజమే. గాంధిగారి ఉద్యమం వచ్చిపడ్డతరవాత నిజానికి ప్లీడర్లకేమిగౌరవాలు దక్కుతున్నవి చెప్పండి? జమీందార్లు రుచిమరిగిన తరువాత శాసన సభల్లో ప్లీడర్లకేకాదు, ఇంకొకరికిమాత్రం చోటుదొరకుతున్నదేమో ఆలోచించండి. ఇక ప్లీడర్లు తలకు దగనివేషంవేసి, పటాటోపం చేసి, డబ్బు తగులబెట్టుకొంటే ఎవరిదేమి పోయింది? ఈ పటాటోపమంతా చాలక, పత్రికల్లో తరచు వ్యాసాలు వ్రాసీ, కాఫీ హోటల్సుదగ్గరా, రైల్వేప్లాటుఫారములమీదా ఏజంట్లను పెట్టీ, ఎన్నితిప్పలుబడ్డా గిట్టుబాటు లేక ప్లీడర్లు ఇబ్బంది పడుతున్నందుకు జాలి పడాలా? అక్కసుచెందాలా? ఇంతకూ, లాయర్లు ఆత్మగౌరవం, అభిమానముగల వాళ్ళు కావడంచేత ఈ ఖర్చులన్నీ పెట్టుకొంటూ తమ హోదాను రక్షించుకొంటున్నారు గాని, 'మేము వృద్ధులం, మేమెట్లావుంటే యేమి' అనుకొంటే యే యిబ్బందీలేదు. లాయరు గౌరవం అలావుంచండి. లాయరుగారి భార్యకూడా తక్కిన సామాన్యస్త్రీలవలె సంచరించడానికి వీలుండదు. వెయ్యిమందిలో కూడా 'ఈమె లాయరుగారి భార్య' అని చెప్పడానికి వీలుగా సంచరిస్తేనే లాయర్ల గౌరవం రక్షింపబడుతుంది.

ఇక ప్లీడర్లు ఏపనిచేసినా ప్రసిద్ధికొఱకు చేసేనటనేగాని దానిలో విశ్వాసముండి కాదంటారే! వారికి నష్టంలేని బ్రహ్మసమాజమున్నూ బిళ్ళగోచులున్నూ అలావుంచండి. నాన్‌కో ఆపరేషన్లో ప్రాక్టీసు మానివేయడం కూడా ప్రసిద్ధికేనా? నెలకు యాభైరూపాయల చొప్పున ఎవరో మహారాజు కొందఱికి ఇచ్చాడే చూడండి. ఇస్తేమాత్రం నిక్షేపంవంటి ప్రాక్టీసు మానుకొనిపోవడం సామాన్యమా! మానుకొన్నవారిలో, చాలాభాగం ఆ యాభై కూడా గిట్టనివారేననీ, కొందఱికి ప్రస్తుతం నష్టంవచ్చినా మళ్ళీ ప్రాక్టీసు పెట్టితే ఈ ప్రసిద్ధివల్ల వేలకొలది ఆర్జించవచ్చుననే ఆశ వున్నదనీ మాత్రం ఎవరూ వ్రాయలేదు. వారి పుణ్యమా అని. వ్రాస్తారుకూడాను. కలానికి అడ్డమేమిటి?

ఇవన్నీ పోనివ్వండి. ఒక్కసంగతి అడుగుతాను. ఇంతమందికి కన్నెఱ్ఱగా వున్న లాయరు వేషమున్నదే, సీమాజామా, దానిని వదలిపెట్టి అనేకమంది కళాహీనమైన ఖద్దరు ధరించి, కోర్టు ఏమనుకుంటుందో అనే బెదురులేకుండా, హాజరవుతున్నారే. నిజమైన దేశాభిమానం లేకపోతే ఆ చక్కని గౌను ఆ సూటు, హాటు వదలిపెట్టడం శక్యమా? ఇది కూడా కాంగ్రెసు అభిమానంగల పల్లె రైతుల నాకర్షించడానికి ఉపాయమంటారా? అనండి. మీకొక నమస్కారం.





# పనివేసినమంగలి

రాష్ట్రపతి కృపలానీగారు సతీసమేతంగా కాశ్మీరు వెళ్లారు. కాశ్మీరు రాజావారు గ్రామాంతరం వెళ్ళి ఉన్నారు. రాష్ట్రపతి దంపతులు రాజావారున్న చోటికి వెళ్ళారు. అవసరమైన సొంతపని ఉండి ఉంటుంది. కాశ్మీరు రాజావారు కృపలానీ సతిగారికి ఇరవై అయిదువేలు కట్నం ఇచ్చారు. ఈ విషయం ఇంతటితోపోతే ఎట్లా ఉండేదో. రాష్ట్రపతిగారు పత్రికావిలేఖరులతో కాశ్మీరు సంస్థానం గురించి కొన్ని అభిప్రాయాలు వెలిబుచ్చారు. కాశ్మీరు దివానుగారిని తప్పు పట్టి లాభంలేదన్నారు, ఎందుకంటే ఆయన పైన యజమాని ఉన్నాడన్నారు, యజమాని చెప్పినట్టు చెయ్యటం ఆయనధర్మం అన్నారు. ఆ యజమానిని గురించి చెబుతూ, కాశ్మీర మహారాజావారు గడ్డకు చెందిన మనిషి అనీ, ఆయన పూర్వులు కాశ్మీరు సంస్థానం డబ్బు పోసి కొన్నారనీ, అందుచేత ఆయన సంస్థానాన్ని ఇష్టంవచ్చినట్టు పాలించుకునే అధికారం ఉందనీ అన్నారు.

దీనిమీద చిన్న తుపాను రేగింది, దేశంలో ఉన్న పత్రికలన్నీ దీనిమీద వ్యాఖ్యానించినై. కృపలానీగారి భార్య పుచ్చుకున్న లాంఛనానికీ, రాష్ట్రపతి చెప్పిన విషయాలకీ ముడిపెట్టినై.

కాని ఇది అన్యాయం. మనరాష్ట్రపతికి మనమే లంచగొండితనం అంటగట్టటం ఒక అన్యాయం. ఆయన సొంత వ్యవహారాలకూ బహిరంగ వ్యవహారాలకూ ముడిపెట్టటం మరో అన్యాయం.

జవహర్లాలువంటి ఛాందసులను మినహాయిస్తే మిగతావారందరికీ రెండేసి వ్యక్తిత్వాలుంటాయి - ఇంటో ధరించే ఉడుపులు, బయటికి వెళ్ళేటప్పుడు ధరించే ఉడుపులూ ఉన్నట్టే. కృపలానీగారు స్వేచ్ఛాప్రియులు. అనుక్షణమూ రాష్ట్రపతిగానే ఉండమంటే ఆయనకు నచ్చదు. అందుచేత బహిరంగ సభల్లోకూడా ఆయన కాంగ్రెసు ప్రణాళికకు కుడీ ఎడంగా స్టేట్మెంట్లు చేస్తూ ఉంటారు.

ఇటీవల మద్రాసులో జరిగిన హరిజన ప్రదర్శనాన్ని ప్రారంభిస్తూ రాష్ట్రపతిగారు హరిజనోద్యమమనే పేరుతో హరిజనులను వేరుచెయ్యటం ఏమీ బాగాలేదన్నారు. మారామంతీ లేకుండా హరిజనులను అన్ని సంస్థల్లోనూ కలిపేసుకోవటంతో హరిజనసమస్య పరిష్కారమైపోతుందన్నారు. ఈ సమస్య "హూష్ కాకీ!" అంటే పొయ్యేదికాదనీ, హరిజనులకు ప్రత్యేక సదుపాయాలు కలగజేసి, మిగతా సమాజంతో పెరిగివచ్చేదాకా వారి విషయం ప్రత్యేక శ్రద్ధతీసుకుంటే కాదని కాంగ్రెసు అభిప్రాయం కావచ్చు. కాని కృపలానీగారు మొదట చెప్పిన ముక్కలు కేవలమూ వ్యక్తిగతమైన అభిప్రాయాలే. ఆ విధంగానే భాషాప్రయుక్తరాష్ట్ర విభజనను గురించి కూడా రాష్ట్రపతిగారు రాష్ట్రపతి హోదాతో కాకుండా విచిత్రమైన అభిప్రాయాలు సెలవిచ్చారు. అవి కాంగ్రెసు ప్రణాళికకు చాలా ఎడంగా ఉండినై.

ఇది చాలా అవసరంగా కనిపిస్తుంది— ఈ విధంగా పెద్దవాళ్ళు తమ్ము తాము జరాసంధవధ చేసుకోవటం. ఇందులో ఏదో కలిసివచ్చే సదుపాయం ఉంటే ఉండాలి. ఈ మధ్య మద్రాసులో జరిగిన ఆంధ్రమహాసభలో మాట్లాడుతూ ప్రకాశంగారు జమీందార్లని ఉడుతూ, మధ్యలో అక్కడ అధ్యక్ష పీఠం అలంకరించిన జమీందారుగారితో ఒకటికి రెండుసార్లు "మీరేమీ అనుకోకండి" అనీ, "మిమ్మల్ని కాదు లెండి." అనీ అన్నప్పుడు ప్రకాశంగారే రెండుగా చీలుతున్నదీ, అధ్యక్షులవారిని రెండుగా చీల్చటానికి ప్రయత్నిస్తున్నదీ ప్రేక్షకులకు అర్థం కాలేదు. కాని అందులో ఏదో బిస ఉందని మాత్రం తెలిసింది.

మనస్తత్వ శాస్త్రరీత్యా చూస్తే ఈ జరాసంధ ప్రవృత్తికి కొన్ని కారణాలు గోచరిస్తాయి. ఇటువంటి ప్రవృత్తి అవలంబిస్తే రెండు పరస్పర విరుద్ధమైన హోదాలను ఒకేసారి నిర్వర్తించి రెండు పక్కలా ఖ్యాతి సంపాదించవచ్చు. అధికారరీత్యా చెయ్యలేని పాడుపనులు సొంతాన చెయ్యవచ్చు. సొంతాన చెయ్యలేని పాడుపనులు అధికారరీత్యా చెయ్యవచ్చు. ఒక్కోసారి రెండు వర్గాల తరఫున ప్రాతినిధ్యం సంపాదించుకుని రెంటిమీదా పలుకుబడి చలాయించవచ్చు. ఆ రెండు వర్గాలకూ జరిగే సంఘర్షణనుంచి తాత్కాలికంగా తప్పించుకోవచ్చు.

ఈ జరాసంధ ప్రవృత్తిలో ఒకరకం వేదాంతదృష్టికూడా లేకపోలేదు. ఈ ప్రపంచం, షేక్స్పియరు చెప్పినట్టు, ఒక నాటకరంగం. ఇందులో మనమంతా పాత్రధారులం. మనమంతా పాత్రలు నిర్వహించి దాటిపోతున్నాం. వేషం విప్పేసుకుంటే ఏమీలేదు. మనం జీవితంలో ప్రకటించే భావాలూ, ఉద్రేకాలూ యదార్థమైనవి కావు. సమస్యలన్నీ నటనే……ఇందులో రెండు పాత్రలు — డబుల్ రోల్ — నిర్వహించిన వాడు మరీ గొప్పవాడు. మరింత నాగరికత కలవాడు.

ఇప్పుడు ఫ్రాన్సు ఈ విధంగా అయింది గాని, ఒకప్పుడు ఫ్రెంచి డెప్యూటీలు వాళ్ళ పార్లమెంటులో ఒకరినొకరు ధడామడా తిట్టుకుని బయటికి వచ్చినతరవాత ఒకరి వక్తృత్వానికి ఒకరు అభినందించుకునేవారట. అక్కడకూడా రాజకీయాలు నటనే. అన్ని దేశాలలోనూ కోర్టుప్లీడర్లు ఈవిధంగా ప్రవర్తిస్తారు. కాని ప్లీడర్ల విషయంలో కొంత కాకపోతే కొంతయినా అర్థం ఉంది. ఎందుకంటే వారు సొంత తగాదాలలో పోట్లాడుకోరు.

ఎట్లా చూసినా జరాసంధ ప్రవృత్తిలో స్వార్థమే కనిపిస్తుంది. అందుచేత జనసామాన్యానికి ఇది నచ్చనట్టయితే మనం తప్పు పట్టవలిసిన పనిలేదు. మంచిమాటలు చెప్పినా చెడ్డమాటలు చెప్పినా గాంధీజీవంటి నిస్స్వార్థులూ, ఉల్లాసీదా, తిరగబోర్లా లేని మనుషులూ చెప్పేమాటలు ప్రజలు వింటారుగాని కృపలానీవంటి జరాసంధుల నవనాగరికత అర్థంచేసుకోవటానికి ప్రజలలో తగినంత చదువు సంధ్యలులేవు. రాష్ట్రపతిత్వంవంటి బాధ్యతాయుతస్థానాన్ని అలంకరించ దలిచిన వాళ్ళు తమ అతి తెలివినీ, జరాసంధత్వాన్నీ కొంతవరకు కట్టిపెట్టి, ప్రజాభిప్రాయాన్నీ కాంగ్రెసు ప్రణాళికనూ ఆదరించటం, అధమం ఆదరించినట్టు నటించటం మంచిది.





# రామలింగం రచనలు

'కూటికోసం కోటి విద్యలన్నారు పెద్దలు. ఐతే రచనావృత్తి పైవిద్యల్లో ఒకటి అవునోకాదో (తెలుగులో) ఇంకా తేల్చుకోవలసి ఉంది. ఎందుకంటే, తెలుగులో ఏ ఒక్క రచయితా ఒక్క రచనలమీదనే ఆధారపడి బ్రతకగలగటం లేదు. అంచేత ఇది కూటికి పనికివచ్చే విద్యకాదని తేలిపోయింది. పోతే ఇప్పటి రచయితలు సరదా (దీని అసలు పరిభాష దురద) కు రాస్తున్నారనికానీ, సంస్కారాభిలాష (పై పరిభాషలో ఇది పిచ్చ) తో రాస్తున్నారనికానీ అనుకోవలసి వస్తుంది. ఇవికాక ఇంకేమైనా ఉన్నాయేమో నాకుమాత్రం తోచటంలేదు. ఉంటే, ఏ సహృదయుడైనా తెలియపరిస్తే నా అభిప్రాయం మార్చుకుంటాను. నన్ను నిజం చెప్పమంటే మాత్రం సరదాకే రాస్తున్నానని చెప్పవలసి వస్తుంది! (దురదకని చెప్పుకోటానికి కొంచెం సిగ్గుగా ఉంది.)

★

నేను నా సరదాకు రచనలు పెట్టటం వరకు బాగానేఉంది. కాని వాటిని పొదిగి లోకానికి సమర్పించటంలోనే వచ్చింది చిక్కు! నా గుడ్లను పొదగటానికి సంపాదకులందరూ ఏకగ్రీవంగా తిరస్కరించారు. ఈ విధంగా తెలుగుభాషాను తల్లికి ఎంతో రచనాసంతానం కొరత పడింది. నా ఉద్దేశంలో దాదాపు వంధ్యే అయిపోయింది.

★

అయితే నేను దురాభిమానిని కాను; నిరుత్సాహినీకాను. 'మీకు ఏలాంటి రచనలు కావాలి?' అని ప్రతి సంపాదకుడినీ అడిగాను. వారికి రవీంద్రుడు వ్రాసినలాంటి గేయాలూ, శరత్ రాసినలాంటి కథలూ కావాలిట! ఒక సంపాదకుడు ఇంకో అడుగు ముందుకువేసి— "పోథాన్ జోసెఫ్‌రాసిన 'ఓవర్ ఎ కప్ ఆఫ్ టీ' చూశారా? అలాంటి వ్యాఖ్యలు రాయగలరా?" అన్నాడు. "తమరు సొంతంగానే ఎందుకు రాసుకోకూడదూ?" అని అడగాలని నా నోటిదాకా వచ్చిందికాని అది ఆపుకుని — "నేను వారి రచనలు చదవలేదండీ!" అని వచ్చేశాను.

★

ఊరక రచనలు వేసుకుంటానికే ఇన్ని వరాలు అడిగినప్పుడు ఉద్యోగం ఇవ్వమంటే ఎన్ని అడుగుతారో అని పాఠకులకు సందేహంగా ఉండవచ్చు. అదికూడా అనుభవించాను ఒకమాటు!


ఆ మహానుభావుడు నీవు కోతిలాగా చెట్టెక్కగలవా? గుర్రంలాగా పరిగెత్తగలవా? దున్నపోతులాగా లాగగలవా?" అనేవి మినహాయించి మిగతా అన్ని ప్రశ్నలూ వేశాడు. ఉద్యోగం అడగటానికిపోయి శ్రీవారిదగ్గర పెడసరంగా మాట్లాడటం బాగుండదని వచ్చేశాను. లేకపోతే....ఎందుకు పోనివ్వండి.

★

చివరికి నా అదృష్టం (అంటే పాఠకుల దురదృష్టంకాదు — ఒకరి లాభం మరొకరికి నష్టంఅనే సూత్రంప్రకారం!) పండింది. ఈ అదృష్టం ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేను. అది ఉన్నంత కాలం మాత్రం నా సరదా అంతా పాఠకులమీద తీర్చుకుంటానని గట్టిగా హామీ ఇస్తున్నాను. ఇది నిరభ్యంతరంగా సాగాలంటే మీరు (ప్రతి పాఠకుడూ) సంపాదకుడికి ఉత్తరాలు వ్రాయాలి— రామలింగంగారి రచనలు చాలా బాగా ఉన్నాయని. తప్పక ప్రతిమాసం వేస్తూ ఉండండనీ, మీకు ఇంకా నా రచనలు కావాలంటే ఇతర పత్రికల సంపాదకులకు రాయవొచ్చు—ఫలాని రామలింగంగారి రచనలు మీరు వేయరేం? చాలా బాగుంటాయి అని. మీరు ఆ చేత్తోనే రేడియోవాళ్లకికూడా రాయవచ్చు!

★

పాఠకులూ, పాఠికలూ! రేడియో అంటే ఎవరిదనుకున్నారు? నీదీ, నాదీ, అందరిదీ! అందుకనే దాన్ని పార్కుల్లో పెడతారు. దాంటో నువ్వూ మాట్లాడవచ్చు, నేనూ మాట్లాడవచ్చు, అందరూ మాట్లాడవచ్చు. ఐతే పురజనుల కోరిక కావాలి! దానికోసమే ఈ కార్డులు. రేడియో ఉద్యోగస్తులకు పక్షపాతాలు లేవు: రుచిభేదాలు ఉండవచ్చు కాని. పూర్వం విశ్వామిత్రుడికీ వసిష్ఠుడికీ పెద్ద తగువువచ్చింది, నువ్వెక్కువా? నేను ఎక్కువా? అని. ఐతే ఆనాడు ప్రజాభిప్రాయంలేదు. వాళ్లే తన్నుకుని తేల్చుకోవలసి వచ్చింది. ఈనాడు అట్లాకాదు. అలాంటియోగసిద్ధిలేదు మనకు—అలాంటి తగువులూ లేవు. ఇప్పుడు మనలో వచ్చేవన్నీ అభిప్రాయ భేదాలు! కౌశికుడికీ భారద్వాజుడికీ అభిప్రాయభేదం వచ్చిందనుకోండి. కార్డులు తేల్చివేస్తై. అంచేతనే ఈనాటి వజ్రాయుధం కార్డు. అది రేడియో ఉద్యోగస్తులద్వారా సృష్టి అయినదే. ఈ తిరుమంత్రం నా చెవిని పడింది. మీ చెవిని వేశాను. ఇక మీ ఇష్టం. నన్ను పైకి తేవటం, క్రిందికి తోయటం మీచేతిలో ఉంది.



"ఈ మధ్య నా రచనలు పోస్టులోనే పంపుతున్నాను."

"ఎందుకని?"

"మా మిత్రుడి రచన ఒకటిచూసి "మీరు ఎదటఉంటే ఏమిచేసేవాణ్ణో" అని సంపాదకుడు రాశాడు."

# నేపథ్యము

స్వర్గీయ విశ్వనాథ కవిరాజు

[తెర యెత్తడమె నింపు రంగస్థలము కనబడుతుంది. స్టేజికి కొట్టకొసాను ఒక్కతెర—రంగుపైపు వెనుకకీ, తెల్లపైపు అడి మున్పుకు. తెరకానించి రెండు దేవదారుపెట్టెలు, ఒక ట్రంకు, రెండు పసుపుచుట్టలు. నడుమ ఒక గ్యాసులైటు. దాని కానుకొని కళాయిపోయిన రెండు అద్దాలు, ఒక చింకిచాప. ఇంకెందుకు? నేపథ్యము రంగస్థలమనుకొని, రంగస్థలమును నేపథ్యముగా అలంకరించవలె. రాత్రి 9 గంటలు. కత్తినూరుతు నడుమ మంగలి నిలిచియున్నాడు.]

(ప్రవేశము : కంట్రాక్టరు)

మంగలి: కంట్రాక్టరుబాబు! సవరమౌతా రేమిటి?

కంట్రా: నాటకపోళ్ళందరు సేసేసినారు - ఇంక పూరాగ నువ్వు సేసేయ్ సవరమునాకు. పివామని మొట్టమొదట నువ్వొచ్చినావేమిటి?

మంగలి: మీరు కబురెంపితె నేను వచ్చినా - నామీదెగురుతా రేమిటి? ఎల్లిపోతా నాకేం? గాడిదగుడ్డు బుర్ర లీబుర్రలేవున్నాయా నాకు? (వెళ్ళబోతాడు)

కంట్రా: ఉండవోయి - ఏటి నీ షరానా?

మంగలి: మరి మీ సిరాకేటి? మంగలి ముందరొస్తె చుబం! చుబం!

కంట్రా: ఓహో! నువ్వో యాకటరు నాగున్నావె?

మంగలి: నాకంట అప్పిచ్చేంటి? నాను డబ్బుకొచ్చినా - ఆడు డబ్బుకొచ్చినాడు.

కంట్రా: ఏదీ, డబ్బు ముందర దొబ్బినారు - ఇప్పటికింకా ఒక్కరు రాలేను. 9 గంటలు ఆయింది. జనమొచ్చేస్తున్నారు - ఎలాసచ్చేది?

(ప్రవేశం : ప్రాంప్టరు)

ప్రాంప్: ఎందుకాగ్రహిస్తావ్ - నాకు ముందర క్రాప్‌చేసివోయ్ మంత్రీ!

కంట్రా: మీరెవరేటి! ఆకటరా?

ప్రాంప్టరు: ఏం, నా కొత్తమొఖం తెలియలా? నేను ప్రాంప్టరుని.

కంట్రా: ప్రాంప్టరుకి సవరమెందుకు? ఈ డబ్బు నానియ్యను.

ప్రాంప్టరు: ఏమండోయి! మాసంఘం 1922 సం॥ లో స్థాపితమైంది. అప్పటినుంచి ప్రాంప్టరుకి, హార్మోనిష్టుకి, తబలిష్టుకికూడ క్షవరం ఖర్చు కంట్రాక్టరు భరించుకోవడమే మామూలు.

కంట్రా: మీసంగం వోళ్ళకేనా మీవూరువోళ్ళందరికీకూడా సవరంచేయించే పూచి నాదేనా ? నాగుడ్డట్టె - నాటకం నిల్చిపోతే నిల్చిపోనీ.

ప్రాంప్టరు: అదిగో జగ్గారావుగారు వస్తున్నారు - వారితో చెప్పండి.

(ప్రవేశం: చిత్రాంగివేషగాడు - పంచ విరిచికట్టేడు - రవికతొడిగి బంతులుపెట్టేడు - కాప్రింగుబుట్ట — నోటిలో చుట్ట)

చిత్రాంగి: ఏమిటీ అల్లరి?

ప్రాంప్టరు: ప్రాంప్టర్కి - హార్మోనిష్టుకి, - తబలిష్టుకి క్షవరం చేయించేపూచి ఈయనకు లేదటండీ, మన కంట్రాక్టు అలాగున్నా దేమండీ?

చిత్రాంగి: అటుగాదు కంట్రాక్టరు బావగారూ! వచ్చినవారం మేము తొమ్మండుగురుము. మా 9 గురుకి భోజనాదులు మీరెట్లిచ్చుచున్నారో, అట్లె మా అందరికి క్షవరము చేయించి గౌరవించుటయు మీ విధియై యున్నది. ఇంతలో ధనవంతులు మీకు తరగునదేమి?

కంట్రా: తరక్కపోతె పెరుగుతానా? మీ చిత్రాంగి యేసానికి 90 కి టోలీ తక్కువైతె మీరు పల్లకుంటారా? దీనికేటిలెండి - సెప్పినాను. మీరు సెప్పినారు కనక మీకేకాదు మీ బండీవోళ్ళకుకూడ సవరం చేయించేస్తాను. మంత్రీ! సెప్తున్నా - కూకున్నవోళ్ళందరికీ సుబ్బరంగా గొరిగేయి. ఆల్ల చంతకాలుమాత్రము చేయించుకొ. (నిష్క్రమించును)

(ఇదిమొదలు తుదివరకూ విరామములేకుండా మంగలి క్షవరాలు చేస్తూఉంటాడు.)

(చిత్రాంగి రంగుసద్దుకుంటూవుంటె చిదంబరశాస్త్రి వెనుకపాటుగా కళ్ళుమూస్తాడు.)

చిత్రాంగి: వెధవ! ఎవడది? రంగంతా చెరిపేశావు - రాస్కెలు ఇంకా వదలవేం?

చిదంబరశాస్త్రి: (వదలి వెర్రినవ్వు నవ్వుతూ యెదురుగా నిలబడి) జగ్గారావుగారు మరచిపోయినారు!

చిత్రాంగి: ఓహోహో! చిదంబర శాస్త్రిగారా! నమస్కారం. దయచెయ్యండి.

చిదం: మీరొస్తె దయచెయ్యనా? క్రిందటి చింతామణినిగురించి పేపర్లో వేశాను. చూశారా?

చిత్రాంగి: ఆంధ్రపత్రికలో వేయించారు! మరి భారతిలో వేయించారుకారేం?

చిదం: మీ ఫోటో నాకు అందలేదు. ఇదుగో ఈసారి - భారతి ఎడిటోరియలులో వేయిస్తాను సారంగధరనుగూర్చి. ఎలాగురాస్తానో చూడండి. "జగ్గారావుగారికి బాగాఉంది ఆంధ్రనాటక రంగస్థలముమీద—అతడే సారంగధరను ప్రసవించేడు." ఇలాగు వాఖ్యరత్నాలు పేర్చిపేర్చి కూర్చి మూర్చేస్తాను జనాభిప్రాయాన్ని.

చిత్రాంగి: మావంటివారిశక్తి మీవంటి పండితులకే కదండి మరి తెలుస్తా!

(తెరలో - అనగా ఆడియన్సులో ఈలలు, కేకలు, గగ్గోలు)

(ప్రవేశం : కంట్రాక్టరు)

కంట్రా: జనమొచ్చేసినారు - ఈ ఆకటరులు రాలేదేయింక యేటిసేతును!

(ప్రవేశం : వంతుదారు)

వంతుదారు: సూరెంగారూ! సారంగధరుడు కొంపముంచేసినాడు—9 గం॥ బండినో రాలే!

కంట్రా: రాలె? బండి అంతా సూసినా? ఇంటరు బండిలోదూరి సూపినా! శాగేని పండుకున్నా దేటో!

వంతు: సుబుద్ధిగా దొచ్చినాడుగా! అతగోడు సెప్పినాడు బెజవాడలో అయనగోరు బండి యెక్కలేదంట.

కంట్రా: ఇంకేటిదారి? నాటకమెల్లా జరుగుతాదీ? ఆడిపేరు నోటీసుపేసినామె— జనాలు ఎల్లకుంటారా? చరె - నువ్వెల్లి నేల 0-8-0, బెంచి 1-0-0, కుర్చీ 3-0-0 ఎచ్చించేయి.

వంతు: గొళ్ళోళ్ల అబ్బాయొహడున్నా డమ్మోరి చంబరంలో సారంగదరు దేపినాడు, వాణ్ణితెస్తా. (నిష్క్రమించును)

కంట్రా: జగ్గారావుగోరు! ఏటిదారి! సారంగదరుడు నా కొడుకు రాలేదు. ఎలాబోవటం?

చిదం: ఓహోహో సూరెంగారు ఈవూరికి మీరో అలంకారం కదండీ! మీరంటు ఉండబట్టి నాటకాలు కంట్రాక్టుచెయ్యడమని (చిత్రాంగిని చూపి) ఈలాటి మహానుభావుల్ని రప్పించడమని మావంటివార్ని ఆనందింపచెయ్యడమనీ.

కంట్రా: ఉండవయ్యా! ఆకటర్లురాక నేను చస్తువుంటె మధ్య నీ గొడవేటి? జగ్గారావుగారూ! రూ. 30 ఎడ్వాన్సు దొబ్బి ఈడు పంగనామమెట్టేసినాడుగందా, యేందారి?

చిత్రాంగి: పోనీ మా ప్రాంప్టరుచేత వేయించండి సారంగధర.

చిదం: అహహా! ప్రాంప్టరుగారె! వెంకటరత్నంగారె! చింతామణిలో దామోదరుడు వేషంకట్టారు - సారంగధరుడు అద్భుతంగా ఉంటుంది.

కంట్రా: ఉండవయ్యా, మధ్య నువ్వేమిటి? అతగాడు సారంగధరుడువేస్తే తన్నూ, నన్నూకూడ మొగంమీద వూస్తారేమొ జనం! పాటలేదు, మాటలేదు.

చిత్రాంగి: అన్నిటికి నేనున్నానుగా! ఇంతజనం వచ్చేరంటె మరి నాకోసమొచ్చారా! ఈ సారంగధరడు, ఈ నరేంద్రుడుకోసం వచ్చారా?

(ప్రవేశం : నరేంద్రుడు. పెద్దబొజ్జ. ముప్పైమణుగుల జంతువు. లంగోటి, బనియను.)

నరేంద్రుడు: మాకంటె నీ హెచ్చేమిటి? మేములేందే నువ్వుచేసేదేమిటి చెపుదూ— తెగచెప్పుకుంటావు? మొన్న ఏలూరులోను, రాజమండ్రీలోను అయిన పరాభవం చాలదూ?

చిత్రాంగి: నీ వూసుకాదు - ఏదో మేము మేమూ మాట్లాడుకొంటున్నాము.

నరేంద్రుడు: కాదు, వీళ్ళందరూ ఎందుకు నేనె ఊడబొడిచేస్తానని ఏవా సొరకాయలు కోస్తుంటె చెప్తున్నా. అయ్యా! కంట్రాక్టరుగారూ! నాటకం ధ్వంసం అయితె నన్నేమి అనకండి. త్రోట్‌పిల్సు తెప్పించమంటె మీరు తెప్పించలేదు. (వేషధారణకు కూర్చుండును)

కంట్రా: ఒత్తాయిబాబు పంపినా - జగ్గారావుగారూ! ఏదొ మీరె సూడండిబాబు! ఎలాగైనా నన్నొడ్డెక్కించేశారంటే ఇదిగో రూ. 45 లిది, ఈ రిష్టువాచి మీకిచ్చేత్తా.

చిదం: సీకాభయ మక్కరలేదు. జగ్గారావుగారు విగ్గుపెట్టేసుకొని, రవికతొడిగేసుకొని— అవిపెట్టేసుకుంటె, ఆడదె అచ్చు ఆడదె.

కంట్రా: ఈ యెర్రి పంతుల్ని ఇక్కడికెవరు రానిచ్చారయ్యా.

చిద: జగ్గారావుగారు నాకు దగ్గరస్నేహితులండి.

కం(ట్రా: పంపించేవయ్యా ఇతగాణ్ణి మొదట. ఎల్లు పంతులూ, ఎల్లు.

చిత్రాంగి: ఒకక్షణం వెళ్ళి మీరాకుర్చీమీద కూర్చొండి.

చిదం: మంచిది. మాట - రెండుటిక్కెట్లుకావాలి తెప్పించండి. (నిష్క్రమించును)

కం(ట్రా: కనిగటం - కంపనాగ తగులుకున్నాడు. అయితె మీ ప్రాంప్టరువేస్తాడా హీరో?

చిత్రాంగి: అడుగుతా. వెంకటరత్నం: నిన్ను సారంగధర వెయ్యమంటున్నాడు.

వెంకట: ఏమిస్తారు ?

కం(ట్రా: తమలపాకులఖర్చు. ఒకదసకం దాఖలుచేసుకుంటా.

వెంకట: ఆ తాగుబోతు లంజకొడుక్కి దెబ్బయ్యా! నాకుపదా?—నాకు 80 ఇస్తేగాని రాను.

కం(ట్రా: అతగోడు గ్రామఫోనుపాటలు పాడుతాడు - మీకేటొచ్చును ?

వెంకట: వాడు గ్రామఫోనులో పాడితె నేను సినిమాకి వెళ్తాను.

చిత్రాంగి: వెంకటరత్నం. ఏదో సెటిల్ చేసే.

వెంకట: Sixty కంటె తక్కువైతే నేనొప్పనండి.

కం(ట్రా: ఆపెదాన్న 30 కొట్టినాను. 40 పుచ్చుకోవయ్యా - నీ గడ్డముపట్టుకుంటా.

చిత్రాంగి: గడ్డమిప్పుడే తీయించేశాడు. సరె Fifty కి Settle చేసేను. ఆపార్టుచదివీ.

వెంకట: మనీ ఇప్పుడిస్తేగాని పార్టు కంటతాపెట్టను. అసలు చూడనండీ.

కం(ట్రా: ఏటి, పారిపోతానేటి? అరగంటలో ఇత్తానయ్యా. ఇత్తెగాని తెర ఎత్తవద్దు. చరాకావలిస్తె ఈ సిల్కుకండువా ఉంచుకో (ఇచ్చి) మరి కోటావేసుకో మొగానికి.

(ప్రవేశం : చిదంబరశాస్త్రి)

చిదం: అతగాడివంతు నేను ప్రాంప్టింగుచెయ్యనా ?

కం(ట్రా: అన్నా. మళ్ళీవచ్చినా? మరి నన్ను బతకనియ్యవేమిటి ?

చిత్రాంగి: అతనికో రెండు పచ్చటిక్కెట్లు ఇచ్చెయ్యండి. వెళ్ళిపోతాడు.

కం(ట్రా: (ఇచ్చి) ఎల్లు. మళ్ళీ కెజీమీదికి వచ్చేవంటె సూడు. (పంపును)

వెంకట: సారంగధరాకి నాకు డ్రస్సు కనబడదే.

చిత్రాంగి: ఆ షర్టెచాలు. నా బనారసుకండువా ఇస్తా. గుండారోసుకుందువుగాని అదిగో కం(ట్రాక్టరుగారి సేలం సిల్కుకండువా. చమ్కాచుట్టుకో. అన్నట్లు ఆయన రిస్టువాచీ చేతికిపెట్టుకో. ఏమి చాలదూ ?

వెంకట: సరె, వేషంపూటయింది. కాని ఆ కృష్ణమాచార్యులగారి పద్యాలు నాకురావు. విష్ణుభట్లవారి పద్యాలు రెండు చదువుతాను.

చిత్రాంగి: ఏదైతేనేమిటి? మన నరేంద్రుడు అంతా హనుగంటినె ఫాలో అవుతాడు. కాని ఆ డైలాగుపాట జాగర్తా. నాటకానికంతా అది ప్రాణము.

కం(ట్రా: అది బాగుందాల.... సెప్పండి ఇతగాడికి.... అది వన్సుమోరుపాట.

చిత్రాంగి: నీకు వచ్చునుగదూ.... నేనంటాను.... నువ్వు సరిగా అంటూ ఏక్షన్ చేయి.

(పాట) అమ్మాయని నను పిలువకుము నీయతివ - ననుకొనుమా - అతివయనకొనుమా....

సారంగ: ........హా ఆగు మాయమ్మా - అమ్మరో నన్నిటుల పిలుచుట అక్రమమమ్మా—అక్రమముమ్మా........

చిత్రాంగి: ........ఔనులెలెమ్మా. అల్ల చంద్రుడు తాను గురుసతి ననుభవింపడకో అనుభవింపడకో........

సారం: ........అపకీర్తి నెందడకో - అతివ యాతని కళలుతగ్గుట మతిని దలపవాకో.
చిత్రాంగి: ఫర్వాలేదు. హా ఆగు మా యమ్మా అన్నచోట పోశ్చరెలాగ వేస్తావు?
సారంగ: (మేనక బిడ్డను చూపించేటప్పుడు విశ్వామిత్రుని పోశ్చరు వేస్తాడు.)
చిత్రాంగి: బాగుంది. "అమ్మరో నన్నిటుల పిలుచుట" అన్నచోట
సారంగ: (గరుడవాహనం పోశ్చరు వేస్తాడు).
చిత్రాంగి: భేష్. అతివ యాతని కళలుతగ్గుట అన్నదగ్గిర?
సారంగ: (పైమాటలంటు ఆవును పాలుపితుకుతున్నట్లు అభినయిస్తాడు.)
కంట్రా: బేస్ బేస్! యెంకట్రత్నంగారు దంచేత్తారీవేళ.
చిదం: (ప్రవేశిస్తూ) ఆయనేమిటి మహాయాక్టరు మహానుభావుడు.
కంట్రా: అన్నాదేముడా! ఓ రూపాయిస్తాను ఎల్లిపోతా! ఎల్లు. (వెంటాడును)

(ప్రవేశం : హాలుమనిషి)

హాలు: అవొచ్చిన డబ్బంతా లెక్కపెట్టి కాబూలుసాయిబె సంచిలో వేసుకుంటున్నాడు. ఇంకా హోటలయ్యరు. ప్రెస్సోళ్ళు. టంటమాళ్ళు. అళ్ళు ఈళ్ళు ఏటి. అడ్డమైనోళ్ళు. చచ్చిపోయిన శవంచుట్టూ మూగినట్టు టిక్కెట్టు పెట్టెసుట్టూ మూగినారు. అళ్ళు నామాటె ఇనిపించుకోరు బాబయ్యగారు కోప్పడుతార్లు. హాలుడబ్బు 70 ఇవ్వండి. లేకుంటె లైట్లు ఆరిపేసి చేతికలుపువేసుకొని వెళ్ళిపోతా. (లైట్లు ఆర్పివేయబోతాడు)

కంట్రా: ఆ ఉండవోయి. ఉండవోయి. లైటార్పేత్తున్నావేమిటి. నామొఖంచూడవోయి. ఈ రూపాయి టిక్కెటింద. చణంనిలిస్తె నీడబ్బు లెక్కపెట్టేసి యీనాముతోకూడ యిచ్చైత్తా ఓయి బాబు! ఇంకా ఆ కాబూలోడి 3 వందలె చెల్లలేదా - ఇంతజనం వచ్చినారు. పద.

(మరల తెరలో కలకలం - అనగా ఆడియన్సు కేకలు, ఈలలు చప్పట్లు)

కంట్రా: 9-40. ఫట్టుబెల్లు కొట్టండి.

చిత్రాంగి: మరి మాసొమ్ము మిగతాది?

కంట్రా: తెరఎత్తకముందిచ్చేత్తా. కొట్టండి (ఒప్పించి కొట్టించి) రావోయి నేనొస్తే ఒకనిమిట్ అంతా చెటక్, చట్ పట్, టకా టక్, ఇదేమిటి? ఇతగాడూ సవరంచేయించుకుంటున్నాడు!

చిదం: (ప్రవేసిస్తూ) మంగలి వత్తినె ఉండిపోనీకదా అని నేను కూర్చున్నాను.
కంట్రా: శకటలాగు నువ్వు తలగుఱుకున్నావేటి మాకు? నీ బుర్రకి డబ్బు నేనివ్వను.
మంగలి: అయితె నేను గియ్యనె గియ్యను బిరుసుముండా బుర్ర.

చిదం: మీరిద్దరు కొట్లాడి అయితె నాబుర్ర సగంగొరిగి ఈలాగు వొదిలిస్తారా ఏటి?

చిత్రాంగి: నాకు క్షవరమక్కరలేదుకదా నావంతు ఇతనికికాని.

కంట్రా: కాని కాని కనపడ్డవోళ్ళందరిదెక్కి. నువ్వో 10 రూపాయలు పుచ్చుకుంటావు. అంతేనా? ఊసుపోని మంగలి పిల్లిబుర్ర గొరికేడంట. (నిష్క్రమించును)

చిదం: అయితే ఈ బాపతులన్ని వివరంగ కంట్రాక్టులో వ్రాయించుకోవలసింది.

చిత్రాంగి: ఎంత రాయించుకున్నా అంతేనండి. కంట్రాక్టు ఇచ్చేవరకు కాళ్ళవేళ్ళతిరిగి నానా అవస్థపెడతారండి. పోని పిల్లవాళ్ల వాళ్ళేదో మనవల్ల నాలుగురాళ్ళు సంపాదించుకొని బతుకుతారని ఒప్పుకుంటె యీ దూరదేశము తీసుకొవచ్చి అన్నివిధాల మానభంగం చేస్తారండి. కాండి పూరాగా క్షవరం—

(తెరలో కలకలం)

కొట్టండి రెండోబెల్లు కొట్టండి అందరు ఇంకా రంగువేసుకొండి.

(ప్రవేశము : నరేంద్రుడు)

నరేం: ఏదీ వెంకటరత్నం! నాపాటకేలాగు అభినయిస్తావు!

వెంకట: పాడు - చూసుకుందాం.

నరేం: మాతృద్రోహము చేసితివేరా - మనుజరూప పశువా
ఓరీ - మనుజరూప పశువా?
మూత్రవిసర్జన తులసివనములో - పూనిచేతువటరా
ఓరీ - పూనిచేతువటరా?

వెంకట: (మేష్టరు కొట్టబోయేటప్పుడు పాఠమురాని మొద్దబ్బాయి గెంతినట్లు గెంతుతాడు)

నరేం: పర్వాలేదు నువ్వేమిటి ఆరితేరిపోయిన మనిషివి - దొంగల తండ్రివి.

(ప్రవేశం : సానిపిల్లకాయ)

సాని: (నరేంద్రుడితో) మా అక్క.....బైటవుందండి.

నరేంద్రుడు: అయితేనేం? తీసుకురాలేకపోయినావు - స్టేజిమీద కూర్చుండును.

సాని: బైటుండమంటె అదికాదండి. వచ్చిందీ - రోడ్డుపక్క నిల్చుందండి.

నరేంద్రుడు: రమ్మను - వెనకద్వారం వెంబడి రమ్మను - నేను తలుపుతీస్తా.

సాని: మా బావకూడ వచ్చేడండి.

నరేంద్రుడు: ఎవడు మీ బావ?

సాని: కిరిసినాయిలుడిపో నాయుడుగారికొడుకండి - టిక్కట్లు కావాలండి.

నరేంద్రుడు: వాడినెందుకు తీసుకొచ్చిందిరా నా నెత్తిమీదికి - మద్య సుమారుపలుకరించ డానికైన వీలులేకుండా? డ్రామ కంట్రాక్టు ఇచ్చేశాం. మాకు టిక్కెట్లెలాగ వస్తాయి?— ఆ వెనకతలుపు తీసెస్తా ఇద్దరినీ రమ్మను. (వానితోవెళ్ళును)

(ప్రవేశం : బాగక్షవరమై చిదంబరంశాస్త్రి)

చిదంబర: మారిపోయినారు జగ్గారావుగారు. మారిపోయినారప్పుడె. అప్పుడె చిత్రాంగి అయిపోయినారు. ఈ వేషం చూస్తే నాకు ఒంట్లో అదేమిటోలాగున్నాది.

చిత్రాంగి: ఈ రోజుల్లో నాకుతప్ప యెవ్వరికి వేషం వేసుకోడం రాదండీ!

చిదంబర: అస లాడవాళ్ళకి రాదు. మిమ్మలని చూసికదూ ఇప్పుడిప్పు డాడవాళ్ళు కూడ రవికలో గుడ్డలుపెట్టుకుంటున్నారు.

చిత్రాంగి: ఊరుకోండి సిగ్గుసిగ్గు (శృంగారలజ్జ అభినయిస్తాడు)

(ప్రవేశం : నరేంద్రుడు డిపో నాయుడు కొడుకుతో)

నరేంద్రుడు: అదుగోనండి జగ్గారావుగారు.

నాయిడు: ఏమండి జగ్గారావుగారూ! జ్ఞాపకమున్నామా?

చిత్రాంగి: చిత్తం చిత్తం జ్ఞాపకంలేదండి. మనము ఏలూరు పాండురంగ సినిమాహాలులో

నాయిడు: లేదండి మా అత్తవారు ఏలూరె. మీరు క్రిందటిసారి సొంతకంపెనీతో వచ్చినపుడు ఊరంత అప్పులైపోయి రైలుఛార్జీలకు లేదని రూ 50 తీసికెళ్లేరు. ఎన్ని ఉత్తరాలు రాసినా టబాబులేదు. మరిచేపోయినారు.

చిత్రాంగి: అవునండి. మరిచేపోయినాను. చూశారు అనేకఊళ్ళలో అనేకమందిలో మొరాఖత్తు. అదీకాక ఎప్పుడూ Brain లో ఆలోచనా-అయినా నేనెప్పుడు అప్పుచెయ్యనండి.

నాయిడు: అయితె ఈ దస్కత్తు ఎవరిదండి ? (కాగితం చూపిస్తాడు)

చిత్రాంగి: నాదె. కానివ్వండి - ఆ సొమ్ము మా నేజరు మా బాలకృష్ణ నాటకసంఘం కోసం తెచ్చేనండి. ఇప్పుడా కంపెని పోయింది. ఆ మేనేజరూ వెళ్ళిపోయినాడు.

నాయిడు: కంపెనీపేరు పోతె అప్పులన్ని తుడుచుకపోతాయా యేమండీ ?

చిత్రాంగి: అది మేం తిన్నదికాదు చూడండి. అయినా మా మేనేజరు వస్తేకావి—

నాయిడు: డబ్బురాదా యేమండీ - ఎలాగు రాదో నేను చూస్తానులె. ఇలాగెందరి డబ్బు ఎగకొడుతున్నావో ? నువ్వు. నీ తలకో మేనేజరూ ! మేము తగిన బందోబస్తుతోనె యున్నాము. పెద్దమనిషి తరహాగా ఇస్తే ఇయ్యి; లేకుంటె వెంకెటఊడిపోతుంది. ఏమి తమాష అనుకున్నావు దగుల్బాజీ !

చిత్రాంగి: కోపమెందుకండి, అక్కడ దయచేసి కూర్చోండి. మాటాడుతాం. పీమెల్ కారక్టరుకదండి. అసలు సంపూర్ణముగా రూపం మార్చుకోవాలి. వేషం పూర్తికానివ్వండి. మీతోకనుక మాటాడినాను కాని నేను నాటకంముందు ఎవరితో మాటాడనండి. క్షణంతాళండి నీను అయిపోవనివ్వండి. తర్వాత మీ సొమ్ము కావలెనటండీ నాకు మీదయకావాలిగాని. దయచేసి కూచోండి.

మంగలి: నాయిడుగారూ. సవరమౌతారేటి ?

నాయిడు: ఇదిగో ఈ మహానుభావు డొకడు వూరూర అందరికి క్షవరంచేసుకొని వస్తున్నాడుగా.

(నిష్క్రమించును)

చిదంబర: ఈ అప్పులిచ్చే వాళ్ళకి యెవరినదగాలో యెవరిని అడగకూడదో తెలియనే తెలియదండి.

చిత్రాంగి: అయ్యో అనేకవూళ్ళు - అనేకసందర్భాలు - అనేక మొఘమాటాలు, ఎప్పదెప్పుడు ఎందుకెందుకు ఎక్కడెక్కడ ఎంతెంత అప్పుతెచ్చామో మనకేమి జ్ఞాపకము ?

(తెరలో కలకలలు)

వెంకటరత్నం: ఆడీయన్సు వస్తున్నారు. ఆ కంట్రాక్టర్ని చూడు. డబ్బిచ్చివాస్తె 3-వ బెల్ కొట్టివేద్దాం. అన్నట్లు ఈవేళ నువ్వు వేషంమీదవున్నావుకదూ. నువ్వు వెళ్ళవోయి మంత్రీ! వెళ్ళి కంట్రాక్టరును తీసికురా.

(బుజ్జగించి పంపుతాడు)

(ప్రవేశం : సుబుద్ధి చంకను సారాబుడ్డితో)

చిదం: ఓహో, సుబుద్ధిగారా ! నేనెవరో చెప్పుకోవాలి.

(వెనుకపాటున కళ్ళుమూస్తాడు, బుడ్డి నేలమీదపడి బద్దలవుతుంది, సారాయము అందరి గుడ్డలమీద తుళ్లుతుంది.)

అందరూ: అబ్బా, కంపు కంపూ సారా, నారాయణ, నారాయణ.

చిత్రాంగి: ఏమిటీఘోరం ! ఎమిటీ అసందర్భం. నాకు జ్ఞానమువచ్చి నేను స్టేజిఎక్కిన

తర్వాత నేనునిల్చిన రంగస్థలముమీద ఇటువంటి ఘోరం యెన్నడూ జరుగలేదు. స్టేజి అనగా దేవాలయం. నేను దాన్ని అతిపవిత్రంగా వుంచుతున్నాను. అటువంటి స్టేజమీద సారాబుడ్లు బద్దలుకొట్టడం. ఈ వాసనచూస్తె ఎవరేనా ఏమనుకుంటారు? నాతలమీద పడుతుంది.

సుబుద్ధి: ఆ అడగనక్కరలేదు నీ పవిత్రతా నీ స్టేజి పవిత్రత. దుమ్ములు స్టేజినిండాపోస్తు మాంసభోజనాలు స్టేజిమీదనె - చెట్కారి లంజల్ని తెప్పించి నాటకమైనతరవాత కాపురాలు స్టేజిమీదనె, నానాఖంగాడీలు స్టేజిమీదనే. ఏం? ఎంత తాగినవెధవైనా ఎత్తివేసుకోవలెనని బంగారంవంటి సారాబుడ్డి ఎత్తివేస్తాడా?

చిదం: ఎవరుమాత్రం సారాబుడ్డి బద్దలుకొట్టాలని కళ్ళుమూస్తారూ?

సుబుద్ధి: కర్మవశాత్తు పడిపోయింది, దానికింత లెక్చెరు ఎందుకో. అందరూ ఇప్పుడు పైకి పెద్దకబుర్లు చెప్పేవాళ్లె. తీయించండి - పెట్టె తీయించండి తెలుస్తుంది. బస్తీమీద సవాల్. ఈ కంపెనీలో తాగని లంజకొడుకెవ్వడో చెప్పండి.

చిదం: తాగితె తప్పా ఏమిటి? తాగకపోతె పులివేషమైనా వెయ్యడం కష్టం.

చిత్రాంగి: వినండి. వినండి! మొన్న చింతామణివేషంలో చప్పున గొంతుపట్టుకుంటె వినపడుతుందికదా అని నేను - ఈమాత్రమె - ఇంతకుమించితె మీ రేవొట్టువేస్తే అవొట్టు. ఇంతుచుక్క త్రాగుతె - నన్ను తాగుబోతంటాడా - నేను తాగుబోతునా?

సుబుద్ధి: అందరూ అందుకె తాగబోతన్నారనుకొని గమ్మనివుండిండి. చోటివ్వండి.

(వేషధారణకు కూర్చుంటాడు)

(ప్రవేశం : మంగలి తొందరతో)

మంగలి: బాబు, బాబు, జగ్గారావు బాబు! కంట్రాక్టరు కొంపముంచేసినాడు. ఆ అమ్మకంచేసిన డబ్బు నోట్లు జేబులో యెట్టుకొని పారిపోనాడంట. ప్రెస్సువోళ్ల హాలువోళ్లు అందరూ ఎతకతున్నారు.

చిత్రాంగి: అయితె యింకా నాకివ్వవలసిన ముప్పై?

సరేం: నాకివ్వవలసిన నలభై?

సారంగ: నాకివ్వవలసిన ఏభై?

మంగలి: మరి నా మూడు రూపాయలండి?

చిత్రాంగి: సరె. డబ్బివ్వకపోతె ఎవరు నాటకమాడుతారు? అలాగవుండండి థర్డు బెల్లివ్వద్దు. తెర ఎత్తవద్దు.

మంగలి: మరి నాసొమ్మండి?

చిత్రాంగి: ఆ కంట్రాక్టరు దగ్గర పుచ్చుకో.

మంగలి: నేను మీకు పవరంసేసినానా, కంట్రాక్టరుకా అండీ?

చిదంబర: ఆ కంట్రాక్టరు చెప్తె నువ్వుగీశావు.

మంగలి: ఊరుకోవయ్యా యాగానీ బుఱ్ఱగాడివి నువ్వూ మాటాడుతావు. నా సొమ్ముతింటె నా కష్టముంచుకొంటె మరి అనేత్తానండీ.

చిత్రాంగి: నీ సొమ్ము తిన్నవాణ్ణి అను. బాగా అను.

(తెరలో కలకలం)

చిత్రాంగి: అర్చుకోసీ - నా డబ్బిస్తేనెకాని నేను కదలను. ఇక్కడ నిద్రపోతా (పండుకొంటాడు)

నరేంద్రుడు: నా డబ్బు ఇస్తేనేగాని నేను స్టేజి ఎక్కను. (కూర్చుంటాడు)

సారంగ: నా డబ్బిస్తేనేగాని నేను పోర్షనే చూసను. (పుస్తకం మూసేస్తాడు)

సుబుద్ధి: ఉత్తనె ముఖమెందుకు కనాపచేసుకోవడం - (దిగ్గునలేచి) సిష్కారడం బుడ్డిపోయింది.

చిదంబర: నిజంగా తమవంటి యాక్టర్లు లేచినందువల్లే మనదేశంలో నాట్యకళ ఈలాగు క్షణక్షణముకి వర్ధిల్లుతూ ఉంది.

చిత్రాంగి: నేను కళకోసం ప్రాణంపెట్టేవాణ్ణికాని ధనమంటె నాకు తృణమండి.

చిదంబర: తమసంగతి వేరె చెప్పవాల?

మంగలి: బాబు మరి నామాట ఏటండి?

చిత్రాంగి: మేమెందుకిస్తామయ్యా మధ్య - మాడబ్బు రాక మే మేడుస్తూ ఉంటె. రేపు ప్రొద్దున కాఫీ ఎలగో తెలియదు.

(ప్రవేశం : పోలీసు ఇన్‌స్పెక్టరు)

ఇన్‌స్పెక్టరు: (ముక్కు ముడుచుకొని) ఏమిటో కంపు? త్రాగుబోతు కైరాత ముండా కొడుకులు. ఏం 10-50 అయింది ఇంకా ప్రారంభించరేం?

చిత్రాంగి: కంట్రాక్టరు మాకు డబ్బివ్వలేదండి. ఎక్కడికో డబ్బుపట్టుకొని పరారి అయిపోయినాడట. మా డబ్బు ఇస్తేనేగాని మేము తెరయెత్తమండి.

నరేం: నేను వేషమిప్పేస్తున్నానండి.

సారంగ: నేను వెళ్ళిపోతున్నానండి.

ఇన్‌స్పెక్టరు: Scowndrals! ఏమిటి తెగనీల్గుతున్నారు? మీ అబ్బసొమ్మనుకున్నారా. ఇప్పుడు ఇచ్చినదంతా? నాటకమాడటానికి Rascal మీరందరు ఎందుకువచ్చేరీవూరు? ఎందుకు రప్పించేరు ఈ ప్రజనంతా ఇక్కడికి? మీ వీపునర్మాలొలిచేస్తా. మిమ్మల్ని మాటేస్తానిక్కడ. ఏయి 1341 ఆ తలుపువేసెయ్. ఊ ప్రారంభించండి. ఈ కాష్టంలోది ఈ కొరివి. ఆ కాష్టంలోది ఆ కొరివి అని ఈ ఊరునుంచి వొక త్రాష్టం. ఆ వూరునుంచి ఒక త్రాష్టం! వెధవవేషం ఇంకా వెయ్యవేమిరా? (చిదంబరశాస్త్రిని కొట్టును)

చిదంబర: (తడువుకుంటూ) నేను మెంబర్నికానండీ. ఉత్తనె క్షవరం చేయించుకొన్నాను.

ఇన్‌స్పెక్టరు: ఏంపాడరేం? చెప్తే మీకుకాదు. ఉండండి పీటిరెగగొడ్తా. (బెత్తముతో చేతికి దొరికిన వారందరిని కొడ్తాడు. ఆ దెబ్బతో జడిసి అందరూ ఒక్కపరుగున తెరదగ్గరకు పరిగెత్తి అడియన్సువైపు వెనుకతిరిగి కొంప కగ్గిముట్టుకున్నట్లు "ఓ" అని ఒకరికంటె ఒకరు బిగ్గరగా సప్తస్వరాలతో అన్నెమ్మరాగాలతొ నేటినాంది.)



# అనువాద సాహిత్యం

తల్లికి ఏకైకపుత్రుడైన శాషా స్మిర్నోవ్ పొట్లాము ఒకటి చంకన పెట్టుకొని జంకుతూ జంకుతూ డాక్టర్ కోషిల్కోవ్ ఆఫీసులోకి వెళ్లాడు.

"ఏమోయ్, ఎలావున్నావు? ఒంట్లో ఉసులు చిక్కిందా?" డాక్టర్ ఆప్యాయనంగా పలకరించాడు.

దడదడ కొట్టుకుంటున్న హృదయాన్ని ఒక చేతితో అదుముకొంటూ శాషా నత్తులు కొట్టాడు:—

"మా అమ్మ మీకు ధన్యవాదాలు చెప్పమంది. లేకలేక మా అమ్మకు నేనొక్కణ్ణే కలిగాను. మీరు నన్ను బ్రతికించి బయట వేశారు. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తోచటంలేదు."

"పిచ్చివాడా, అదంతా దేనికి? నేను మాత్రం మీకు చేసిందేముంది? మామూలుగా డాక్టరు చేయగలిగింది చేశాను. దీనికింత త్రొక్కిసలాడ నవసరంలేదు." అన్నాడు డాక్టరు.

"నేను మా అమ్మకు ఒక్కణ్ణి....మేము లేనివాళ్ళము. మీ శ్రమకుతగ్గ ప్రతిఫలం ఇచ్చుకోలేకుండా ఉన్నాము........కొండంత దేవుడికి కొండంతపత్రి తేలేముకదా? అయినా మా ఉడతాభక్తిని ఏదో యిస్తున్నాము మీరు కాదనకుండా తీసుకోవాలి. ఇది ఒక అపురూపపు విగ్రహం. కంచుతో పోశారు. చాల ప్రాచీనమైనదండి."

శాషా చంకలోనుంచి పొట్లాం బయటికి లాగాడు.

"ఎందుకోయ్ అంత ఆతురత? వాకేమీ ఇవ్వావసరంలేదు."

"అలా కాదు. మీరు తప్పకుండా పుచ్చుకోవాలి."

శాషా ప్రాధేయపడుతూ పొట్లం విప్ప సాగాడు. అతని నత్తిమాత్రం ఆగలేదు.

"మీరు పుచ్చుకోకపోతే మా అమ్మ ఎంతో నొచ్చుకుంటుంది. ఈ విగ్రహం ఉందే యిది, చాల అపూర్వం. దీన్ని మా నాన్నగారు సంపాయించారు. వారి స్మృతి చిహ్నంగా దీన్ని అట్టిపెట్టుకొన్నాము. మా నాన్నగారు పురాతన శిల్పవస్తువులను కొని సౌందర్యపిపాసువులకు అమ్ముతుండేవారు. వారు పోయింతరువాత కూడ మా అమ్మకు అదే వ్యాపారం."

శాషా కాగితంవిప్పి విగ్రహం డాక్టర్ బల్లమీద పెట్టాడు.

అది కంచుతో పోతపోసిన ప్రాచీన విగ్రహం. ఆ విగ్రహంలో ఇద్దరు గంధర్వకన్యలు పుట్టినవాళ్ళు పుట్టినట్టుగా ఉన్నారు. అప్పుడేలాంటి దుస్తులున్నాయో యౌవనంలో కూడా సరిగా ఆ దుస్తులే ఉన్నాయి. ఆ భంగిమలను నాకు వర్ణించే సాహసమూలేదు— ఆ దృష్టీలేదు. రెండూ చిలిపిగా నవ్వు

## శిల్ప సుందరి

### చెఖోవ్



"చెప్పేదా ? ఎవరూ వినటంలేదుకదా ?"

తున్నాయి. మధ్యలో ఆ హారతి పళ్లెమే లేకపోతే వాళ్ళిద్దరూ ఎలాంటి బంధనం.... అది ఆలోచించటానికే నాకు సిగ్గవుతూ వుంది.

డాక్టర్ ఆ కానుకనుచూచి తల మెల్లగా గోకుకొన్నాడు. గొంతు సవరించుకొన్నాడు. ముక్కొకసారి చీదాడు.

"నిజంగా చాల అందమైనదేకాని..." డాక్టర్ కాసేపు నిశ్శ్వనమిలి మళ్లీ అన్నాడు. "ఎలావుందని చెప్పను ! ఆచారానికి విరుద్ధంగా....అంత రసోచితంగా లేదేమో.... నేనుచెప్పటం దేనికి నీకు తెలీదూ."

"ఏముంది అందులో ?" ఆశ్చర్యపడి అడిగాడు శాషా.

"చిత్తకార్తెలో పుట్టినవాడికైనా యిలాంటి ఆలోచనకలగదు. ఇలాంటి విగ్రహాన్ని బల్లమీదపెట్టి నా యిల్లంతా అపవిత్రం చేసేదా ?"అన్నాడు డాక్టరు. శాషాకు మనస్సు చివుక్కుమంది.

"డాక్టర్‌సాబ్, శిల్పంలో మీకెంత అభిరుచివుంది! నామాటవినండి. ఇది లోకోత్తర విగ్రహం. ఒకసారి జాగ్రత్తగా చూడండి. ఎంత అందంగా ఉంది! వెలుపలి ప్రపంచమే మరచిపోయి ఆనందసముద్రంలో అలాఅలా తేలిపోతాము. హృదయం ఆగిపోతుంది. ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాలు ఆగిపోతాయి. ఒక దివ్యసమాధిలో ఉండిపోతాము. ఈ అందంలో పడి ఈ భౌతికప్రపంచం, నీవు నేను అన్న భావాలనే మరచిపోతాము. ఒకసారి చూడండి. ఏమి అందం, ఏమి అందం! ఎంత జీవకళ! నిజంగా కదలుతున్నట్టున్నాయి." అన్నాడు శాషా.

"తెలుసురా నాయనా, తెలుసు. నేను సంసారినికానిసన్యాసినికాను. పిల్లలు ఇక్కడకక్కడకు తిరుగుతుంటారు. ఎప్పుడూ ఆడవాళ్ళు వస్తూ పోతుంటారు.

"మీరు అలా చూస్తే యీ లోకోత్తర విగ్రహం కేవలం మరొకవిధంగా కనిపిస్తుంది. కాని మీరుమాత్రం అలాంటివాళ్ళు కారు. మీరు దీన్ని పుచ్చుకోకపోతే మా అమ్మకూ, నాకూ—మా అమ్మకు నేను ఒక్కణ్ణేనన్న సంగతి మరచిపోకండి—ఎంత కష్టంగా వుంటుందో ఆలోచించండి. మీరు నాకు మళ్ళీ ప్రాణంపోశారు. ప్రతిఫలంగా ప్రాణప్రదమైన విగ్రహం మీకు ఇస్తున్నాము అయితే ఒకటే మా విచారం. దీని జత బొమ్మని కూడ ఇవ్వలేకపోతున్నాము."

"నీకు అర్థంకావటంలేదా ఏమిటి? పిల్లలు తిరుగుతుంటారు. ఆడవాళ్ళు ఎప్పుడూ వస్తుంటారు.—సరే అక్కడ పెట్టిపో. నీతో వాదించి లాభమేముంది ?" అన్నాడు డాక్టరు.

"ఈ విగ్రహాన్ని యీ బల్లమీద ఇక్కడే వుంచండి. దీనిజత బొమ్మకూడావుంటే ఎంత

బాగుండేది! చేసేది ఏముంది? సరే నేను వెలవుతీసుకొంటాను."

శాషా వెళ్లిపోయాడని తేల్చుకొన్న తరువాత డాక్టరు తలుపువైపు చూచి ఒకసారి తలగోక్కున్నాడు. "బాగనేవుంది. పారవేయటం బాగుండలేదు....కాని ఉంచుకోటానికి కూడా మనస్కరించటంలేదు. ఎవరికిస్తే బాగుంటుందబ్బా!" ఆలోచించాడు.

"ఆఁ. స్నేహితుడు అడ్వకేటున్నాడుగా. కేసులో ఎంతో సహాయంచేశాడు. డబ్బిస్తే ఏమనుకొంటాడు? ఈ విగ్రహం ఇస్తాను. ఒంటరిగాడు. జలసా మనిషి. అతనికిస్తేనే బాగుంటుంది."

ఈ ఆలోచన తట్టగానే డాక్టరు స్నేహితుని యింటికి విగ్రహం పట్టుకొని వెళ్ళాడు.

"నా కేసులో ఎంతో శ్రమపడ్డావు. ఇదిగో ఈ లోకోత్తర విగ్రహం నీకు ప్రజెంటు చేయటానికి వచ్చాను. అందంగా లేదూ?"

అడ్వకేటు విగ్రహాన్ని చూడగానే పరవశుడయ్యాడు.

"ఎంత విచిత్ర శిల్పం........ఈ శిల్పులున్నారే—వీళ్ళు విచిత్ర జీవులు. ఎంత జగన్మోహనంగావుంది. ఎక్కడ సంపాయించావేమిటి?" అన్నాడు స్నేహితుడు.

కాని అంతలోనే ఆ సంతోషం చల్లారి తలుపువంక ఒకసారి చూచాడు. గొంతు సవరించుకొని, "నీకూ నీ విగ్రహానికి ఒక దణ్ణం. నాకొద్దు. ఆ విగ్రహాన్ని ఏమనుకోకుండా పట్టుకెళ్ళు." అన్నాడు.



" నాకు రెడీమేడ్ షర్టు ఏదైనా ఉందాండీ?"

"ఏఁ?" కాళ్ళు తొక్కుకొన్నాడు డాక్టరు.

"ఏమి చెప్పమంటా... నీకు తెలియనిదేముంది గనక....మా అమ్మ నన్ను చూడటానికి అప్పుడప్పుడు వచ్చిపోతుంటుంది. క్లయంట్లు వస్తూపోతుంటారు. అది అలా ఉంచు...కొంపదీసి నా పనిమనుషులు చూస్తే నామీద గౌరవమేమన్నా వుంటుందీ!"

"అడ్డుచెప్పకు. ఈ కాస్త పుచ్చుకోకపోతే నన్ను చంపుకుతిన్నట్టే. ఏమి విగ్రహం, ఏ విగ్రహం! లోకోత్తర శిల్పం! ఎంత జీవకళ! ఏమి భావం! పుచ్చుకొనకపోయావా, ఇకెందుకు లే...." అన్నాడు డాక్టర్.

"ఆ శిల్పివెధవ కాస్త యిక్కడ ఆకో అలమో కప్పితే బాగుండేది." అన్నాడు అడ్వకేటు.

డాక్టర్ మిత్రుని మాటలు వినకుండానే అక్కడనుంచి దూసుకొన్నాడు.

స్నేహితుడు వెళ్లిపోయింతరువాత అద్వకేటు విగ్రహాన్ని ఒకసారి కలామెలా చూచి, "దీన్ని ఏమిచెయ్యను? బాగానేవుంది. చూస్తూ చూస్తూ పారెయ్య బుద్ధిపుట్టటం లేదు. ఉంచుకొందామా అంటే అంతకన్నా సిగ్గుచేటు మరేమీలేదు. ఎవరికో ఒకళ్ళకిచ్చివేయటమే మంచిది. అన్నట్టు ఆ నటుడు షోష్కిన్ ఉన్నాడు. వాడి కిలాంటివంటే ఎంతో ఇష్టం," అనుకొన్నాడు.

అనుకోటమే తడవుగా విగ్రహాన్ని అద్వకేటు షోష్కిన్‌వద్దకు పట్టుకెళ్ళాడు.

ఆ సాయంకాలం షోష్కిన్ గదికి వచ్చినవాళ్ళంతా ఆ విగ్రహాన్ని తేరిపార జూచి కడుపు చెక్కలయ్యేట్టు నవ్వారు. ఎవరన్నా నటకురాండ్రు తలుపుదగ్గరకు వచ్చి "లోపలకు రావచ్చునా?" అంటే అదర బాదరాగా "డార్లింగ్, డ్రెస్ చేసుకుంటున్నా"నని ఆ సాయంకాలమంతా చెబుతూవచ్చాడు.

ఆ రాత్రి షోష్కిన్‌కు ఆ విగ్రహం ఒక పెద్ద అంతర్జాతీయ సమస్య అయిపోయింది.

"దీన్ని ఏమిచెయ్యను? ఫొటో అన్నా కాదు ఏ డ్రాయర్లోనైనా దాయటానికి, నటకురాండ్రు ఎప్పుడూ వస్తూపోతుంటారే," అని దుగ్గపడసాగాడు. ప్రక్కనున్న మిత్రుడు అతనికి సలహాయిచ్చాడు:—

"ఇక్కడకు దగ్గర్లోనే స్మీర్నోవా అనే ముసలి అవ్వవుంది. ఇలాంటి కంచువిగ్రహాలు కొనటమే ఆమెకు వృత్తి. ఆమెపేరు అందరికీ తెలుసు. తీసికెళ్ళి ఆమెకు అమ్మివేయి."

ఆ సలహాప్రకారమే పోయాడు.


రెండురోజులైన తరువాత డాక్టర్ కోషిల్కోవ్ ఆఫీసులో తలవంచుకొని మాత్రలు ఏ మోతాదులో ఉండాలా అని ఆలోచిస్తున్నాడు. అకస్మికంగా తలుపు తెరుచుకొని శాషా గదిలోకి వచ్చిపడ్డాడు. మొగమంతా నవ్వుతో తొణికిసలాడుతున్నది. చేతిలో ఏదో పొట్లాము ఉంది.


"డాక్టర్‌సాబ్! డాక్టర్‌సాబ్!" శాషా కాసేపు రొప్పి అన్నాడు:—

"మీకిచ్చిన దానికి జతబొమ్మ సంపాయించ గలిగాను. మా అమ్మ ఎంత సంతోషించిందని! మా అమ్మకు నేను ఒక్కణ్ణి. మీరు నన్ను బ్రతికించి బయట పడేశారు."

సంతోషంతో కంపించిపోతు శాషా పొట్లంవిప్పి గంధర్వకన్యకల విగ్రహం బల్లమీద పెట్టాడు. ఏదో మాటాడుదామన్నట్టుగా డాక్టరు నోరు విప్పుకొన్నది. కాని ఒక మాటకూడా రాలేదు. అతడు మాట్లాడలేకపోయాడు.




రావు & శాస్త్రి కంపెనీ
రావు అండ్ కో
శాస్త్రి అండ్ కో
TO LET



# ముసలివాడి పరిచయం

పద్మరాజు

బస్సులో పోతుంటే గాలి ముఖంమీద, ముఖ్యంగా నున్నగా దువ్విన క్రాపుమీద సుఖంగా లాలనగా తగులుతోంది. లోకం అంతా పరిశుభ్రంగా ఉంది - అప్పుడే స్నానం చేసినట్టుగా. శ్రీనివాసరావు పక్కస్నేహితుడితో అనేక విషయాలను గురించి సంభాషిస్తున్నాడు - ఒకొక్క విషయం ఒకొక్క ఆకవి.

పాతిక సంవత్సరాలు దాటని ప్రణయ ప్రధానమయిన ఆ వయస్సులో ప్రేమ అనేది, అంత అందవికారంగాలేని ప్రతి యౌవన స్త్రీమీదకీ ప్రవహిస్తుంది. ఆ శ్రీనివాసరావు రోజూ కొన్నివేలమంది స్త్రీలను ప్రేమిస్తున్నాడు. ఆ విశ్వప్రేమ ఒక కేంద్రం చూసుకుని అక్కడికి ప్రవహించడం ప్రారంభించడానికి కొన్ని సంవత్సరాలు గడవాలి. కాని అల్లా కేంద్రీకరణం జరిగితే అసలు ప్రేమలో ఉన్న మజా చచ్చిపోతుందేమోనని శ్రీనివాసరావు అనుమానం.

"కల్పవల్లి చూశావు, మొన్న 'పతివ్రత' లో వేసింది. ఏమి అద్భుతమయిన శరీరంరా? ఏం వంపులు ! ముఖం చూశావా ? ఎక్కడా తెలివి అన్నమాట కనపడదు."

స్నేహితుడు పక్క వున్న ఆడమనిషి వేపు చూసి దీర్ఘంగా ఆలోచిస్తూ అన్నాడు.

"దీనికీ దానికీ ఒక సంబంధం వుండి తీరాలి. లేకపోతే ఇన్ని ఉదాహరణలు దొరకకూడదు."

"దేనికీ దేనికీ ?"

"అందానికీ తెలివికీ."

స్నేహితుడు కొంచెం వైజ్ఞానికుడు. అతనికి ప్రతివిషయం ఒక వైజ్ఞానిక సూత్రంలో ఇమిడిపోవాలి.

"నా అభిప్రాయం ఏమంటే చూడు. అందంగాఉన్న ఆడది సాధారణంగా వొట్టి కప్పతల."

శ్రీనివాసరావుకి ఆవిషయమయి అంత విశ్వాసంలేదు. అందమయిన ఆడవాళ్ళు కొంతమంది అతన్ని పెద్ద టోకరాలు తినిపించారు. అయినా అతను జవాబు చెప్పలేదు. స్నేహితుడు అన్నాడు.

"మనం తీసుకునే ఆహారంలోంచే అందం అయినా తెలివయినా నిర్మాణంకావాలి. అందం ఎక్కువయితే తెలివి తగ్గిపోతుంది. తెలివి ఎక్కువయితే అందం తగ్గిపోతుంది. అదీ నిష్పత్తి."

శ్రీనివాసరావుకి కూడా ఒక అభిప్రాయం తట్టింది.

"ఒరే చూశావు ! హెరిడిటీలో చాలా వుంటుందనుకుంటాను. అందమయిన కప్పతల ఆడదీ, మంచి తెలివయిన పేడ చేట వంటి ముఖవిన్యాసంగల మగవాడూ ఉన్నారనుకో, వాళ్ళిద్దరికీ ఒక ఆడపిల్ల పుట్టిందనుకో, ఆ అమ్మాయి రెండు రకాలుగా ఉండొచ్చు. మంచి అందమయినదీ, మంచి

తెలివయినదీ కావచ్చు. శుద్ధ అనాకారీ, శుద్ధ మట్టిబుర్రా కావచ్చు."

"ఇప్పుడీ కల్పవల్లి సంగతి ఏమంటావు?"

"తల్లి అప్సరసలాంటిదయి ఉండాలి. తండ్రి పొట్టి జంతువయి ఉండాలి."

ఎక్కడో పెద్ద ఉరుము వినిపించింది. అందులో 'ఏయ్' అనే తెలుగుమాట ఒకటి ఉన్నట్టు అనుమానంతగిలి శ్రీనివాసరావు తల పైకెత్తిచూశాడు.

నల్లటి మేఘంవంటి మీసాలుగల ముఖం ఒకటి తళ తళ మెరుస్తున్న కళ్ళతో ఉరమ డానికి సిద్ధంగా అతనివేపు చూస్తోంది. ఉరుము బయలుదేరిన ప్రదేశం అదే అయి ఉంటుందని అతను ఊహించాడు.

"ఏటన్నా ?"

ఆ నోటినుంచి వెలువడిన ధ్వనిని మాటల్లో వ్రాయడం అసంభవం. మొత్తంమీద ఆ పెద్ద మనిషి అనాలనుకున్న మాట అది. ఆరడు గుల లావుపాటి ముసిలి. అయినా శరీరం ఇంకా గట్టిగా ఉంది. పసుపు పచ్చ సిల్కు లాల్చీ చెమట వానలతో తడిసిపోయింది. ఒకచేత్తో పైన ఊసపట్టుకుని బస్సుమధ్య జనంలో నిలబడి ఉన్నాడు.

శ్రీనివాసరావు పాఠ్యపుస్తకాల్లో కూడా అనాగరకులను గురించి చదువుకోలేదు. అంచేత ఏరకంగా వాళ్లని ఎదురుకోవాలో అతనికి తెలియదు.

"మీకు సంబంధంలేని విషయం" అని అతి నాగరకంగా తన శిరాకుని సూచిస్తూ అన్నాడు.

"సంబంధంలేదూ ? ఎవరన్నారంట ?"

బస్సులో జనమంతా ఆ ముసలివేపు తిరి గారు. అతడు పై ఊసని వదలివేసి సిల్కు లాల్చీ చేతులు పైకి మడతపెడుతున్నాడు. శ్రీనివాసరావుకి ఆ ముంజేతిని చూడ్డంతోటే మన ప్రస్తుత విద్యావిధానంమీద మితిలేని అసహ్యం కలిగింది. అధమం కుస్తీ అయినా బలవంతంగా నేర్పని విద్యావిధానం ఎందుకు? తన్నుతాను రక్షించుకోడమన్నా విద్యార్థులకి నేర్పకపోతే, వాళ్ళు లోకంలో ఎందుకు పనికొస్తారు ?

డ్రైవరుకి కుతూహలంకలిగి చటుక్కుని కారు ఆపాడు. జనం అంతా ఒకరిమీద ఒకరు పడ్డారు. సిల్కుచొక్కా తొడుక్కున్న ముసిలి శ్రీనివాసరావు కాళ్ళమీద పడ్డాడు. శ్రీనివాసరావు తొందరగాలేచి ముసలివాడి చేతిని దులుపుతూ, అన్నాడు.

"తమరిల్లా కూర్చోండి. నేను నిలబడతాను."

ముసిలివాడు కోపగించిన చంటిపిల్లవాడి లాగ అన్నాడు.

"అక్కర్లేదు, నువ్వే కూకో."

"అల్లా కాదు. తమరు పెద్దలు. ఈ బస్సుల్లో నిలబడి లేరు."

ముసిలివాడు కూర్చున్నాడు. శ్రీనివాస రావుకి అగమ్యంగా ఉంది ఈ గొడవ. అయితే అపాయంతప్పింది. మెల్లగా వంగి అడిగాడు.

"తమ పేరు ?"

"సుబ్బయ్య"

పేరంత సహాయపడలేదు. శ్రీనివాసరావు తెగించి అడిగేశాడు.

"తమరు కల్పవల్లిని ఎరుగుదురా ?"

ముసిలి ఒకచూపు శ్రీనివాసరావు వేపు చూసి అన్నాడు.

"మా అమ్మాయి."

శ్రీనివాసరావు మెదడులో మబ్బులు విడి పోయాయి. ఆశ్చర్యం చిరునవ్వులాగ అతని ముఖాన్ని ఆవరించింది.

"అరే! ఎంత చిత్రం! కల్పవల్లి మీ అమ్మాయా ? ఎంత మూర్ఖుడినో చూడండి.

మిమ్మల్ని చూసినప్పటినించీ ఎక్కడ చూశానా ఈ ముఖం అనుకుంటున్నాను. సరి. తెలిసింది."

"ఎక్కడ చూశావు?"

"కల్పవల్లి ముఖంలో. ఇంకెక్కడ? ఆ కళ్ళు ఇంకెవరివీ కావు. మీవే. అరే! ఎంత పొరబాటయిపోయింది!"

"ఒహోహోహో!....."

ఈమాటకూడా అసలుధ్వనిని సూచించలేదు. ముసలివాడి నవ్వు గుఱ్ఱం సకిలింపుని కొద్దిగా పోలివుంటుంది.

"నిజంగా నంటావా? చాలామంది అంటుంటారులే.......నువ్వెప్పుడన్నా ఇపతల చూశావా మా అమ్మాయిని?"

"లేదండి."

"పొద్దుగాని రా."

శ్రీనివాసరావు ఆహ్వానాలని అంగీకరించే ముందు కొంచెం మొగమోటపడడం అలవాటు. కాని ఈ సందర్భంలో అతనికి ఏం చెయ్యాలో తోచలేదు.

"ఏయ్ బస్సు! ఆపు. ఏటాతోలడం?"

బస్సు ఆగింది. ఆహ్వానాన్ని అంగీకరించాలో లేదో నిశ్చయించుకోకుండానే ముసలివాడి వెనకాల శ్రీనివాసరావు బస్సు దిగాడు. దిగగానే ఇంతసేపటినించీ మరిచిపోయిన స్నేహితుడిమాట జ్ఞాపకం వచ్చింది. ఇంతలో బస్సు కదిలిపోయింది.

* * *

శ్రీనివాసరావు కుర్చీలో సుఖంగా కూర్చుని చుట్టూ గోడలమీద తగిలించివున్న సినిమా ఫోటోలను చూస్తున్నాడు. ఇంతలో సుబ్బయ్య ఒక పళ్ళెంలో ఫలహారాలు, రెండు కప్పులూ, ఒక ఫ్లాస్కుతో కాఫీ మోసుకుంటూ వచ్చి బల్లమీద పెట్టాడు.

"అమ్మాయి స్టూడియోకి పోయింటుంది. గంగమ్మేమయిందో. గంగమ్మా!... తలుపులన్నీ తీసేసి ఏంపోయింది? దొంగలు దూరితే?"

సుబ్బయ్య కుర్చీలో కూర్చుని శ్రీనివాసరావుని దగ్గరగా కుర్చీ ఈడ్చుకోమని సంజ్ఞ చేశాడు. ఇద్దరూ ఫలహారాలు తింటూ కూర్చున్నారు. శ్రీనివాసరావు ఏదో అనాలిగదా అని అన్నాడు.

"నిజంగా తమబోటివాళ్ళు సాహసించి సంసార స్త్రీలని సినిమాల్లోకి దింపడం ఉండదే ....నిజంగా........"

"ఆ?"

"మనబోటి కుటుంబాల్లో ఆడవాళ్ళు సాహసించి సినిమాల్లోకి రాలేరు చూడండి."

సుబ్బయ్య బజ్జీలు పచ్చడిలో నిండుగా ముంచి నోట్లో పెడుతూ అన్నాడు.

"అమ్మాయి నేను ఉంచుకున్నదాని కూతురు. అది సచ్చిపోయింది—అదంతే దీని తల్లి."

శ్రీనివాసరావు మెదడు పనిచెయ్యడం మానేసింది. ఉంచుకోడం విషయమయి శ్రీనివాసరావుకి అభిప్రాయాలులేవు. కాని అందమయిన ఆడపిల్లల్ని వాళ్ళు కన్నట్టయితే ఉంచుకోడంమీద శ్రీనివాసరావుకి అంత అభ్యంతరం ఉండవలసిన అవసరంలేదు. సుబ్బయ్య తత్వంలో ఏదో రహస్యం అతనికి దొరికింది. ఇంక ఒక్కపెట్టుగా సంభాషణలోకి దిగిపోయాడు. ఒక్క పావుగంటలో ఇద్దరూ పాతస్నేహితుల్లాగ మాట్లాడుకుంటున్నారు.

"నాకు చాలాకోరిక లున్నాయండీ. అందులో ముఖ్యంగా సినిమాలో వేషంవెయ్యాలని ఒకటి."



"ఓహో! హో! హో!!"

"ఏం? నవ్వుతున్నారు? నేను పనికి రానంటారా?"

"అబ్బే! అదికాదయ్యా. మా కుర్రది వాచేత ఒక యాసం యేయించింది. ఓహో హో!"

"మీరు సినిమాకి సరిగ్గా నప్పుతారు తెలుసా?"

"నిజంగానా?....సాలామంది అంటుంటారులే."

శ్రీనివాసరావు కుర్చీలోనించి లేచి ఇటూ అటూ చూశాడు. కాని సుబ్బయ్య అది గమనించకుండా పరధ్యానంగా కాఫీ తాగుతున్నాడు. శ్రీనివాసరావు తటపటాయిస్తున్నాడు. ఇంతలో సుబ్బయ్య కళ్ళుమూశాడు. శ్రీనివాసరావు కొంచెందగ్గి అడిగాడు.

"ఆ....కొంచెం చెయ్యి కడుక్కోడానికి నీళ్ళుకావాలండి."

సుబ్బయ్య కళ్ళుతెరిచి "ఆ?" అన్నాడు. శ్రీనివాసరావు చేతులు చూపిస్తూ "నీళ్ళు...." అన్నాడు. సుబ్బయ్య జ్ఞాపకంవచ్చి తన చేతులు చూసుకుని కొంచెం ఆలోచించి పంచిని తుడుచుకున్నాడు.

"గంగమ్మా!.... ఎక్కడ సచ్చిందో.... ఇల్లాపోండి. ఆ గదిపక్కని నీళ్ళగదుంది. అక్కడుంటాయి. ఎక్కడ సచ్చిందో...."

సుబ్బయ్య కళ్ళుమూశాడు. శ్రీనివాసరావు రెండుగుమ్మాలుదాటి ఒక తలుపు తోశాడు. తలుపు రాలేదు. కొంచెం గట్టిగా ఒక్క ఊపు ఊపాడు. ఈసారి ఏమీ బెట్టులేకుండా చటుకుని తలుపు వెనక్కిపోయింది. ఆ ఊపులో శ్రీనివాసరావు ముందుకి పడిపోయాడు. ఈ పెద్ద ఇంటి తలుపులు ఇంత ఇలా ఎందుకు మోసపుచ్చుతాయని తర్కిస్తూ లేవబోతో ఉంటే అతని ముఖానికి దగ్గరగా ఒక తళ తళ మెరుస్తున్న బాకు ఒక చెయ్యి కనబడ్డాయి. తలుపు మళ్ళీ మూసుకుపోయింది. శ్రీనివాసరావు జాగ్రత్తగా ముఖం పైకెత్తి చూశాడు.

చొక్కాలాగూ తొడుక్కున్న ఒక యువకుడు అతనిమీద వంగి కళ్ళతో భయపెడుతున్నాడు.

చిన్నతనంలో శ్రీనివాసరావు దొంగలని గురించి చాలా చదివాడు. అయితే ఆ దొంగలందరూ నల్లగా వంటికి ఆముదం రాసుకుని ఉండేవారు. అసలు అతను దొంగలతో ముఖాముఖీగా వ్యవహరించలేదు ఎప్పుడూ. అంచేత అతను ఈ పరిస్థితిలో ఏంచెయ్యాలో తోచక గది నాలుగుపక్కలా చూశాడు. అది నీళ్లగదికాదు. బహుశా బట్టలగది అయుంటుంది. ఒక తాడుమీద కొన్ని చీరలు వేళ్లాడుతున్నాయి. విరుగుడుచేవ బీరువా ఒకటి గోడకు ఎదంగా వుంది. కుడిపక్క ఒక గదితలుపు తెరిచి వుంది. అందులో కుళాయి ఉంది.

"కాస్త చెయ్యికదుక్కురానా ?"

ఆ యువకుడు మెల్లగా అన్నాడు.

"గట్టిగా మాట్లాడావా పొడిచేస్తాను. లేస్తే పొడిచేస్తాను. మాట్లాడకుండా అల్లాగే పడుకో"

శ్రీనివాసరావుకి పడుకున్న పద్ధతి అట్టే సుఖంగాలేదు. కొంచెం పక్కకి తిరిగిపడుకోడానికి అనుజ్ఞ అడిగాడు. యువకుడు అనుజ్ఞ ఇస్తూ బాకు మళ్ళీ చూపించాడు.

"ఏమన్నా వేషాలేస్తే పొడిచేస్తాను."

శ్రీనివాసరావు వేషాలువెయ్యడం తనకు రాదని, అంతవరకు ఎప్పుడూ ప్రయత్నించలేదనీ క్షమార్పణగా చెప్పడం మొదలుపెట్టాడు.

"నోరుముయ్యి. మాట్లాడితే పొడిచేస్తాను."

ఏంచేస్తే పొడవకుండా ఉంటాడో తెలుసుకోవాలని శ్రీనివాసరావుకి కుతూహలం ఉంది గాని అడగడానికి సాహసం లేకపోయింది. యువకుడు మూసినతలుపు కంతలోనించి అవతలకి చూస్తున్నాడు. బాకుపట్టుకున్న చెయ్యి వెనక్కి పెట్టుకుని చూస్తున్నాడు. శ్రీనివాసరావు ఏదన్నా చేద్దామా అని అనుకుని చెయ్యకుండానే ఉంటే మంచిదని నిశ్చయించుకుని అల్లాగే పడుకున్నాడు.

ఏమీచెయ్యకుండా వుండగలగడం అంటే ఏమిటో అతనికి అర్థం అయింది. చైనావాళ్ల వేదాంతంలో అది ముఖ్యమయిన విషయం. చైనాదేశంలో ఆడవాళ్ళ కాళ్ళు పొట్టిగా కురచగా ఉంటాయి. మొత్తంమీద ఆడవాళ్ల కాళ్లు చిన్నవిగా అందంగా రక్తనాళాలు పైకి ఉబికి కనిపించకుండా ఉంటే బాగుంటాయి.

టప్పుని చప్పుడయింది.

ఒక నున్నని మెత్తని బలమయిన కాలు చటుక్కుని బాకుపట్టుకున్న చేతిని టపీమని తన్నింది. కత్తి ఎగిరి శ్రీనివాసరావు పక్కని పడింది. అదేమిటో పరీక్షిద్దామని కుతూహలంకొద్దీ పట్టుకుని చూస్తుండగా యువకుడు అతనిమీద పడ్డాడు. శ్రీనివాసరావు ప్రయత్నంలేకుండానే బాకు మొన యువకుడి మెడకు తగిలింది. యువకుడు కంగారుగా లేచి సినీమాలోలాగ చేతులు పైకెత్తి గోడ దగ్గరకుపోయి నిలబడ్డాడు. ఇంతలో రెండు కాళ్ళూ రెండుచేతులూ ఒక చీరలుంగ చరచర గోడకు బీరువాకు మధ్యమన్న కాళీ స్థలంలోకి మాయమయిపోయాయి.

జరిగిన సంగతి ఏమిటో కొంతసేపటి వరకు శ్రీనివాసరావుకి బోధపడలేదు. తన చేతిలో బాకు ఎందుకుందో, కాలు ఎవరిదో ఆ యువకుడు అల్లా అసహ్యంగా చేతులు ఎందుకు పైకి ఎత్తాడో ఏమీ తెలియడంలేదు.

"దింపు కిందకి చేతులు. నెప్పిపెడతాయి."

యువకుడు చేతులు దింపాడు. గోడ మూలనించి గొంతుక వినిపించింది.

"బీరువాకి అవతల సీరలున్నాయి. గట్టిగా ఆటితో సేతులు కాళ్ళు కట్టెయ్యండి. ఈతట్టు రాకండేం. సీర కట్టుకోనేదు."

యువకుడు అజ్ఞ అక్కరలేకుండానే కింద పడుకుని చేతులు వెనక్కి పెట్టాడు. శ్రీనివాసరావు చేతులూ కాళ్ళూ కట్టేస్తూ ఇంత మర్యాదగా లోకమంతా ఉంటే ఎంత బాగుండునని అనుకున్నాడు.

అతనికి అవతారాలమీద మామూలుగా నమ్మకంలేదు. కాని గోడమూలనించి చటుకుని వచ్చి చటుకున మాయమయిపోయిన ఆ వ్యక్తి నిజమయిన మనిషో కాదో అని అతనికి అనుమానం వచ్చింది.

"అవతలకి ఈడుసుకుపోండి. నేను సీర కట్టుకొత్తాను;" అని ఆగొంతుక ఆదుర్దాగా మళ్ళీ అంది. "నేనొచ్చేదాకా అయ్యని పిలవకండేం?"

శ్రీనివాసరావు చెప్పినట్టుచేసి గది అవతల నిలబడ్డాడు. సుబ్బయ్య గుర్రు సమతాళంలో వినబడుతోంది. సాయంత్రం కుర్చీలోకూర్చుని నిద్రపోగల వ్యక్తుల్ని చూస్తే అతనికి దోకు.

గదిలోనించి మంచి దేహపుష్టిగల నల్లటి యువతి ఇవతలకి వచ్చింది.

"నేను నీల్లగదులో ఉన్నానని ఆరితో అనకండేం? సంపేత్తారు. కొత్తగా నిన్నే పింగాణీ నీల్లతొట్టి కొనిపించింది అమ్మాయిగోరు. ఎవరూలేరుగందా అని అందులో కూకుని నీల్లోసుకుంటుంటే సటుకుని సప్పిడయింది. గోడమూల దాంకున్నాను సీర సుట్టబెట్టి. లోనకొచ్చి తలుపేశాడు. ఆబాకు సూస్తే నాగుండెలు ఇట్టట్టు కొట్టుకున్నాయి."

సుబ్బయ్యని గంగమ్మ లేపింది. అతడు లేచి కళ్ళు నులుపుకుని చూశాడు.

"ఏడపోయావే. ఎన్ని పిలిచినా పలకలేదు?"

"దొడ్డో నీల్లోసుకుంతన్నానండి బాబుగారు. దొంగ పడ్డాడండి."

"ఆ?"

సుబ్బయ్య మెల్లగా లోపలికి వచ్చాడు. శ్రీనివాసరావునిచూసి అన్నాడు.

"నువ్వింకా ఉన్నావా? ఎల్లిపోయావనుకుంటున్నాను."

సుబ్బయ్య కిందపడుకున్న యువకుడివేపు చూసి కళ్ళు పెద్దవిచేసి,

"ఓరి యెదవా! ఎప్పుడొచ్చావ్? ఇదేంటి సేతులుకాళ్ళు కట్టేశారేం?"

"నన్ను బాకుతో పొడవబోయాడండి."

"ఏడిశాడు. పొడవబోయాడూ? ఏడిశాడు. యెదవ. గంగీ, ఇప్పు. కాపీ తాగుతావురా? లే."

యువకుడు లేచి కూర్చున్నాడు గంగమ్మ కట్టువిప్పుతుంది.

"నాకు డబ్బుకావాలి. నీ బీరువా బద్దలుకొట్టి తీసుకుపోదామని వొచ్చా. ఇంతలోనే నువ్వు ఒచ్చేశావు."

"నాదగ్గర డబ్బులేందే?"

"దానిదగ్గర లేదూ?"

"దానిదగ్గరలేదు."

శ్రీనివాసరావుకి తనెరగని లోకంమధ్యకి వొచ్చిపడ్డట్టు అనిపించింది.

"ఎవరండి ఈ అబ్బాయి?"

"ఎంకట్రామయ్య."

ఆ పేరులో అన్నివిషయాలూ ఉన్నట్టు సంతృప్తితో సుబ్బయ్య అవతలికి వెళ్ళిపోతున్నాడు. వెంకట్రామయ్య గబుక్కుని అన్నాడు.

"నాకు డబ్బియ్యి."

"లేదు."

"ఎందుకుంటుంది?"

"ఏం?"

"అది ఆచారికి పెడుతోందిగా?"

"ఆ?"

"ఇద్దరూ ఇంతకితమే కార్లో ఎక్కి పోయారు. నేనొచ్చేముందే. రోడ్డుపక్కని దాక్కొనిచూశాను."

"పిచ్చిముండ. ఆ యెదవలో ఏముందో కోతిలాగ ముఖం ఆడూను. పైగా డబ్బు. వెంట."

"పొద్దున్న మెయిల్లో వొచ్చాను. తిండి లేదు."

"గంగమ్మా! ఆడికేదన్నా తిండానికి పెట్టు...."

గంగమ్మ శ్రీనివాసరావు వేపుతిరిగి చిరు నవ్వు నవ్వుతూ వెళ్ళిపోయింది. శ్రీనివాస రావు సుబ్బయ్యని అడిగాడు ఆ యువకుణి చూపిస్తూ.

"మీ ......."

"అబ్బాయి."

శ్రీనివాసరావుకి నీరసం వొచ్చింది.

"మీ అబ్బాయని తెలియక కష్టేశాం. చాలా పొరబాటయి పోయింది. మీరు ఏమీ అనుకోకండేం? దొంగ అనుకున్నాంగావి..."

"కట్టెయ్యవలిసిందే యెదవని. బుద్ధిలే వెదవ."

శ్రీనివాసరావుకి కణతలు కొట్టుకుంటు న్నాయి. చన్నీళ్ల స్నానం పెరుగు అన్నం భోజనం అయితేతప్ప తలలో వేడితగ్గదని పించింది.

"నాకు శెలవిప్పిస్తారా?"

"ఉండు. అమ్మాయొచ్చే యాలయింది. కూకో....యెదవచారిగాడు .... సూడు పోసీ సీటోటివోణ్ణిపట్టుకు దేవుల్లాడినా నాకు తగువు లేదు .... సూడబ్బాయి! మా అమ్మాయి వీయాల సినీమాకి తీసుకుపోతా?... ఆ ఆచారి గాడినించి వొదిలిపించాలి ఎట్లాగయినా."

శ్రీనివాసరావుకి ఆవేళ ఇంక కల్పవల్లిని కలుసుకోడానికి తగిన మనోబలంలేదు. ఈ పద్మవ్యూహంలోనించి ఎల్లాగయినా బయట పడాలి.

చటుకుని సుబ్బయ్య మేలుకొని కొడుకు వేపు తిరిగి "ఎంతకావాలిరా డబ్బు?" అని అడిగాడు.


"రొండు వందలు."

"ఆ?"

ఒకక్షణం ఆగి సుబ్బయ్య లోపలికి వెళ్ళాడు. శ్రీనివాసరావు ఇదే అదను అని వెంకట్రామయ్యదగ్గర తాత్కాలికంగా శలవు తీసుకున్నాడు.

"నేను ఇప్పుడే మళ్ళీవొస్తాను. మీ నాన్న గారితో చెప్పండి, శలవు. కొంచెం బయూరు వనుంది."

శ్రీనివాసరావు ఇవతలికి వచ్చేసరికి లోకం అంతా నల్లగా అయిపోయింది. అనాటి సంఘటనల నన్నిటినీ సిగరెట్టు పీల్పుతో మరిచిపోడానికి ప్రయత్నిస్తూ గబగబ ఇంటికి వెళ్ళిపోయాడు.





# ఈ మనిషి ప్రేమలేఖ

పి. భానుమతి—

మా పెళ్ళయిన మూడవమాసంలో మా యిద్దరికి వియోగం సంభవించడం తటస్థించింది.

అయినా పెళ్ళి అయిన మూడుమాసాల్లోగా ఏ భార్యాభర్తలు వకళ్ళనొకళ్ళు వదిలి యింకొకళ్ళుంటారు? వుండరు - వుండరు - కష్టమే. అయినా మా విషయంలో వుండక తప్పిందికాదు. అసలు యీ వియోగం.... చాలా "దీని"గా సంభవించింది.

దీపావళిపండుక్కు యీ మనిషినీ నన్నూ తీసికెళ్ళాలని మా నాన్నవచ్చారు.

తీరా యీ మనిషికి శలవు దొరక్కపోగా రాత్రింబవళ్ళు విధివిరామంలేని చాకిరీ ఆఫీసులో.....అల్లాంటి సమయంలో శలవుకు పలాంపెట్టి, యీ మనిషి వచ్చేమాట ఆశ వదులుకుని, నన్ను వెళ్ళమన్నారు. దిక్కుమొఖంతో - నేను యీ మనిషిరాంది వెళ్ళనన్నాను. నేను వెళ్ళకుండావుంటానవడం వారికి మనసులో యిష్టమేకాని, నన్ను పంపకుండా వూరుకోడం యీ మనిషికి అన్యాయంగా కనుపించింది. మా నాన్న మనకోసం పెద్దవాడు యింతదూరం ఆశతో వచ్చాడు. ఎవరో ఒకరు వెళ్ళకపోతే మనసు కష్టపెట్టుకుంటాడు అని యీ మనిషి ఉత్తరప్రజ్ఞలు లాగా నాకు కబుర్లు చెప్పాడు. కాని మనసులో........

· ప్లాట్‌ఫారంమీద అప్పగింతలు గ్లిసరిన్ లేని కంటిసీళ్ళు - తిరిగి అయిదురోజుల్లో వచ్చేలాగున చేతుల్లో చేతులు వేసుకోడం, యీలోపు రోజుకొక జాబు వ్రాసే పద్ధతి (బయలుదేరినరోజు మినహాయించి) యిక్కడ యీ మనిషిని హోటల్లో భోంచేయ వద్దని-(తెలిసినవాళ్ళింటికి పొమ్మని) పెర్రివి, (కుక్క. అది మా వెడ్డింగ్ ప్రెజంటేషనలెండి) దాన్ని బాగా చూచుకుంటుండమని వగైరా నా భాగం పూర్తిచేశా. యీ మనిషి భక్తి శ్రద్ధలతో ఓపిగ్గా విన్నారు నే జెప్పిందంతా - గార్డు విజిల్‌చూచి నా చేయి తన చేతిలోకి తీసుకున్నారు. అప్పటి యీ మనిషి అవస్థ నాకు నిజంగా జాలివేసింది....వస్తానన్న రోజు తప్పక రావాలి అని ఒట్టు వేయించుకున్నారు. బండి కదిలింది-అప్పుడే యీ మనిషి చిక్కి సగమైనట్లు అవుపించారు నా కళ్ళకు.

వూరుచేరిన మర్నాడు కాక ఆ మర్నాడు పోస్టువాడికోసం ఎదురుచూస్తూ కూర్చున్నా. రానేవచ్చాడు - పెళ్ళయిన తర్వాత యిదే ప్రప్రథమంగా యీ మనిషి నాకు లేఖ వ్రాయడం. దానికోసం నేను ఎదురు చూడడం. పూర్వం మేఘుడు సందేశం తెచ్చినందుకు అతన్ని ఎలా బహూకరించారో ఆ నాయికానాయకులు-హంస సందేశానికి దమయంతి ఏం బహూకరించిందో తెలీదు కాని, నేనుమాత్రం యీ కష్టకాలంలో పోస్టువాడికి ఒకరూపాయిబహూకరించి లెటరు తీసుకున్నా-వాడు తెల్లటి రూపాయి చూచి తెలతెల పోయాడు. వాడికేంతెలుసు పాపం....

అసలు వుత్తరం తెలుగుభాషలో వుంటుందనుకోలా-ఎందుకంటె యీ మనిషి తెలుగు మాట్లాడినా, వ్రాసినా ఒత్తులు లేనిచోట ఒత్తులు, ఒత్తులు వున్నచోట తీసివేయడం,



నేను నవ్వుతూండడం మామూలే - అంచేత యీ మనిషి ఎప్పుడు బయటికి వెళ్ళినా మాట్లాడాల్సి వచ్చిందంటే యింగ్లీష్ ఆరంభిస్తాడు. యీ మనిషికి అదొక "వీక్‌నెస్". కవరు విప్పాను నా కళ్ళు తిరిగాయి. నన్ను నేను నమ్మలేకపోయాను. నేననుకున్నదానికి "రివర్స్"లో వుంది వ్యవహారం - అసలు స్టార్టింగ్ చాలా ప్రబంధంగావుంది........ "హే ప్రేయసీ, రాణీ (యీ మనిషి నన్ను ముద్దుగా రాణీ అంటారు లెండి) నీవు క్షేమముగా చేరివుంటావనుకొందును........యిదే మొదటిసారి నీకు నేను లిఖితపూర్వకంగా లేఖవ్రాయడం, అందులోను ప్రేమలేఖ.... యింత వియోగబాధతో (చెప్పాకదండీ ఒత్తులు వున్నచోట వుండవని) హృదయం దహించుకుని మంటలు పైకిరాలేక - నీవు రోజూ వంటచేశేప్పుడు యింటినిండా పొగ పట్టినట్లు - నా హృదయం వియోగం అనే పచ్చికట్టెల పొగతో నిండుకున్నది. అబ్బ— ఘోరం - రాణీ యీ విధంగా నా కవిత్వ ధోరణిలో వ్రాయడం చూచి నీవు నవ్వుతావేమో అని నేను నవ్వుకుంటున్నాను. నాకు నీలాగా కవిత్వం రాదుగదే - అయినా "నీకు రాకపోతే పోయింది. కాస్తోకూస్తో కథలు వ్రాయడం తెలిసిన నీ పెళ్ళానికి కొంచం కవిత్వధోరణిలోనే నన్ను నడుపు" మని నా కలం చెబుతోంది. మరి నా కలం కవిత్వంతో నా పైత్యంకూడా కొంచం జోడిస్తున్నాను, తప్పులెంచకే రాణీ — హే కవకాక్షి! ఒక్కరోజు నీ ముఖపల్లవంబు తిలకింపని నా కండ్లూ, ముఖమూ కళావిహీనంబై, మొదలే చముదుకారే నా ముఖము మరింత జిడ్డుగా నున్నది - హే పద్మదలాక్షి! నీ....లేని నా పెదవులు సిగరెట్లధాటికి ఎండిపోయి చాలా ఘోరంగావున్నాయి- హే ధర్మపత్నీ! నీ సేవనందుకొనలేని నా కాళ్ళు కొంగర్లు పోవుచున్నవి. నీలమేఘశ్యామా అంటే నీవు నల్లగావున్నావనికాదు; అది నా కవిత్వధోరణి రాణీ-నీ వెన్నిరోజులం కొచ్చెదవు? నన్నెప్పుడు కరుణించెదవు? శీఘ్రంబు తెలియచేయుము నా చకోరమా!... హే ప్రియతమే చారుశీలే - పెరుగుపచ్చడే అన్నట్లు నీవు చేశే పెరుగుపచ్చడికోసం నా ముఖం వాచిపోయినట్లుంది. ఇంకా చెప్పాలంటె నీవులేని యీ యిల్లు "ఎక్స్ట్రా"లేని సినిమాలాగుంది నా రాణీ - పూటోణీ - నీవు

పేణీలుచేసి నాకెప్పుడు తినిపించుతావు - నీవు వెళ్ళి అప్పుడే నెలరోజులైనట్లుంది నాకు. నీవు త్వరగా రావాలి రాణీ! నాకు వేవిళ్ళు ఆరంభం అయినాయి. నీవు నవ్వద్దు. నేను సరిగా భోంచేయడంలేను. నీవు వచ్చిందాకా దీక్ష పట్టదల్చుకున్నాను. నీవు వెళ్ళేప్పుడు నేనింతగా బాధపడుతాను అని తెలిసివుంటె నిన్ను పంపకపోదును - నీ భర్త యింత దుర్భరావస్తలో నున్నాడు. ఆనాడు రాధ వియోగబాధ ఎంతగా అనుభవించిందో యీనాడు అనుభవంవల్ల నేను కనుగొన్నాను— రాధ ఆడది. నేను మగాణ్ణి అంతే తేడా. నాకు పిచ్చి ఎత్తేట్లుంది రాణీ. యీ అయిదు రోజులు ఎల్లా గడపడం? ఎక్కడికి వెళ్ళినా నీ ధ్యాసే....నాకే సిగ్గవుతోంది. యీ ఒంటరి తనంలో యీ వియోగంలో (ఒద్దురా బాబూ నాకు ఒత్తులు పలకవు అన్నాకూడా యీ కవిత్వం కక్కులాగొస్తోంది)....రాణీ చెబితే నమ్మవు. యీ సమయంలో కొన్ని స్థాంవాలు వ్రాయాలనిపిస్తోంది. కవులకు కవిత్వం పుట్టుకొచ్చేది యిల్లాంటి సమయాల్లోనే కాబోలు. బహుశా కవులందరూ పెళ్ళాలని ఎప్పుడూ పుట్టింటిలోనే వుంచుకొంటారేమో కవిత్వం కోసం - రాణీ నీకోసం నేనేకాదు, మనకుక్క పిల్ల పెర్రి కూడా బెంగెట్టుకుంది. అంతటితో వూరుకొందా? మన మంచం కోడు సగం కొరికితినేసింది - దానికీ కోపంవచ్చిందేమో ఖర్మం!- అన్నట్లు మర్చిపోయా. మన పెర్రికి శుభముహూర్తం చూచి పెళ్లిచేయాలి రాణీ. మన పక్కయింటివాళ్ళ కుక్క "లిల్లీ"ని "పెర్రిలో" చేసింది. ప్రస్తుతం "వూయింగ్" అన్నమాట. పెళ్ళికి నీవు పేరంటానికి వెళ్ళాలి కాబోలు. కొంపతీసి వూళ్ళో కుక్కలన్ని అన్నిటిని పిల్చుకొచ్చేస్తావేమో - రేషన్ రోజులు పైగా యీ కుక్కలన్నీ ఒకచోటచేరితే ప్రస్తుతపు హిందూ - ముస్లిమ్ గలాటాలకంటె ఘోరంగా తయారవుతుంది. యీ రోజు మధ్యాన్నం ఏంజరిగిందో తెలుసా, రాణీ - మన పెర్రి తన "వుడ్-బి-వైఫ్" లిల్లీతో కలిసి మన కాంపౌండ్‌లో షికార్ చేస్తోంది- నేను వాటి అన్యోన్యాన్ని తిలకిస్తూ నుంచున్నా - యింతలో పక్కింటి అమ్మాయి లిల్లీని పిల్చింది. అది పోలేదు. ఆవిడ గొలుసు తీసుకొచ్చి దాని మెడకు తగిలించి లాక్కెళ్ళింది-లిల్లీ వెనక్కు తిరిగిచూస్తూ (పెర్రీని) వెళ్ళింది. పాపం - పెర్రి మనసు కష్టపడిందేమో - కుయ్ - కుయ్ మని మూలిగింది.. ఆహా హృదయేశ్వరీ. రాణీ - ఆ దృశ్యం వియోగబాధ ఎల్లాంటిదో అనుభవిస్తున్న నా హృదయంకూడా నాకు తెలీకుండానే కుయ్ - కుయ్‌మని మూలిగిందంటే నమ్మ......"

* ● ●

"అదేమిటే అమ్మాయ్ నీలో నీవు అంత పగలబడి నవ్వుకుంటున్నావ్"—అని లోపల్నుంచి మా అమ్మవచ్చి అడిగిందాకా నేనెంతగా నవ్వానో నాకు తెలీదు. డొక్కనొప్పికూడా పుట్టుకొచ్చింది....

"అదికాదే మరీ...బావా...కవిగారైనారే.."


అంది చెల్లాయి.

అసిభడవా-అది యింతసేపూ నా వెనకాలే వుందన్నమాట!



# జూన్ నెల భావపరిచయ పోటి

సమాధానం



జూన్ నెల బహుమానం రు. 10/- ఈ క్రిందివారికి ఇవ్వడమైనది.

"వ్యాఘ్రం శరణం గచ్ఛామి"

యం. రాజమన్నారు నాయుడు,

సేలం.

---

మేనెల భావపరిచయ పోటీకి సరిఅయిన వ్యాఖ్య రానందువల్ల ఆపడమైనది.



# రామాయణ గొబ్బి

శిష్టా ఉమామహేశ్వరరావు

ఆ కాలంలో గొబ్బి జటాయువింట్లో పెరిగింది. గొబ్బికి తలిదండ్రులెవరో తెలియదు. పసిపిల్ల అడివిలో ఆకూ అలమూ తింటూ అక్కడికీ ఇక్కడికీ, ఆ ఆశ్రమం ఈ ఆశ్రమం తిరుగుతుంటే ఓరోజు జటాయువు కంటబడింది. జటాయువుకు జాలివేసింది. తనకు పెళ్లాంలేదు; బిడ్డలులేరు. గొబ్బిని పెంచుకున్నాడు జటాయువు.

జటాయువింట్లో పెరుగుతున్న గొబ్బికి చిన్నప్పటినుంచే సూక్ష్మబుద్ధి యేర్పడింది. జటాయువు పెంపకాన గొబ్బి దయార్ద్ర హృదయమైంది. అనుకున్నపనిని అనుకున్నట్టు నెరవేర్చడంలో గొబ్బికిగూడా జటాయువు పట్టుదలే అబ్బింది.

అడివిలో ఆడుకునేది గొబ్బి. అడివి వానరులతో సావాసంచేసింది. వానరుల ఇండ్లల్లో యే సంబరం జరిగినా తల్లిలేని బిడ్డనీ, తండ్రిలేని బిడ్డనీ అందరూ ఆదరించేవారు. వానరులు యుద్ధాలప్పుడూ యాత్రలప్పుడూ దూరదేశాలు పోయి ఇండ్లకు తిరిగివచ్చేప్పుడు తమతమ బిడ్డలకు తెచ్చే కానుకల్లో ప్రత్యేకం గొబ్బికవిగూడా తెచ్చేవారు.

జటాయువు గుహంతా వానరులు గొబ్బికిచ్చిన ఆభరణాలతో నిండిపోయింది. జటాయువు అదంతా చూచి నవ్వుకున్నాడు.

“నాకు రెక్కల్లేవు. కాస్త అటూ ఇటూ తిరగడానికి చోటుంచవమ్మా. అంతటా ఆభరణాలేనా!” అన్నాడు సంపాతి ఒకరోజు.

“నేనేం చెయ్యనూ, వాళ్లూ వీళ్లూ వద్దన్నా ఇచ్చిపోతున్నారు. అవ్వన్నీ దాచిపెట్టుతున్నా.” అన్నది గొబ్బి.

“దాచిపెట్టి యెవరికిద్దామనీ?” అని అడిగాడు జటాయువు.

“ఏమీ గొబ్బి పెట్టుకోలేమా! పెండ్లయిం తర్వాత ఇంకా పెట్టుకోలేమా,” అన్నాడు సంపాతి.

“ఆ! గొబ్బికి పెండ్లేమిటి. స్వేచ్ఛగా అడివిలో తిరుగుతున్న పిల్లకు సంసారపు సంకెళ్లెందుకూ? అయినా గొబ్బితో సమానమైన పురుషుడేడీ. ఉహూ! బిడ్డల్లే పెరుగుతున్న దిక్కడ. నా బొందిలో ప్రాణమున్నంతవరకూ ఇక్కడే ఉంటుంది. ఇక్కడేమైనా లోపంగా ఉందా గొబ్బీ ?” అన్నాడు జటాయువు.

"లోపం యేముందీ యేమీలేదు," అన్నది గొబ్బి.

"మరీ యీభరణాలన్నీ యెందు కమ్మా?" అని అడిగాడు సంపాతి.

"యేమో! దేని అక్కర యెప్పు డొస్తుందో? యేం చెప్పనూ," అన్నది గొబ్బి.

"సరే నీయిష్టం తల్లీ," అన్నాడు సంపాతి.

"ఈ గుహలోనే తిరగాల్నా యేమిటి? నాచెయ్యి పట్టుకుని బయటకొస్తే చెట్ల నీడల్లో హాయిగా తిరగొచ్చు," అన్నది గొబ్బి.

"నిజమే నిజమే గొబ్బి తల్లీ—రేప ట్నుంచీ అట్లాగే చేస్తాను. వానరపిల్లల కేవైనా కథలు చెపుతోంటే పొద్దు పోతూంటుంది," అన్నాడు సంపాతి.

గొబ్బికి పదహారేండ్లు నిండాయి. ఓరోజున జటాయువు విహారార్థం పోయి మళ్ళీ రాలేదు. చీకటిపడేదాకా కనిపెట్టు కుని చూచారు గొబ్బీ సంపాతీనీ. "ఓయి సూర్య భగవానుడా! నారెక్కలనెందుకు కాల్చావు. తమ్ముడు కనబడలేదే. వెదక డానికి నేనెట్లా పోగలను. అయ్యో అయ్యో!" అనుకున్నాడు సంపాతి.

"ప్రొద్దున్నే నేపోయి వెతికివస్తాను, అందాకా ఓపికపట్టాలి," అన్నది గొబ్బి.

ప్రొద్దున్నే పయనమై పోయింది గొబ్బి. పోగా పోగా ఓకొండలో లోయలో ఓచెట్టునీడతో మూలుగుతూ రక్తమయదేహంతో రెక్కలు ఖండింప బడి విరిగిన సముద్రపు కెరటాలలల్లే చుట్టూగాలి కెగురుతున్న యీకెలమధ్య పడిపోయిన జటాయువు కనబడ్డాడు.

"ఇదియేమి ఇదియేమి, తండ్రీ! ఇట్లా అయిపోయినావేమిటి?" అని ఆర్త స్వరంతో అడిగింది గొబ్బి.

"మరేమీ పరవాలేదు. దుఃఖపడ మాకు గొబ్బితల్లీ! అన్న సంపాతి నూర డించు. నేను వీరమరణం పొందబోతు న్నాను, రావణ రాక్షసుడిటు పోయాడు. పోతూ శ్రీ రామచంద్రమూర్తి భార్యను సీతను దొంగిలించుకుపోయాడు. శ్రీ రామచంద్రమూర్తి యెవరనుకున్నావు? అవతారమూర్తి! నాసఖుడైన దశరథుని కుమారుడు!" అన్నాడు జటాయువు.

"తండ్రీ దారి పొడుగూతా మణులతో పొదిగిన యీ యాభరణాలేమిటి?" అని అడిగింది గొబ్బి.

"ఓహో. అర్థమయింది. సీతామహా లక్ష్మి బహు ఇంగితజ్ఞురాలు. భర్త తనను వెదకుతూ వెంటవస్తూంటే దారి సూచన తెలుసుకోడానికి తన వంటిమీది నగలన్నీ యీవిధంగా అక్కడక్కడ పారవేసింది కాబోలు," అన్నాడు జటాయువు.

"తండ్రీ ఇప్పుడు నాకు తోస్తున్నది. సీతా మహారాజ్ఞి మళ్ళీ సింహాసనం యెక్కినప్పుడీ వెలలేని ఆభరణాలు వెంటనే వస్తయ్యా! నేను గుహలో దాచి ఉంచిన ఆభరణాలు అవిడెకే అట్టి పెడతా," అన్నది గొబ్బి.

"బలే బలే! మంచి బుద్ధిమంతు రాలవమ్మా. నేను పెంచినందుకు నన్ను



కృతార్థుడ్ని చేశావమ్మా!" అని జటాయువంటూ అట్నా అని ఒసారి మూలిగాడు. ఆ సంతోషాని కతని గాయాలు మంటెత్తించాయి.

కొంచెం సేపూరకున్నాడు జటాయువు. "సరేనమ్మా. నువ్వెందుకిక్కడ? ఒంటరిదానవు, గుహలో సంపాతీ ఒంటరే, ఇంకపో, రామచంద్రమూర్తి వచ్చి నన్ను దహనపరిచేవరకూ ఓపిక పట్టుకునుంటాను." అన్నాడు.

దుఃఖంతో దహించుకుపోతున్న శరీరంతో లోపలికన్నీరును లోపలే జారవిడుచుకుంటూ తలవంచుకుని వచ్చిన గొబ్బిని చూచి సంపాతి అంతలోనే గ్రహించాడు.

రోజులు గడిచాయి. సంపాతికీ, గొబ్బికీ వెనకటి సంతోషాలులేవు. మనసు మరపుకోసం వానరపిల్లలను వెంటేసుకుని కథలు చెబుతూ కాలం జరుపుతున్నాడు సంపాతి.

ఉండగా ఉండగా గొబ్బికో అనుమానం తోచింది. "సీతామ్మవారు నగలన్నీ పారేస్తూ నల్లపూసలుగూడా పారేస్తుందేమో! శత్రువునియింట ఉండడమే కూడదు. అందులో నల్లపూసలు లేకుండానా. ఆఁ! ఆఁ!"

తనకు తోచినదాన్ని సంపాతితో చెప్పింది గొబ్బి. "నీకాహార విషయాలన్నీ ఇరుగుపొరుగువాళ్లు చూస్తుంటారు. గుహలో మధ్యమధ్య మణు

లున్న నల్లపూసల హారమొకటుంది. దాన్ని నేనే తీసుకుపోయి సీతకిస్తా," నన్నది గొబ్బి.

"అంతకన్నానా! అయినా జాగ్రత్తమ్మా గొబ్బీ. ఈడొచ్చినదానవు. ఏ ఇంద్రజిత్తుకంటన్నా పడతావేమో. భద్రంగా పోయిరా!" అన్నాడు సంపాతి.

లంకకు ప్రయాణం సాగించింది గొబ్బి. ఒంటరిగా పోతున్న గొబ్బికా ఒంటరిదేముదే వెన్నంటు రక్షకుడు. ఆ సుకుమారి, కౌమారి యౌవనవతి కంత బలమూ ఓపికా యెక్కడనుండివచ్చింది? అదే జటాయువు పెంపకపు మహిమ.

గొబ్బి లంక ప్రవేశించేటప్పుడు లంఖిణీ యేమనలేదు. గొబ్బి ముఖం చూసి లంఖిణికోపం లజ్జపడిపోయింది.

గొబ్బికోట ప్రవేశించేప్పుడు కోట రక్షకులేధాటీ చెయ్యలేదు. వాళ్ళకాపిల్లను చూసేప్పటికి కన్నాపేక్షకన్న మిన్నయైన ప్రేమపుట్టింది.

అశోకవృక్ష ఆవరణం ప్రవేశించబోయింది గొబ్బి. అప్పుడుమాత్రం నలుగురు రాక్షసస్త్రీలు అడ్డుకున్నారు. అడ్డుకున్నారేగాని నిముషంలో వాళ్ళగుండెలు కరిగాయి. ఎవరు కావాలని గొబ్బి నడిగారు. సీత కావాలన్నది గొబ్బి. వాళ్ళసలే రాక్షస స్త్రీలాయెను. ఎంత గుండెలు కరిగినా ఆటాకోటితనం యెక్కడకు పోతుంది? గొబ్బినటు తిప్పారు ఇటు తిప్పారు. ఆమిషతో యీమిషతో ఆ భవనం యీ భవనం చూపారు. మధుర పదార్థాలు పెట్టారు. "సీతకావాలీ, సీతకావాలీ?" అని ఎగతాళి చేశారు. ఇంతలో త్రిజట ఆ వైపువోతూ ఆ సంగతంతా చూచి జాలిపడ్డది. సంగతి తెలుసుకుని, "ఇటురామ్మా సీతను నేను చూపిస్తా," నని గొబ్బిని తీసుకుపోయింది.

గొబ్బి యెదటకురాగానే, "ఎవరవమ్మా నీవు? మనదేశంనుంచి చూడొచ్చింది నువ్వే మొట్టమొదటిదానవు!" అని అడిగింది సీత.

"సీతతల్లీ! నాపేరు గొబ్బి. నాతండ్రి పరబ్రహ్మ - నాతల్లి భూదేవి. నన్ను పెంచినవాడుజటాయువనేమహావీరుడు," అని గొబ్బి సమాధానం చెప్పింది.

"ఓహో! జటాయువు మహావీరుడే. అడవిలో యెంత ఘోరంగా యుద్ధం చేశాడో తెలుసునా? అహా! ఏమీలాభం లేకపోయింది. పాపం!" అన్నది సీత.

దుఃఖంతో కొంతసేపూరుకున్నది సీత. కన్నీళ్లు బొటబొటారాల్చింది. గొబ్బి విచారవదనంతో అట్లాగే నుంచుంది.

"అయితే ఎందుకొచ్చావమ్మా నీవూ? ఒంటరిగా ప్రయాణంచేస్తూ వచ్చేవే. ఏదో ఘనమైన కార్యంలేనిదే వస్తావా? ఏమిటమ్మా?" అని అడిగింది సీత.

"సీతా మహాతల్లీ, నీకు తెలియంది లేదు. అయినా నేను చెప్పేది విను. ఆడుదానికి శత్రువింటనుంటే అప్రతిష్ట! అందులో నల్లపూసలు లేకుండాఉంటే చాలా అశుభం!" అన్నది గొబ్బి.

"అవునమ్మా! భర్తకానమాళ్ళగా ఆభరణాలన్నీ దారినే విడుస్తూవచ్చాను. ఆఖరికి ధనుష్కోటిలో నల్లపూసల హారంగూడా విడిచాను. అయితే అశుభం

అవి నాకు తెలియదు! అందుకని సముద్రపుటొడ్డున తెల్లని పావులనేరి హారంగా గుచ్చుకుని మెళ్లో వేసుకున్నాను. ఏం చెయ్యను మరీ!" అన్నది సీత.

"అహా! యెంత ప్రాజ్ఞత్వం!" అన్నది.

"అందుకనే గాబోలు నిన్ను జూచి ధనుష్కోటిలో ఆడివి ప్రజలీ పావుల్నే మెళ్ళో వేసుకుంటున్నారు. వస్తూ వస్తూనే చూశాను." అన్నది గొబ్బి.

"ఉహూ!" అని నవ్వింది సీత.

"ఎంతైనా పావులేమిటి మహారాజ్ఞీ మణి మెళ్ళో! నేను తీసుకువచ్చాను చక్కని నల్లపూసలహారం. మధ్యమధ్య మణులుగూడా ఉన్నాయి. అందుకనే అసలు నేను వచ్చింది. ఇదుగో! మెళ్లో వేసుకో!" అని పూసలహారం సీతకందిచ్చింది గొబ్బి.

"అమ్మా! యెంత పిల్లవే నీవు. నీకు దివ్యమైన మొగుడు దొరకాలి," అంటూ సీత ఆహారాన్ని మెళ్ళో వేసుకున్నది.

"నేను పెండ్లిచేసుకోను. సీతా, జటాయువే నాకు పెండ్లిచేయవలసిన వాడు మరణించాడు. పోతూ నాపెండ్లి సంగతేమీ చెప్పలేదు. మరిచిపోయాడు కాబోలు. అయినా నాకేమీ లోపంలేదు. సంపాతిని కనుపెట్టుకుని హాయిగా స్వేచ్ఛగా వానరులతోనూ ఆశ్రమవాసులతోనూ కాలంగడుపుతాను. నాకేంగావాలి!" అన్నది గొబ్బి.

"శుభం! నీయిష్టం వచ్చినట్లే చేయమ్మా! మరి నువ్వీ రాక్షసదేశంలో ఉండొద్దు. పాపం మళ్ళీ ఒంటరిగా వెళ్ళాలినే!" అంటూ సీత త్రిజటవంక చూసింది.

"ఎందుకమ్మా! నాసేవకు ణ్ణొకడ్నిచ్చి పంపిస్తాను. వాడీమెను వాయువేగంతో పోయిదిగడ్పి వస్తాడు," అని త్రిజటన్నది. అప్పుడే ఆ సేవకుడు గొబ్బిని తీసుకుపోయి సంపాతివద్ద విడిచి వచ్చాడు.

మరి కొన్నిదినాలకు మారుతి సీత కడకొచ్చాడు. సీతకు రాముని ఉంగరం చూపాడు. సీత ఉంగరం రామునికివ్వడానికి పుచ్చుకున్నాడు. ఆదేసమయంలో గొబ్బికథ విన్నాడు.

తనకన్న ముందు సీతనోదార్చడాని కొచ్చినగొబ్బి తనకన్న గొప్పదనుకున్నాడు. గొబ్బినే పెండ్లాడుదామనుకున్నాడు.

శ్రీరామపట్టాభిషేక సమయంలో గొబ్బితో చిన్నప్పుడాడుకున్న వానరులతో గొబ్బిపెండ్లివిషయం సంప్రతించాడు మారుతి. గొబ్బి బ్రహ్మచారిణి అని గ్రహించాడు. వివాహమసలు చేసుకోనే చేసుకోదని తెలుసుకున్నాడు.

కొన్నాళ్ళు అయోధ్యలో ఉండమని రామచంద్రుడు బ్రతిమాలినా ఉండలేదు మారుతి. ఏకాయెకీ అడవికి పోయాడు.

తానుగూడా బ్రహ్మచర్యమే అవలింబింప నిశ్చయించాడు మారుతి.

# విజయ

బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

(గత సంచిక తరువాయి)

ఇదే సమయమని, విజయతో ఇంకా ఏమిటేమిటో మాట్లాడాలనుకున్నాను. కాని విజయ ఇంక మాట్లాడేధోరణిలో లేదు. ఒకటి రెండుసార్లు, విషయం ప్రారంభించబోయి, మళ్లీ మానేసేను. విజయలేచి, సముద్రపు ఒడ్డుకి వెళ్దామంది.

ఒడ్డుచేరగానే విజయ ఇటూ అటూ రెండుమూడుసార్లు పరికించి చూసింది. సూర్యుడు పశ్చిమాన్ని ఎర్రటి గాయంతో అస్తమిస్తున్నాడు. దూరాన్ని చేపలవాళ్లు తప్ప మరెవరూలేరు. వాళ్ళు అడయూరు కాలువ సముద్రంలో కలిసేచోట, వడుములోతు నీళ్ళలోదిగి చేపలు పట్టున్నారు. విజయ కెరటాలలోకి దిగడానికి కానేపు చీరెసద్దుకోబోయి మళ్ళీ మానేసి చేపలవాళ్లున్నవైపు వెళ్దామంది. వాళ్లదగ్గరికి వెళ్లి నుంచుంటే. వాళ్ళలో హాస్యగాడొకడు తన బుట్టలోఉన్న చిన్న చేపలవి పైకితీసి, "కావోలా, బాబూ? సుబ్రంగున్నోయి. ఉప్పులద్దుకుతిన్నా, యాటిరుసే యేరు. పెద్దసేపలున్నోయి, కావాలంటే, సవగ్గిప్పిస్త," అన్నాడు. మేము మాట్లాడలేదు. వాడే మళ్ళీ తోటివాళ్ళతో. "అల్లు బాపనోళ్లయ్యా, సేపలుతినరు. పప్పుంజేసాలు." అన్నాడు.......

"మీ ఇంట్లో చేపలు తింటారా, విజయా?"

"బెంగుళూరులోనా?....నేను తినను. మా అమ్మమట్టుకు అప్పుడప్పుడు తనకి వేరే మాంసం చేపలూ వండించుకుంటూ ఉంటుంది....నేనూ చిన్నప్పుడు తినేదాన్ని. ఇప్పుడిష్టంలేదు....మా అమ్మ అలవాటుచేసుకుంది. ఇప్పుడు లేకపోతే ఉండలేదు....ముఖ్యంగా తినకోసం వచ్చేవాళ్లకి చేయించిపెట్టుం దనుకుంటాము."

విజయకి మళ్లీ వాళ్ళమ్మమాట జ్ఞాపకం చేసినందుకు విచారించాను....

ఇసుకలో నడుస్తున్నాం. చీకటిపడుతోంది. అర్ధచంద్రుడు ఆకాశంమీద పల్చని తెల్లని మబ్బులవెనక నిర్జీవంగా కనిపిస్తున్నాడు. మేముచూసిన చేపలవాళ్లు వలలూ బుట్టలూ చేతపట్టుకుని కాలువదాటి అల్లరిగా కేకలువేసుకుంటూ, పాటలు పాడుకుంటూ దూరాన్నిఉన్న వాళ్ల గుడిసెలవైపు వెళ్ళిపోతున్నారు. కొంతసేపయాక వాళ్ల పాటలూ కేకలూ ఏవో అమానుష్యమైన ధ్వనులుగా మారేయి. సముద్రపు

హోరుమట్టుకు నిముష నిముషానికీ ఎక్కువ గంభీరంగా వినిపిస్తోంది. అప్పుడే చెన్నపట్నం వదలి వెళ్ళిపోతున్న ఒక ఓడలోని దీపాలు ఆకాశపుటంచుమీద వెలుకదలేని నక్షత్రసమూహంలా ఈదుకుపోతున్నాయి....

"నీళ్ళలోకి దిగుదాం," అంది విజయ.

"త్వరగా హాస్టలుకి వెళ్ళాలేమో నువ్వు ?"

"నాకిప్పుడు హాస్టలుకి వెళ్ళాలనిలేదు. ఇక్కడే ఉండిపోవాలని ఉంది. ఈ రాత్రంతా ఇక్కడే ఉండిపోవాలని ఉంది....ఇంకా లోపలికి వెళ్దాం. కెరటాలంటే నాకెంతో సరదా. నీకులేదూ ?"

"సరదాయేకాని. ఒక జ్యోతిషుడు ఏమిటోచెప్పి నాకు నీటిభయం కలుగజేసేడు. అప్పటినుంచీ..."

"ఈతరాదా నీకు ?"

"రాదు."

"నాకు వచ్చును....ఇంకా కొంచెం లోతుగా వెళ్లొచ్చును. పరవాలేదు. అంత భయం అయితే ఎలాగ ?"

చీరె మోకాళ్ళవరకూ ఎగకట్టింది విజయ. నేనూ పంచ పైకికట్టి తనవెంట దిగేను.

"నిజంగా నీకు భయంగాఉంటే రావద్దుసుమా," అంది విజయ, నిర్భయంగా ఇంకా సముద్రపు లోతులలోకి వెళ్ళిపోతూ.

"ఆ జ్యోతిషుడి సంగతి తమాషాకి చెప్పేను. ఏమీ పరవాలేదు," అన్నాను తనవెంటవెళ్తూ.

"ఈవాళ నీకు భయంలేదులే. ఈతతెలిసినదాన్ని నేనున్నానుకా....కావాలంటే నా చెయ్యిపట్టుకో," అంది విజయ వెనక్కితిరుగుతూ.

ఇంకా మాట పూర్తిచేసిందోలేదో, అసందర్భంగా అది మరీ లోతుప్రదేశం కావడంవల్లనో, లేకపోతే ఏదో చిన్న నున్నటి రాతిమీద కాలుజారడం వల్లనో, విజయ నీళ్ళలో పడిపోబోయింది. నేను వెనుకనుంచి రెండుచేతులతోనూ పడిపోకుండా తనని పట్టుకున్నాను.

"ఎంతభయం నీకు," అంది, నవ్వుతూ నావైపుతిరిగి, నామీద తనచెయ్యి ఆన్చి. నాపట్టు విడిలించుకునేందుకు తను ప్రయత్నంచెయ్యలేదు.

ఆ వెలుగు నీడలలో, ఆ నిగనిగలాడే పళ్లవరుసా, ఆ నవ్వుతూఉన్న ముఖమూ, అప్రయత్నంగా నా కౌగిటిలోఉన్న ఆ సౌందర్యమూ నన్ను పూర్తిగా ముగ్ధుడిని చేసేసేయి. విజయని పెదవులమీద ముద్దుపెట్టుకున్నాను. తనూ పూర్తిగా నావైపుతిరిగి తన కౌగిటిలో నన్ను చేర్చుకుంది. మళ్ళీ మళ్ళీ ముద్దుపెట్టు

కున్నాను. మళ్లీ మళ్లీ ముద్దులు మాట్లాడేను, ముద్దుగా పలకరించాను. ఈరోజువ తను నాదైనట్టూ, ఎక్కడ ఈ సముద్రం నా ఆనందాన్ని ఈడ్చుకుపోతుందో అన్నట్టూ, తన శరీరాన్ని నా శరీరానికి గట్టిగా అదుముకున్నాను. పెద్ద పెద్ద కెరటాలువచ్చి బట్టలు తడిసిపోతున్నప్పటికీ, వాటి ఆలోచనేలేదు. సముద్రపుహోరు వినపడడమేలేదు....

"తడిసిపోతున్నాం.... కెరటాలు మరీ భీకరంగా ఉన్నాయి.... వెళ్దామా ?.... నేనంటే నీకు ప్రేమ ఇంకా లేకపోలేదన్నమాట ?"

"నా ప్రేమ ఎప్పటికీ తగ్గదు, విజయా."

"నేను భయపడ్డాను."

"నీతో చాలా మాట్లాడాలి, విజయా. నిన్ను నేను బోధపరచుకున్నాను. నువ్వు నన్ను బోధపరచుకోవాలి.... అక్కడ కూర్చుని మాట్లాడుదామా ?"

"వద్దు. ఆలస్యం అయిపోయింది. హాస్టలుకి వెళ్లిపోవాలి.... తర్వాత మాట్లాడుదాం."

అయిష్టంగా నీళ్ళలోంచి పైకివచ్చేసేం. తడిబట్టలు పిండి ఆరనిచ్చేవరకూనైనా ఆగలేదు. కాసేపు కూర్చోకతప్పదని ఇసుకలో నేను కూలబడ్డప్పటికీ, విజయ కూర్చునేందుకు వేళ లేదంటూ వెళ్లిపోవాలంది. బస్సులునిలిచే ప్రదేశానికి బయలుదేరేం. ఇద్దరి బట్టలూకూడా తడిగాఉండడం అందరూ ప్రత్యేకంగా చూస్తారని భయపడి విజయ తను ఒక్కత్తే ముందు వెళ్లిపోతానంది. నేను ఎంత బతిమాలుకున్నా ఇద్దరమూ ఒకేబస్సులో వెళ్ళడానికీ హాస్టలువరకూ నేను దిగపెట్టడానికీ తను ఒప్పలేదు. తను ముందు వెళ్లిపోయింది. దూరంగా పదినిముషాలు ఆగి, తర్వాత బస్సులో నేను బయలుదేరేను. బస్సులోఉన్నంతసేపూ అతి పరాకుగా ఉన్నాను. తిన్నగా నాగదికి వెళ్ళకుండా మౌంటురోడ్డులో విజయ బస్సు మార్చవలసి ఉందికదా అని, విజయ అక్కడ ఉంటుందేమోనని మౌంటురోడ్డు వెళ్లేను. విజయ అక్కడలేదు. గదికి చేరుకున్నతర్వాత విజయ తన హాస్టలుకి సమంగా చేరుకుందో లేదో అన్న భయం నన్ను వ్యర్థంగా బాధించింది.

ఆ రాత్రి విజయచెప్పిన తన గాథగురించి ఆలోచిస్తే ఆ చరిత్ర ఆధారంగా పెట్టుకుని నవలొకటి వ్రాయాలన్న బుద్ధిపుట్టింది. రాత్రికి రాత్రే మొదటిప్రకరణం మొదలుపెట్టేను. నవలకి 'పాదధూళి' అని నామకరణంకూడా ఆ రాత్రే చేసేను. వ్రాతమాత్రం సాగలేదు.

మొన్నాడు సాయంత్రం అతిసరదాగా విజయ హాస్టలుకి వెళ్ళేను. తనతో అన్నిసంగతులూ ఆ సాయంత్రం మాట్లాడాలనుకున్నాను. ఎంతత్వరగా తను ఒప్పుకుంటే అంత త్వరగా తనని పెళ్లిచేసుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నానని

చెప్పదలచుకున్నాను. మా దొడ్డమ్మకి విజయ అంటే చాలా ఇష్టం అని నాకు తెలుసును. విజయని నేను పెళ్ళిచేసుకుంటానని ఆవిడతో చెప్తే ఆవిడ అభ్యంతర పెట్టదని నాకు ధైర్యం. ఆవిడ తప్పితే మిలిగినవాళ్ళు ఏమనుకున్నా, నాకు పికరులేదు. గొట్టెముక్కల వారు మా చుట్టాలే. కారణాంతరాలవల్ల తల్లి చెడిపోయినంతమాత్రాన, పిల్ల చెడిపోయినట్టుకాదు. విజయకి తండ్రి తరఫు చుట్టాలు బెజవాడ ప్రాంతాలలోనూ బందరు ప్రాంతాలలోనూ ఉంటారు. విజయని పెళ్ళిచేసుకున్నాక, వాళ్ళందరినీ కలుసుకుని విజయకీ వాళ్ళకీ మళ్ళీ స్నేహాలూ, రాకపోకలూ అనుబంధాలూ ఏర్పరచవచ్చును. బెజవాడలో నా స్నేహితుడు. పాటిబండతనికి, స్వర్గస్థులైన గొట్టెముక్కల రమణయ్యగారిగురించీ, ఆయన కుటుంబంగురించీ, ఆయన చుట్టాలగురించీ అంతా కనుక్కొని వెంటనే జవాబు వ్రాయమనికూడా ఉత్తరంవ్రాసి ఆరోజునే టపాలోవేసేను....

కబురుపంపితే విజయవచ్చి కూర్చుంది. నా ఉత్సాహాన్నిబట్టి ఊహిస్తే కళకళలాడుతూ ఉండవలసిన తనముఖం చీదరగానూ చీకాకుగానూ ఉంది. నిన్నరాత్రి నన్ను అడయారులో వదిలివెళ్ళిన విజయ ఈమనిషేనా అనిపించింది.

"ఎందుకు, విజయా, అలా ఉన్నావు ?"

"ఎలా ఉన్నాను ?"

"జ్వరంవచ్చినదానిలా ఉన్నావు."

"ఒంట్లో, బాగాలేదు."

"సముద్రంలో తడవడంవల్లనా ?"

"ఏమో.... ఈవాళ మాగదిలో స్నేహితురాళ్ళు ఎవరినోపిలిచారు, నన్నుకూడా ఉండమన్నారు.... రెండుమూడు రోజులుపోయాక వస్తావా ?"

"రేపూ ఎల్లుండీకూడా ఎవరినైనా రమ్మన్నారా మీ స్నేహితురాళ్ళు ?"

"పోనీ, ఎల్లుండిరా."

"విజయా, నిన్ను పెళ్లిచేసుకోవాలని ఉందనీ, నిన్ను పెళ్ళిచేసుకోక తప్పదనీ చెప్పడానికి వచ్చా నీవాళ. పొమ్మంటే పోతాను...అయితే మళ్ళీమటుకురాను.... ఇంతటితో నీకూ నాకూ సరి."

నాకేసి నిర్ఘాంతపోయి చూసింది విజయ. తన కళ్ళల్లో నీరు గిర్రుమని తిరుగుతోంది. నేను మాట్లాడలేను. లోపల మండిపోతున్నాను.

"ఒక్క అయిదు నిముషాలుండు, ఇప్పుడేవస్తాను." అంటూ విజయ లేచి వెళ్లింది........

పైకివెళ్ళడానికి ముస్తాబయి దిగింది విజయ. 'ఎక్కడికి వెళ్ళడానికి?' అని అడిగితే, 'ఎక్కడికైనాసరే. ఇక్కడమాత్రం కూర్చోవద్దు,' అని సమాధానం చెప్పింది. ఆఖరికి చెట్‌పట్ స్టేషనుకి వెళ్ళేం. తాంబరానికి టిక్కెట్టుకొన్నాం.

తైలులో కూర్చున్నాక, "నామీద అంత కోపంగా ఉండడం న్యాయమేనా?" అని అడిగింది విజయ.

"ఇందులో కోపానికేముంది? ఏపనిమీద నిన్ను ఈవాళ చూడడానికి వచ్చానో బోధపరచాను. నీకు ఇతరవ్యవహారాలూ ఇతర వ్యాపకాలూ ఎక్కువముఖ్యమైతే, తప్పకుండా ముందు వాటినే చక్కబెట్టుకోమన్నాను. అందులో తప్పేముంది?"

"నువ్వు ఎన్నడూ నన్ను పెళ్ళిచేసుకునేందుకు వీలులేదు."

"ఎందుకు వీలులేదు?"

"నే నొప్పను కనుక."

"ఎందుకు ఒప్పవు?"

"చూస్తూ నిన్ను నీ జీవితం వ్యర్థపరచుకోనిస్తానా?"

"విజయా, ఇలాంటి పిచ్చిమాటలు మాట్లాడొద్దు. నా జీవితం వ్యర్థం అయేదీ లేనిదీ నాకు తెలుసును. నువ్వు ఆవిషయం ఆలోచించొద్దు.... నీకు నన్ను పెళ్ళిచేసుకోడం ఇష్టమా అయిష్టమా? అంతే నువ్వు ఆలోచించి జవాబు చెప్పవలసిన విషయం."

"నాకు ఇష్టంలేదంటా ననుకో."

"ఎందుకు ఇష్టంలేదనికూడా అడుగుతాను."

"కారణా లలా అడగకూడదు....ఇంతకీ, నా సంగతంతా తెలిసికూడా, నన్ను పెళ్ళిచేసుకుంటాననడం ఏమిటి?....నాసంగతి మీవాళ్ళందరికీ తెలిస్తే ఏమంటారు నిన్ను? ఎంత చులకనచేస్తారు నిన్ను?"

"మావాళ్ళంతా ఎవరు? నాకు తల్లితండ్రులులేరు, తాత ముత్తాతలులేరు. మేనమామలూ పినతండ్రులూలేరు. ఉన్నదల్లా పెంచి పెద్దవాడినిచేసిన మా అన్నపూర్ణ దొడ్డమ్మ ఒక్కతే"

"ఆవిడ మాత్రం అనరూ?"

"ఏమంటుంది?"

"నన్ను పెళ్ళిచేసుకోకూడదని."

"ఎప్పటికీ అనదు....నువ్వంటే చాలా ఇష్టం మా దొడ్డమ్మకి."

"అది వేరేసందర్భంలో....ఇంతకీ, నాకిష్టంలేదు."

"మా దొడ్డమ్మకివ్రాసి తనకి ఇష్టమే అని జవాబు తెప్పించి చూపించనా?"

"ఎప్పటికీ అలా వ్రాయరావిడ, నా చరిత్రంతా ఆవిడకి తెలియపరిస్తే."

"ఎందుకు తెలియపరచాలి?"

"దాస్తే దాగుతుందా? అదికాక ఆవిడకి నా సంగతంతా తెలిసినతర్వాత ఆవిడ ఒప్పుకుంటేనే ఒప్పుకున్నట్టు."

"తెలిసినా ఒప్పుకుంటుంది....మా దొడ్డమ్మసంగతి నీకు తెలియదు. ఇటువంటి అభ్యంతరాలేవీ ఉండవు తనకి. మా చుట్టాలలో ఒకతను భర్తపోయిన పిల్లని

పెళ్ళిచేసుకునివస్తే అందరూ సంకోచించే రోజులలో తను వాళ్ళకి పంక్తిలో భోజనంపెట్టి సకల మర్యాదలూ చేసింది."

"నిన్న నువ్వనడం కామేశ్వరికే నా సంగతంతా చెప్పిఉండకూడదన్నావే, మరి?"

"కామేశ్వరి విషయంలో వేరుకారణాలవల్ల అలా అన్నాను. కామేశ్వరిది మా దొడ్డమ్మపాటి ఉదారస్వభావంకాదు."

"అసలు, నిన్న నేను చెప్పినవెంటనే నీకుకూడా నామీద కొంత విరక్తిపుట్టింది ....నిజమని ఒప్పుకుంటావా?"

"ఏమీ విరక్తి పుట్టలేదు. ఎందుకలా అనుకుంటున్నావు?"

"లేకపోతే కామేశ్వరికి చెప్పిఉండకూడదని అనుండవు."

"కామేశ్వరి గురించి ఆమాట అన్నానుకాని, నావిషయంలో ఏమన్నానో జ్ఞాపకంలేదూ? మరొకలాగా మరొకలాగా సంకోచిస్తే అంత సంతోషంగా ఉందుమా నిన్న?"

"అదంతా తర్వాత సంగతి....చెప్పినవెంటనే నువ్వుకూడా సంకోచించావన్నాను....ఇంతకీ నీవిషయంలో మాత్రం వెంటనే ఏమన్నావు?"

"ఏమన్నానో నీకు జ్ఞాపకంలేదూ?"

"చెప్పు."

"నాకుకూడా నీసంగతి చెప్పిఉండకూడదేమోనని నువ్వు అనుమానంగా అంటే ఏమన్నాను?"

"ఏమన్నావు?"

"ఆ అనుమానం మన ఇద్దరి భవిష్యత్తే తీర్చాలన్నాను."

"అంటే?"

"నిన్ను పెళ్ళిచేసుకోడానికి నేను తయారుగా ఉన్నాను కనుక నావిషయంలో నీకు అటువంటి అనుమానం ఉండకూడదని."

"నామాటవిను. నన్ను పెళ్ళిచేసుకుంటానని అనొద్దు. నీకు అడ్డుచెప్తున్నానని కాదు, నీ మంచికోసమే చెప్తున్నాను.... ఈ ఏడాదీ వచ్చే ఏడాదీ అయిపోతే బెంగుళూరు వెళ్ళిపోతాను నేను, ఆతర్వాత నా సంపర్కమే ఉండదు నీకు సుఖంగా ఉందువుగాని....నావల్ల నీకు సుఖం ఉండదు. నలుగురిలోనూ కాకుండా చేస్తాను నిన్ను. నువ్వు దుఃఖపడతావు. నేను దుఃఖపడతాను....వద్దు. నిజంగానే చెప్తున్నాను .... నేనుచేసినది తాపొరపాటు. నిన్న నీతో అడయారువచ్చి ఉండకూడదు. అదే అనుకున్నాను రాత్రంతా. ఇకమీదట నన్ను చూడడానికి హాస్టలుకి రావద్దని ఈవాళ నీతో చెప్దామనుకున్నాను. నిజంగా అనుకున్నాను. మళ్ళీ నువ్వువచ్చి ఇంక రాననేసరికి ఇలావచ్చేసేను నీతో....హాస్టలులో ఎంతోమంది చూసేరు, నాతో నువ్వు కోపంగా మాట్లాడడం."

"మన పరిస్థితులూ మన ఆలోచనలూ ముఖ్యమా మనకి, ఇతరులు చూసినదీ

ఇతరులు అనుకుంటున్నదీ ముఖ్యమా, విజయా?"....

తాంబరం స్టేషనులో దిగేం. పక్క కంపార్టుమెంటులోంచి ఒక పెద్దమనిషి దిగి, "ఏమండోయి, ఇలావచ్చారేం?" అని పలకరించాడు నన్ను. పదిగజాల దూరంలో విజయని ఎరుగున్న పిల్ల ఎవరో దిగుతూ విజయనిచూసి సహవాసరీత్యా నవ్వింది.

విజయా నేనూ చెంగల్‌పట్ రోడ్డున నడవడం ప్రారంభించాం.

"విజయా, నీకు నిజంగా నన్ను పెళ్ళిచేసుకోవాలని లేదూ?"

"నువ్వు నన్ను పెళ్లిచేసుకోడం తప్పు."

"నేను తప్పుపనే చెయ్యదలచుకున్నాననుకో, నీకు అభ్యంతరం ఏమిటి?"

"నీకూ నీవాళ్ళకీ కాకుండాచేస్తానన్న భయం. భయమేమిటి, నమ్మకం."

"నావాళ్ళెవరూ లేరని చెప్పేనుగా. ఉన్నదల్లా మా దొడ్డమ్మ.... పోనీ, మా దొడ్డమ్మకి ఎటువంటి అభ్యంతరమూ లేదని తనదగ్గరనుంచి ఉత్తరం చూపిస్తే నువ్వు ఒప్పుకుంటావా?"

"అప్పుడుకూడా చెప్పలేనుకాని, అప్పుడు ఒకవేళ ఒప్పుకుంటానేమో.... ఆవిడ ఒప్పుకున్నా, నేను ఒప్పుకోకూడదు ఇది అసంభవం.... నేను చేసినదంతా తప్పని ఇప్పుడు నాకు బాగా బోధపడుతోంది."

"నేను చేసినదికూడా తప్పేనా?"

"ఒకవిధంగా తప్పే.... అనేక సంవత్సరాలనుంచి నేను చదువుకుని ఉద్యోగం చెయ్యాలని నిశ్చయించుకున్నాను. పెళ్లీ పిల్లలూ నాకు కాదనుకున్నాను. ఎవరినీ ప్రేమించకూడదనుకున్నాను.... నువ్వు కనపడ్డావు. నా జీవితం అంతా తారుమారు చేసేవు. నాకు లేని సమస్యలన్నీ తెచ్చిపెట్టేవు...."

"నువ్వు చదువుకోడానికీ ఉద్యోగంచెయ్యడానికీ అడ్డుపడుతున్నానా?.... నిజానికి నువ్వు ఈ డాక్టరీ పరీక్ష ప్యాసయాక ప్రాక్టీసుపెడ్తావనీ, నేను సంపాదించేదేదో నేను సంపాదిస్తాననీ, నువ్వు సంపాదించేదేదో నువ్వు సంపాదిస్తావనీ, ఇద్దరి సంపాదనలూ కలిపితే హాయిగా ఇద్దరం ఉండొచ్చుననీ అనుకుంటున్నాను."

"అంతదూరం ఆలోచించావా నువ్వు?"

"మరేమనుకున్నావు?.... పిల్లలపేర్లుకూడా చెప్పమంటే చెప్తాను!.... చెప్పమంటావా?.... నవ్వులాటగా కాదు, నిజంగానే."

"ఇకను వెనక్కి తిరుగుదాం, హాస్టలుకి వెళ్ళిపోవాలి. ఉండిపోతానని చెప్పి, ఎందుకిలాబయలుదేరేనోనని మా స్నేహితురాళ్ళందరూ ఆశ్చర్యపడుతూఉంటారు."

"నేను అడిగిన విషయానికి సమాధానం చెప్తేకాని నిన్ను వెళ్ళనివ్వను."

"ఎలా సమాధానం చెప్పడం?"

"మళ్లీ మొదటికివచ్చావు."

"మీ దొడ్డమ్మగారికి వ్రాసి జవాబు తెప్పించు.... అయితే, ఒక్క షరతు. నేను నీకు చెప్పిన వివరాలేవీ ఆవిడకి వ్రాయనక్కరలేదు కాని, మా అమ్మ ఎటువంటిదో మాత్రం ఆవిడకి తెలియపరచాలి."

"తెలియపరుస్తాను. తెలియపరుస్తూ నువ్వుపడ్డ బాధలుకూడా తనకి వ్రాస్తాను.... ఏదో వ్రాస్తాను. నీకెందుకూ?.... మా దొడ్డమ్మ మూడొంతులు అభ్యంతరపెట్టదు. తను అభ్యంతరపెట్టినాకూడా నువ్వు నన్ను పెళ్ళిచేసుకోక తప్పదు."

"నా చదువు పూర్తయేవరకూ అయినా నన్నేమీ నిర్బంధపెట్టకు.... నా చదువు పూర్తికాగానే ఆలోచిద్దాం."

"అంతవరకూ ఆలోచన ఆపదలచుకోలేదు."

"పోనీ, మీ దొడ్డమ్మగారి జవాబు ముందురానీ, ఆవిడ వద్దంటే నువ్వు మానెయ్యాలి.... పోనీ, మానినా మానకపోయినా ఆవిడ ఉత్తరంరానీ.... నిజంగానే, నేను హాస్టలుకి వెళ్ళిపోవాలి. చీకటిపడింది కూడాను"

నిర్మానుష్యంగా ఉన్నచోట ఆగి విజయని దగ్గరికి లాక్కుని ముద్దుపెట్టుకోబోయాను. ముఖం తిప్పేసింది. బలవంతంగా ముద్దుపెట్టుకున్నాను.

"ఇకను వెళ్దాం," అంది విసుక్కుంటూ....

నాలుగైదురోజులు విజయని చూడడానికి వెళ్లలేదు. మొన్నాడు కూర్చుని మా అన్నపూర్ణ దొడ్డమ్మకి ఉత్తరం వ్రాసేను. విజయ చెప్పినదంతా వ్రాయలేదు కాని, విజయ తల్లికీ విజయకీ తటస్థించిన మనస్పర్థలగురించి వ్రాసేను. విజయని నేను ప్రేమిస్తున్నసంగతి కామేశ్వరికి తెలుసునని వ్రాసేను. కామేశ్వరి ఉంటే తను తప్పకుండా నా కోరికతో ఏకీభవించి ఉండుననీ, కామేశ్వరి లేదు కనుక కామేశ్వరి లేని లోటు మా దొడ్డమ్మే తీర్చాలనీ, నా ఆనందమే తన ఆనందంగా భావించి నన్ను ఆశీర్వదించాలనీ వ్రాసేను.

రెండురోజుల తర్వాత మా బెజవాడ స్నేహితుడు జవాబువ్రాసేడు :

"బ్రతికి బాగున్నవాళ్ళం ఇంతమంది ఉండగా కీర్తిశేషులైన శ్రీమత్ గొబ్బెముక్కల రమణయ్యగారిగురించే నీకంత ఆప్యాయంతోకూడిన కుతూహలం ఎందుకుకలగాలో తెలియడంలేదు. వీధిలో కనపడ్డవాళ్ళందరినీ అడిగితే ఒకరిద్దరు ముదుసలిజనము మాత్రమే వారి నెరుగుదుమన్నారు. వయస్సు ముదిరినతర్వాత ఆయన చక్కటి పడచుని వివాహం చేసుకుంటే, ఆవిడ ఆయన్ని దుఃఖసముద్రంలోముంచి లేచిపోయిందట. ఆయన ఆటుతర్వాత ఆట్టే కాలం బ్రతకలేదట. ఆమె ఇప్పుడు మైసూరులో రాజమర్యాదలు పొందుతున్నట్టు వదంతి ఉందట. కీ॥ శే॥ రమణయ్యగారికి పిల్లలున్నారో లేదో తెలియదుకాని, ఆయన భార్యకి ఒక కూతురనీ, ఆ కూతురు మైసూరులో చదువుకుంటోందనీ కూడా చెప్పుకుంటారట. రామినాయుడుపాలెం గొబ్బెముక్కలవారికీ వీరికీ సంబంధం

ఉందట. కీ॥ శే॥ రఘుణయ్యగారి చుట్టాలు ఆప్తేమంది ఉన్నట్టులేరు. ఆయన సోదరి బందరులో ఉన్నారట, ఆవిడచరిత్రకూడా కనుక్కోగలమంటే భవద్విధేయుడు కనుక్కొని వ్రాయగలవాడు... ఇంతకీ, బాబూ, నువ్వు తల్లిని కలుసుకున్నట్టా, కూతురిని కలుసుకున్నట్టా? లేకపోతే, తెనాలిరాముని పద్యం యొక్క న్యాయమేనా?"....

ఈ ఉత్తరం వచ్చిన మొన్నాడు మా దొడ్డమ్మదగ్గరనుంచి జవాబువచ్చింది. ఇలా వ్రాసివుంది :

"అబ్బాయీ, నువ్వు పెద్దవాడివయావు. నీకు సలహాలిచ్చేపాటి తెలివితేటలు నాకులేవు. మీ అమ్మచూస్తూ నిన్నీపిల్లని చేసుకోనివ్వకపోను. తొమ్మిదినెలలు మోసి నిన్నుకన్న మీ అమ్మ బతికిలేదు. ఆరునెలల పాపవైనప్పటినుంచీ పెంచి పెద్దవాడినిచేసిన నేనుమాత్రం ఇంకా బతికిఉన్నాను. నామీద ఆ మర్యాదఉంచి ఉత్తరం ముక్కైనా వ్రాసేవు. అదే నా సంతోషం. నువ్వు చదువుకున్నవాడివి. చురుకైనవాడివి. ధైర్యసాహసాలున్నవాడివి. కాని నీకు అనుభవంలేదు. కుటుంబ మర్యాదలూ, గౌరవాలూ పాటించి పెళ్ళిళ్లు చేసుకోవాలనీ, తల్లితండ్రులవి చూసి పిల్లల్ని ఎన్నుకోవాలనీ మన పూర్వులు చెప్పేరు.... ఈ పిల్లవిషయమై నేనేమీ అనను. అనేందుకు నాకేమీ తెలియదసలు. కామేశ్వరిఉంటే ఏమనుండునో నాకు తెలియదు కామేశ్వరి నీకంటె గడుసుపిల్ల.... ఇంతకీ అటువంటి తల్లిపిల్లని చేసుకోమని నేను ముమ్మాటికీ సలహాచెప్పను. సంఘానికీ ఎవరమూ అతీతులం కాము.... మీ అత్తగారు రేపు నీఇంటికివస్తే ఎలాపరిణమిస్తుందో నువ్వే ఆలోచించు.... నేను వృద్ధాప్యంలోపడ్డాను. కామేశ్వరి పోయినప్పటినుంచీ, జీవితంలో సుఖంలేకపోయినా, కష్టాలికనేముంటాయి. ఏవీ లేవనుకున్నాను. అదే నా ఆఖరికష్టం అనుకున్నాను. మళ్ళీ కష్టం తెచ్చిపెట్టున్నావు. రోకలిపోట్లు ఇంకా ఉన్నాయనిపిస్తున్నావు. నాకు ఏమీ తోచడంలేదు. రాగలిగితే వెంటనే నిన్ను చూడడానికి వద్దును. నువ్వే నన్ను వెంటనే చూడడానికి రావాలి. మీ అమ్మే నిన్ను బతిమాలుకుంటోందనుకో. కామేశ్వరే నిన్ను హెచ్చరిస్తోందనుకో.... నన్ను కలుసుకుని మాట్లాడందేమట్టుకు ఘోరమైనపని ఏదీ చెయ్యకు. ఇదే నా ప్రార్థన,"........

మొన్నాడు విజయని కలుసుకున్నప్పుడు, "మీ దొడ్డమ్మగారికి ఉత్తరంవ్రాసేవా? ఏమని జవాబిచ్చారావిడ?" అని అడిగింది.

"ఉత్తరం వ్రాసేనుకాని, జవాబింకా రాలేదు," అన్నాను.

(సశేషం)



## జూన్ నెల పజిలుకు సరియైన సమాధానము

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | ఆం | ధ్ర | జ్యో | తి | | క | మ | ల |
| | గి | | | క్ర | | | ను | త |
| స | ర | ము | | స | స | | జు | |
| | స | త్య | ము | | గ | రు | డు | డు |
| భూ | | ము | ది | మి | | ష | | రు |
| వ | గ | | | న్ను | క | | యు | వ |
| తి | ల | క | ము | | సి | గ | | |
| | గ | డు | స | రి | | రి | పా | కా |
| కీ | ల | | లి | | కు | క | వు | లు |

ఈ పజిలుకు తప్పులేకుండా సమాధానం పంపినవారు ఒక్కరుకూడా లేరు

ఒక్కతప్పుతో మొదటి బహుమానం పొందినవారు నలుగురు.

వీరికి ఒక్కొక్కరికి రు. 3-12-0 విలువగల పుస్తకాలు ఇవ్వడమైనది

1. గొల్లపూడి వెంకటేశ్వరరావు. గుంటూరు. 2. జిష్టు వెంకటసుబ్బారావు. కాకినాడ. 3. మన్నం రంగయ్య, కాకుటూరుపాలెం, టంగుటూరుపోస్టు. 4. మల్లిపూడి సంజీవరావు, కాకినాడ.

రెండు తప్పులతో రెండవ బహుమానం పొందినవారు 17 మంది.

వీరికి ఒక్కొక్కరికి ఒక 'కల్యాణి' అను పుస్తకం పంపుతాము

1. చందరాల నాగేశ్వరరావు. బిళ్లపాడు. అంగలూరు పోస్టు. 2. రావూల రాములు. తిరువూరు. కృష్ణాజిల్లా. 3. వి. హనుమంతరావు. పెద్దపడుగూరు. 4. బి. జయరామిరెడ్డి. గురిజాల, సింహాద్రిపురం పోస్టు. 5 రా. వెం. సీతామహాలక్ష్మి, కన్నడి 2 వ వీధి. మద్రాసు 4. 6. తూములూరి మల్లికార్జునరావు. పెద్దవడ్లపూడి. (వయా) మంగళగిరి. 7. బి.టి వెంకటాచారి. రామలింగేశ్వరపేట. తెనాలి. 8. జి. శంకరరావు. కర్నూలు. 9. సాక్షి లక్ష్మీకాంతరావు. చెన్నూరు (వయా) గుడ్లవల్లేరు. కృష్ణాజిల్లా. 10. యి. శ్రీరామశాస్త్రి. మండపేట. తూ. గోదావరి. 11. యం. రామసుబ్బయ్య, B. A. LL. B. పత్తికొండ. 12. వి. రామమోహనశర్మ. తేలప్రోలు. కృష్ణాజిల్లా. 13. ముళ్లపూడి సర్వేశ్వరరావు. ఛత్రపురం. గంజాంజిల్లా. 14. జి యస్. కామేశ్వరరావు. ఆల్ ఇండియా రేడియో. తిరుచునాపల్లి. 15. మేకవరపు సుబ్రహ్మణ్యశాస్త్రి. మండపేట. ద్వారంపూడి పోస్టు. తూర్పుగోదావరి. 16. వి. రామకోటీశ్వరరావు. మొసలిపాడు (వయా) కొల్లూరు. 17. కె. నరసింహారావు. తుల్లవరం, పేరేచర్ల, గుంటూరుతాలూకా.

# జూలై నెల పజిలు కూపను

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 చం | 2 ద | 3 మా | 4 మ | ■ | 5 | 6 | 7 యు | 8 ము |
| 9 | | | | 10 | ■ | 11 | త్ర | |
| 12 | ద్రు | | ■ | 13 | 14 | | ము | ■ |
| 15 | | ■ | 16 | లి | | ■ | ■ | 17 |
| | ■ | ■ | 18 | | | ■ | 19 ప్ర | |
| ■ | 20 | | ను | | ■ | 21 | | |
| ■ | | ■ | | ■ | ■ | | ■ | ■ |
| 22 | ■ | 23 | ■ | 24 | 25 | | 26 ము | ■ |
| 37 | | | | ■ | 28 | | క | |

సంపాదకుని నిర్ణయమునకు నేను బద్ధుడను.

పేరు.......................................................................

ఊరు.................................................... పోస్టు......................................................

## అడ్డము — ఆధారములు : — నిలువు

**అడ్డము**

1. పిల్లల పత్రిక
5. సమూహము
9. చుట్టుప్రక్కలు 11. ఆకు
12. వినతకు సోదరి
13. సమస్తము
15. కాలిపోవు 16. దండ
18. హారతి
19. కాంతి
20. పంచపాండవులలో ఒకడు
21. స్త్రీ
24. వసించెడి చోటు
27. మన్మధుడు
28. విచారమును సూచించును.

**నిలువు**

1. ఒక పద్యచ్ఛందస్సు 2. భాగ్యహీనుడు
3. వసమా (తలక్రిందులు)
4. యంత్రము 6. చంచల
7. త్రయము (అక్షరముల మార్పు)
8. ముముక్షువు (మొదటి రెండక్షరములు)
10. వృద్ధుడు 14. కథావళి ("థా" లేదు)
16. మానవతులు
17. ఒక సంవత్సరము పేరు
19. ప్రగతి (మధ్యభాగము)
20. పాము 21. అలసిపోవుట
22. త్రిమూర్తులలో ఒకరి భార్య
23. ....ర్వేదము 25. సెలయేరు
26. ఎముక (మొదటిఅక్షరము లేదు)

బహుమానాలు పుస్తకాల రూపంలో పంపబడును.

# పరిష్కారమైంది!

## మన ఆహార సమస్య





పరిశోధనలవల్ల తెలుస్తున్న దేమంటే మనశరీర నిర్మాణానికి అవసరమైన ప్రొటీన్లు, పోషక విటమిన్లు, ధాతుపుష్టినిచ్చే క్రొవ్వు పదార్థాలు పిండిపదార్థాలు లోపంలేకుండా వుండాలి.

దిన దినాహారంలోని యీలోపాలు తీర్చుటకొరకై పుతంచేసి ముందుగ జీర్ణింపించి తయారుచేసిన ప్రొటీన్లు, ఖనిజలవణాలు, విటమిన్లు మొదలైనవాటి మిశ్రసారము ఆహారముతోపాటు పుచ్చుకొనుట అవసరమని శాస్త్రజ్ఞులు తెలుసుకున్నారు.

హిందూదేశమున పెద్దలు, పిన్నలు ఆరోగ్యములో అభివృద్ధిపొందటానికై యీశరీరరక్షణాహారాలను తయారు చేయుటలో మెక్ లెక్ వారే ప్రథములు. ప్రత్యేకశాస్త్రవేత్తలు వీరితయారువస్తువులనుపరీక్షించి అవి సమపాలనంగా లేనిమనఆహారలోపాలను తీరుస్తాయని ప్రకటించారు.

**మెక్ లెక్ ప్రొటీనులఆహారము:** వయోవంతులకుగాను పుతము వేసి ముందుగ జీర్ణింపించి తయారు చేసిన ప్రొటీను పదార్థము.

**మెక్ లెక్ శిశు ఆహారము:** పైవిధంగానే శిశువులకు అవసరమైన పదార్థము.

**మెక్లో విట్స్:** వయోవంతులకు అవసరమైన మల్టి విటమిను బిళ్లలు

**సిరప్ కాల్సిటాల్:** శిశువుల అవసరమైన మల్టి విటమిను సిరప్

**ప్రొటెజెన్ మరియు పెప్టొజెన్:** బలహీనులకిది ముఖ్యము.

సమపాలనాహార విధానమును తెలిపే వ్యాఖ్యానమునకు వ్రాసిన ఉచితముగా పంపబడును.




**మెక్ లెక్ న్యూట్రిమెంట్సు**

మీ ఆహార పదార్థములను సమపాలనం చేయును.

ది మెక్లెక్ న్యూట్రిమెంట్సు అండ్ ఫార్మాస్యూటికల్సు, లిట్.
11, ఎ. ఆర్మీనియన్ స్ట్రీట్, జి టి మద్రాసు.

ADARTS MNP 43 D Telugu



# How to make a LITTLE food go a LONG way



ఆహారపదార్థాల కొరతవలన ఈనాడు రేషన్సు అతి తక్కువగా ఇవ్వబడుతున్నాయి. అందువలన ప్రతి ఆదర్శగృహిణి ఈరోజుల్లో ఎంతో తక్కువ ఆహారాన్ని చాలా ఎక్కువ ఉపయోగంలోకి తేవాలి.

ఇందుకుగాను ప్రతివంటకమూ సాధ్యమైనంత రుచికరంగా చేసుకోవాలి. స్వస్తిక్ వారి గోవాలిన్ మార్కు వనస్పతితో పూరీలు, చపాతీలు, బజ్జీలు ఎంతో రుచికరంగా చేసుకోవచ్చు.

2 పౌన్లు, 5 పౌన్లు, 10 పౌన్లు డబ్బాలు ప్రతి షాపులోను దొరకును.

DOWALIN BRAND

# SWASTIK VANASPATI

UNMATCHED FOR QUALITY

**SWASTIK OIL MILLS LIMITED, BOMBAY.**

SOM-8 SHILPI

BE INDIAN - - - - - - - - - - -BUY INDIAN!

సేల్సు డిపో, 14 G. స్ప్రింగర్ వీధి, లోన్‌స్క్వేర్, మద్రాస్.

---

బి. ఎన్. కె. ప్రెస్, 37, ఆచారప్పన్ వీధిలో బి. నాగిరెడ్డిగారిచే ముద్రింపబడి అదేచోట బి. ఎన్. గుప్తగారిచే ప్రకటించబడింది. సంపాదకుడు: చక్రపాణి.

# యువ

యువకుల మాసపత్రిక

[illegible] సాహిత్యపు పోటీలు [illegible]
[illegible] ప్రకటిస్తాము. ఈ విషయంలో
[illegible] తోడ్పడమని ప్రతి విద్యార్థిని
[illegible]

[illegible] సాహిత్యపు పోటీలు [illegible]
[illegible] వ్యాసాలు ఉంటాయి.
[illegible] అర్థిస్తున్నాము.

సంవత్సరం చందా రూ. 5-0-0
విడి ప్రతి 0-6-0

సంచిక [illegible] వెలువడుతుంది.

యువ కార్యాలయం
37, ఆచారప్పన్ వీధి
జి. టి. మద్రాసు 1.




**VAUHINI PICTURES LTD.**

MADRAS : BEZWADA : TADPATRI

PRINTED AT THE B. N. K. PRESS, 37, ACHARAPPAN ST. MADRAS - 1